www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 26 బుధవారం | మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 190

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

ఏప్రిల్ 3న విస్తరణం

- మంత్రివర్గ విస్తరణకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్
- 3న కొత్త మంత్రుల ప్రమాణస్వీకారం
- కొత్త మంత్రులు నలుగురా..ఐదుగురా!?
- రాజ్‌గోపాల్‌రెడ్డి,వివేక్‌లకు ముందే సంకేతాలు
- ఒక రెడ్డి,ఒక ఎస్సీ,ఒక మైనార్టీ,ఒకరు బీసీకి ఛాన్స్
- మైనార్టీకి ప్రాతినిధ్యం లేకపోతే బీసీకి ఛాన్స్

హైదరాబాద్-నవభూమిబ్యూరో: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ఏఐసీసీ పచ్చజెండా ఊపింది. ఏప్రిల్ 3న కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉండే అవకాశం ఉంది. ఇద్దరు బీసీలు, రెడ్డి, ఎస్సీకి మంత్రివర్గంలో చోటు దక్కనున్నట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర కోర్ కమిటీ నుంచి ఏఐసీసీ వివరాలు తీసుకుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నుంచి అభిప్రాయాలు సేకరించింది. సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి లో ఒకరికి చోటు దక్కే అవకాశం ఉంది. బీసీలో శ్రీహరి ముదిరాజ్, ఆది శ్రీనివాస్ కు.. ఎస్సీలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కి చోటు దక్కే అవకాశం ఉంది. మొత్తం ఆరు ఖాళీల్లో నాలుగైదు స్థానాలు భర్తీ చేసే అవకాశం ఉంది. మైనారిటీలకు అవకాశమిస్తే ఎమ్మెల్సీ అమీర్ అలీబాన్కు చోటు దక్కే అవకాశం ఉంది. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి, వివేక్ వెంకటస్వామికి ముందే సంకేతాలు వెళ్లినట్లు వినిపిస్తోంది.మంత్రి పదవిపై ఆశ పెట్టుకున్న అద్దంకి దయాకర్‌కు నిరాశే మిగిలింది.

ముస్లింలకు మోదీ మార్క్ రంజాన్ తోఫా

- 32 లక్షల మంది ముస్లింలకు రంజాన్ తోఫాలు
- పేదముస్లింలకు నిత్యావసర వస్తువులతోకిట్లను పంపిణీ
- ఈ కిట్లకు సౌగత్-ఇ-మోదీ అని పేరు
- కిట్లను పంపిణీ చేయడం22

2

న్యూదిల్లీ-నవభూమిబ్యూరో: ముస్లింలు జరుపుకొనే అతి పెద్ద పండుగ.. రంజాన్. నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలను పాటించిన అనంతరం భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. ఈ నెల 1వ తేదీన నెలవంక కనిపించడంతో ఈ పండగ సందడి ఆరంభమైంది. ఉపవాస దీక్షలు మొదలయ్యాయి. చంద్ర దర్శనం తరువాతే.. ముస్లింలు నెల రోజుల కాలాన్ని లెక్కించడానికి క్యాలెండర్‌కు బదులుగా చంద్రుడిని ఆధారంగా తీసుకుంటారు. నెలవంక దర్శనంతో ఆరంభం అయ్యే రంజాన్ ఉపవాస దీక్షలను మళ్లీ.. చంద్ర దర్శనం తరువాతే ముగిస్తారు. ఆ మరుసటి రోజే పండగను జరుపుకొంటారు. నెల రోజుల తరువాత కూడా చంద్రుడు కనిపించకపోతే- మరో రోజు ఉపవాస దీక్షలను

హోం శాఖ అంటే ఇష్టం

- మంత్రి పదవిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మనసులోని మాట
- ప్రజల పక్షాన నిలబడతా-ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తా
- మంత్రుల ఎంపిక అదిష్టానం నిర్ణయం..ఎవర్ని ఎంపిక చేసినా మద్దతిస్తా
- దిల్లీలో విస్తరణపై చర్చ జరుగుతుందని,కానీ ఎంపికపై ఫోనేదీ రాలేదు

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో: తెలంగాణలో రాజకీయాలు మరోసారి హీటెక్కాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతుండగా.. ఉగాది సందర్భంగా మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు చేసినట్టు తెలుస్తోంది. మొత్తంగా ఆరు మంత్రి పదవులకు అవకాశం ఉండగా.. ఈసారి నలుగురికి ఛాన్స్ ఇవ్వనున్నట్టు సమాచారం. రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. ఈ క్రమంలోనే మంత్రి పదవిపై తన మనసులో మాట బయటపెట్టారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఈసారి కేబినెట్ విస్తరణలో తనకు మంత్రి పదవి వస్తుందని రాజగోపాల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తనకు హోంశాఖ అంటే ఇష్టమని మనసులో మాట బయటపెట్టారు. ఈ క్రమంలోనే ప్రజల పక్షాన నిలబడతానని.. ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. మంత్రుల ఎంపిక అదిష్టానం నిర్ణయమని స్పష్టం చేశారు. కేబినెట్ విస్తరణపై ఢిల్లీలో సీరియస్ గానే చర్చ జరిగినట్లుందని అన్నారు. అయితే తనకు ఇంకా ఢిల్లీ నుంచి ఎలాంటి ఫోన్ రాలేదని తెలిపారు. ఇక కేబినెట్

వైఎస్ అవినాష్ రెడ్డికి బిగ్‌షాక్

- వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డి పాత్రను నిర్ధారించేలా ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కీలక అఫిడవిట్ దాఖలు
- వైఎస్ అవినాష్ రెడ్డి సూచనల మేరకే వివేకా పీఏ కృష్ణారెడ్డి పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసుల నిర్ధారణ

2

అమరావతి-నవభూమిబ్యూరో: ఏపీలో కడప వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. గతంలో తన బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ నిందితుడిగా చేర్చిన అవినాష్ రెడ్డి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. అయితే ఈ కేసులో ఆయన పాత్రను నిర్ధారించేలా ఏపీ ప్రభుత్వం ఇవాళ సుప్రీంకోర్టులో కీలక అఫిడవిట్ దాఖలు చేసింది. దీంతో సుప్రీంకోర్టు ఈ వ్యవహారంపై ఎలా స్పందిస్తుందన్నది ఉత్కంఠ రేపుతోంది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య తర్వాత సీబీఐ దర్యాప్తు మొదలుపెట్టింది. అయితే సీబీఐ ఈ కేసులో వివేకా పీఏ కృష్ణారెడ్డి పాత్రపై అనుమానాలు వ్యక్తం చేయగా.. ఆయన మాత్రం సీబీఐ ఎస్పీ రామ్ సింగ్, వివేకా కుమార్తె సునీతారెడ్డి, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డిపై ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా గతంలో పులివెందుల పోలీసులు వీరిపై కేసు నమోదు చేశారు. తాజాగా దీనిపై మరోసారి విచారణ జరిపిన పోలీసల్లు.. కృష్ణారెడ్డి తప్పుడు ఫిర్యాదు చేసినట్లు తేల్చారు. వైఎస్ అవినాష్

33 రోజులకు ఓ మృతదేహం

- టన్నెల్ ప్రమాదంలో మృతుల్లో మరొకరి పార్థివదేహం వెలికితీత
- కన్వేయర్ బెల్ట్‌కు 50 మీటర్ల దూరంలో దుర్వాసన
- కన్వేయర్ బెల్ట్ శిథిలాలను తొలగించి మృతదేహం బయటకు
- పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలింపు
- మృతుడు ఎవరనేది తేల్చే పనిలో పోలీసులు

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో:శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం ప్రమాదంలో మరో మృతదేహం లభ్యమైంది. ఇవాళ ఉద యం రెస్క్యూ సిబ్బంది తవ్వకాలు జరుపు తుండగా మృతదేహం ఆనవాళ్లు లభించాయి. కన్వేయర్ బెల్ట్‌కు 50 మీటర్ల దూరంలో దుర్వాసన వస్తున్నట్లు గుర్తించిన సిబ్బంది.. ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపారు. ముందుగా గుర్తించిన అనుమానిత ప్రాంతాలు డీ1, డీ2 కాకుండా మరోచోట తవ్వకాలు జరుపుతుండ గా ఈ మృతదేహం ఆనవాళ్లు లభించాయి. గ్యాస్ కట్టర్ల సాయంతో కన్వేయర్ బెల్ట్ శిథిలాలను తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటన జరిగిన నెలా 3 రోజుల తర్వాత రెండో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్ కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, మృతుడు ఎవరనేది తెలియాల్సి ఉంది.

కాగా, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి ఇప్పటికే నెల రోజులు గడిచిపోయింది. గత నెల 22న ప్రమాదం జరగ్గా.. అందులో చిక్కుకున్న 8 మంది ఆచూకీ కోసం దేశంలోనే అన్ని ప్రముఖ రెస్క్యూ టీంలను రంగంలోకి దింపారు. ఆర్మీ. ఎన్టీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్, కేరళ కేడావర్ డాగ్స్ స్క్వాడ్ వంటి వాటితో రెస్క్యూ చేపట్టారు. గత 15 రోజుల క్రితం గురుప్రీత్ సింగ్ అనే కార్మికుడి మృతదేహం లభ్యమైంది. అప్పటి నుంచి తవ్వకాలు చేపడుతున్నా ఎలాంటి పురోగతి లభించలేదు. టన్నెల్ లోపల ప్రమాదకర పరిస్థితులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. భారీగా మట్టి పేరుకుపోవటం, నీటి ఊట ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని అంటున్నారు. అయితే టన్నెల్ ప్రమాద ఘటనలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ప్రమాదం జరిగిన ఏడు

త్వరలో మెగా డీఎస్సీ

- ఏప్రిల్ తొలి వారంలో మెగా డిఎస్సీ ప్రకటన
- ఏపీ కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు ప్రకటన..!
- ఏబిసిడి వర్గీకరణ నిర్ణయించాం
- డిఎస్సీ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను కోరిన సీఎం

2

అమరావతి-నవభూమిబ్యూరో

ఏపీలో కలెక్టర్ల సమావేశం అమరావతి సచివాలయంలో ప్రారంభమైంది. ఇందులో సీఎం చంద్రబాబు కలెక్టర్లను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. ప్రజలకు ఆమోదయోగ్యంగా అధికారులు పనిచేయాలని ఆయన కోరారు. కలెక్టర్లు దర్పం ప్రదర్శించడం కాదని, క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ఒక్కో నాయకుడి పాలన ఒక్కోలా ఉంటుందని, కొందరు అభివృద్ధి చేస్తే..మరికొందరు నాశనం చేస్తారని జగన్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ప్రజలకు హామీఇచ్చా మని, అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన తమ విధానమని తెలిపారు. సంక్షేమ పథకాలు లేకపోతే పేదరిక నిర్మూలన జరగదన్నారు. సంక్షేమం అమలు చేయాలంటే అభివృద్ధి జరగాలన్నారు. తెలుగుదేశం పార్టి నాలుగు వందలతో ప్రారంభించిన పింఛను నాలుగు వేలకు చేశామని తెలిపారు. ఇది దేశంలో ఎక్కడా లేదన్నారు. 204 అన్నా క్యాంటిన్లు పెట్టామని, ఇదో స్ఫూర్తి అని తెలిపారు. దీపం పథకం క్రింద ఆడబిడ్డలకు ఒక సిలెండర్ ఉచితంగా ఇచ్చామని, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశామని, చెత్త పన్ను రద్దు చేశామని చంద్రబాబు తెలిపారు. ఏప్రిల్ తొలి వారంలో మెగా డిఎస్సీ ప్రకటన ఇస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఏబిసిడి నిర్ణయించామన్నారు. డిఎస్సీ పకడ్బంధీగా నిర్వహించాలని కోరారు. మెజారిటీ ఉద్యోగాలు తెలుగుదేశం పాలనలోనే ఇచ్చామని గుర్తుచేశారు. బిసీలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ ఇచ్చామని, చేనేతలకు జిఎస్టీ రద్దు చేశామని తెలిపారు. టికెట్ ఫార్ గ్రాంటెడ్ కాదు, బిచ్చగాలకు దానం చేసినట్లు కాదని, చివరి లబ్దిదారునికి కూడా సంక్షేమం అమలు జరగాలని చంద్రబాబు కలెక్టర్లకు సూచించారు. రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారని, ఉదాహరణకు స్టీల్ ప్లాంట్ విశాఖలోనో, అనకాపల్లి లోనే వస్తే ఇలాంటి మోడల్ లో ల్యాండ్ పూలింగ్ చేయాలన్నారు. నేషన్ హైవేస్ కు 55 వేల కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయని,75 వేల కోట్ల రూపాయలతో రైల్వే ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇవి కేంద్ర ప్రభుత్వ పనులని, తమకు సంబంధం లేదని కలెక్టర్లు అనుకోకూడద న్నారు.

మే నెలలో తల్లికి వందనం ఇస్తామని, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 15 వేల రూపాయలు ఇస్తామని చంద్రబాబు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

- 5గురు మావోయిస్టుల హతం
- బీజాపూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు కదలికలు
- భద్రతాదళాలు గాలింపులు..ఎదురుపడిన మావోలు
- ఎదురుకాల్పుల తర్వాత 5గురి మృతదేహాలు లభ్యం

2

బీజాపూర్-నవభూమిబ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి కాల్పుల మోత మోగింది. గత వారంలోనే రెండు సార్లు ఎన్ కౌంటర్ జరపగా.. అనేక మంది మావోయిస్టులు హతం అయ్యారు. ఒకరోజు జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక జవాన్ సహా 24 మంది నక్సలైట్లు మృతి చెందారు. ఇక అదే రోజు రెండో సారి జరిగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు ప్రాణాలు విడిచారు. అయితే తాజాగా మరోసారి భద్రతా బలగాలు దంతెవాడ జిల్లాలో ఎదురు కాల్పులు జరపగా.. 5గురు మావోయిస్టులు హతం అయినట్లు అధికారులు వెల్లడించారు.ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు

నీరా కేఫ్‌పై సర్కార్ కీలక నిర్ణయం

- ట్యాంక్‌బండ్ పీపుల్స్ ప్లాజాలో నీరా కేఫ్
- కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు అప్పగింత
- ఎక్సైజ్,పర్యాటక శాఖలతో సంప్రదింపులు
- వచ్చే ఆదాయంలో 30% టూరిజం శాఖకు చెల్లించాలి

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో:తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ప్రాంతంలోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన నీరా కేఫ్‌ను.. కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు అప్పగించింది. ఈ మేరకు మంగళవారం రోజున కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ సందర్భంగా.. కీలక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు సహకరించిన ఎమ్మెల్సీ, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు కల్లుగీత విభాగం అధ్యక్షులు నాగరాజు గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.

ఎక్సైజ్, పర్యాటక శాఖలతో సంప్రదింపులు జరిపిన ప్రభుత్వం.. నీరా కేఫ్‌ను పర్యాటక శాఖ నుంచి తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నీరా కేఫ్‌ను నిర్మించిన భూమి.. పర్యటక శాఖకు సంబంధించినది కావడంతో..

ట్రంప్ కొత్త పాలసీ

- భారతీయ గ్రీన్ కార్డుదారులకు ఇక చుక్కలే!
- సోషల్ మీడియా విధానం ప్రకటించిన ట్రంప్ సర్కారు
- గ్రీన్ కార్డుదారుల వివరాలు ఇవ్వడం తప్పనిసరి
- వలసలను అరికట్టే చర్యల్లో భాగమేనని వెల్లడి

2



వాషింగ్టన్-నవభూమిబ్యూరో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసలను అరికట్టేందుకు కఠిన చర్యలను అవలంభిస్తున్నారు. ఈ క్రమంలో అక్రమ వలసదారులను గుర్తించి, వారిని వెనక్కిపంపుతున్నారు. వలసలను అరికట్టే చర్యల్లో భాగంగా తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో నివసిస్తున్న గ్రీన్ కార్డ్ హోల్డర్ల సోషల్ మీడియా ఖాతాల వివరాలను ప్రభుత్వానికి అప్పగించాలని ప్రతిపాదించారు. ఇప్పటికే వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వారు తమ సోషల్ మీడియా వివరాలను అమెరికా సిటిజెన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌తో పంచుకుంటున్నారు. ఇప్పుడు ఈ విధానాన్ని అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న వారికి కూడా వర్తింపజేయనున్నారు. శాశ్వత నివాసం కోసం లేదా శరణార్థిగా దరఖాస్తు చేసుకునే వారు కూడా తమ సోషల్ మీడియా ఖాతాలను ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ చర్య ద్వారా ప్రభుత్వంపై విమర్శలు చేసేవారిని అమెరికాలో స్థిరపడకుండా అడ్డుకునే అవకాశం ఉంది. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న చాలా మంది భారతీయులపై ఇది ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రాజకీయాల్లో చురుకుగా పాల్గొనే భారతీయ అమెరికన్లపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది.. ప్రభుత్వ పర్యవేక్షణ ఎక్కువ కావడం వల్ల రాజకీయ విషయాలపై మాట్లాడేందుకు వెనుకాడతారు.

మార్చి 5న ఈ ప్రతిపాదనలు విడుదల చేసిన ట్రంప్ యంత్రాంగం.. ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తోందది. గుర్తింపు, ధ్రువీకరణ, జాతీయ భద్రత, ప్రజల భద్రత కోసం దరఖాస్తుదారుల సోషల్ మీడియా వివరాలను సేకరించాల్సిన అవసరం ఉందని తెలిపింది. సోషల్ మీడియా ఖాతాల ద్వారా వ్యక్తుల గుర్తింపును ధ్రువీకరించడం, వారి గురించి పూర్తిగా తెలుసుకుని.. జాతీయ భద్రతను రక్షించడం

ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్-నవభూమి: ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాలల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని చెప్పారు. ఈ రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 29వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో వచ్చే నెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్ - ఈవినింగ్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.



క్రికెటర్ కావాలని కలలు కన్నా సార్.. యువకుడి మాటలు విని మంత్రి కన్నీళ్లు..!

హైదరాబాద్-నవభూమి: "నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం సార్.. పెద్ద క్రికెటర్ కావాలని ఎన్నో కలలు గన్నా.. నాకొక క్రికెట్ కిట్ ఇప్పిస్తారా.. ప్లీజ్.." అంటూ ధీనంగా అడిగాడు క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న యువకుడు. ఆ మాటలు విని మనసున్న మనిషెవ్వరికైనా కళ్లు చెమర్చక మానవు. అచ్చంగా అదే జరిగింది. క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆ యువకుడు చెప్పిన మాటలు విని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా చలించిపోయారు. తీవ్ర భావోద్వేగాన్ని అపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని పలిమేల మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ అనే యువకుడు కాన్సర్‌తో బాధపడుతూ. హైదరాబాద్ ఖాజాగూడలోని స్పర్శ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు.. స్వయంగా ఆసుపత్రికెళ్లి నితిన్‌ను పరామర్శించారు. నితిన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లతో మాట్లాడి.. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. నితిన్ కుటుంబ సభ్యులతో మాట్లాడిన మంత్రి శ్రీధర్ బాబు.. ధైర్యం చెప్పారు. తానున్నాననే భరోసానిచ్చారు. తనకు క్రికెట్ అంటే చాలా ఇష్టమని, పెద్ద క్రికెటర్ అవ్వాలని ఎన్నో కలలు కన్నట్టు నితిన్ చెప్తున్న క్రమంలో భావోద్వేగానికి గురయ్యారు. నితిన్ మాటలకు మంత్రి శ్రీధర్ బాబు కన్నీళ్లు పెట్టుకున్నారు. అప్పటికప్పుడు.. తన సిబ్బందికి చెప్పి క్రికెట్ కిట్ తెప్పించి.. నితిన్ కోరికను నెరవేర్చారు. అంతేకాదు.. "సొంతన్నలా నితిన్‌కు అండగా ఉంటా.. ఏ అవసరమున్నా నేరుగా నన్ను సంప్రదించండి.." అంటూ యువకుడి తల్లిదండ్రులకు మంత్రి శ్రీధర్ బాబు ధైర్యం చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోపై పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. క్యాన్సర్ నుంచి నితిన్ తొందరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు. మంత్రి శ్రీధర్ బాబు చేసిన పనికి అభినందనలు చెప్తున్నారు. కాగా.. ప్రభుత్వం తరపున నితిన్‌కు మెరుగైన వైద్యం అందించి.. అతన్ని కాపాడాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

డేవిడ్ వార్నర్‌కు రాజేంద్రప్రసాద్ క్షమాపణలు

హైదరాబాద్-నవభూమి: క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు సినీనటుడు రాజేంద్రప్రసాద్ క్షమాపణలు చెప్పారు. డేవిడ్ వార్నర్‌పై తాను చేసిన వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కాదన్నారు. రాబిన్‌హుడ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో వార్నర్‌పై రాజేంద్రప్రసాద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. దీనిపై రాజేంద్రప్రసాద్ వివరణ ఇచ్చారు. వార్నర్‌పై ఉద్దేశపూర్వకంగా మాట్లాడలేదని అందుకు వార్నర్‌కు క్షమాపణలు చెబుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాజేంద్రప్రసాద్ ఓ వీడియోను విడుదల చేశారు.

అయితే రాబిన్‌హుడ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో వార్నర్‌నుపై రాజేంద్రప్రసాద్ సరదాగా కామెంట్స్ చేశారు. కానీ అందులో రాజేంద్రప్రసాద్ అభ్యంతరకరమైన పదాన్ని వాడారంటూ నిన్నటి నుంచి నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజేంద్రప్రసాద్‌పై చాలా మంది సీరియస్ అయ్యారు. ఆయన సరదాగా మాట్లాడినప్పటికీ ఆ విధానం కరెక్ట్‌గా లేదని చాలా మంది అభిప్రాయపడ్డారు. తన వ్యాఖ్యలు ట్రోల్‌కు గురవడంతో రాజేంద్రప్రసాద్ స్పందిస్తూ.. ఓ వీడియోను విడుదల చేశారు. డేవిడ్ వార్నర్ అన్నా, ఆయన క్రికెట్ అన్నా తనకు ఇష్టమని, అలాగే తమ సినిమాలంటే డేవిడ్ వార్నర్‌కు ఇష్టపడతారన్నారు. తమ మధ్య మంచి రిలేషన్ ఉందని, అయితే నిన్నటి తన వ్యాఖ్యలపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారని.. ఇందుకు తాను క్షమాపణలు చెబుతున్నట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఇంతకీ రాజేంద్రప్రసాద్ ఏమన్నారంటే..

'డేవిడ్ వార్నర్‌ను పట్టుకొచ్చారు. డేవిడ్ వార్నర్‌ను క్రికెట్ ఆడవయ్యా అంటే డ్యాన్సులు వేస్తున్నాడు. మామూలోడు కాదండి వీడు. ఏయ్ వార్నరూ. బీ వార్నింగ్' అంటూనే రాజేంద్రప్రసాద్ అభ్యంతరకర పదాన్ని ఉపయోగించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. వార్నర్‌పై రాజేంద్రప్రసాద్ చేసిన కామెంట్స్‌పై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడిన తీరు బాగోలేదంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

అసెంబ్లీ అంటే అదీ.. మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్-నవభూమి: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఏది మాట్లాడినా సంచలనమే. ఏం చేసినా ఆసక్తికరమే. ఆయన మీడియా ముందుకు వచ్చారంటే చాలు ఏదో విషయంపై మాట్లాడుతూ నవ్వులు పూయిస్తుంటారు. ఇప్పుడు తాజాగా మల్లారెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో.. అప్పటి అసెంబ్లీ సమావేశాలు.. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యత్యాసాలను చెప్పుకొచ్చారు. గతంలో అసెంబ్లీని ప్రజలు ఆసక్తిగా చూసేవారని అన్నారు. ఇప్పుడు మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే అన్నట్లుగా సమావేశాల్లో కనిపిస్తోందంటూ కామెంట్స్ చేశారు. అంతే కాకుండా అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, వివేక్ మధ్య జరిగిన సంభాషణ కూడా ఆసక్తికరంగా మారింది. మల్లారెడ్డి కామెంట్స్ ఇవే.. పార్లమెంట్‌లో ఆనాడు మాజీ ప్రధాని వాజుపేయి లాంటి వారు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసేవారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు అత్తుకుని పోయేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడతారని ఆసక్తి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే కనిపిస్తోందంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ కామెంట్స్ సంచలనంగా మారాయి.

మీర్‌పేట మాధవి మర్డర్ కేసులో బిగ్ అప్డేట్.. 'టిష్యూ' పేపర్‌తో తేల్చేసిన పోలీసులు

హైదరాబాద్-నవభూమి: హైదరాబాద్ మీర్‌పేట్ మాధవి హత్య కేసులో బిగ్ అప్డేట్ వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఈ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఇంట్లో దొరికిన టిష్యూ పేపర్‌లో మాధవి డీఎన్ఏ మ్యాచ్ అయినట్లు పోలీసులకు తాజాగా రిపోర్ట్ అందింది. హత్య జరిగిన ప్రదేశంలో పోలీసులకు కీలక ఆధారంగా దొరికిన టిష్యూను డీఎన్ఏ టెస్టుకు పంపగా.. అవి ఆమె పిల్లల డీఎన్ఏతో మ్యాచ్ అయినట్లు తెలిసింది. దాని ఆధారంగా పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. పోలీసులు తమ లైఫ్ టైంలో చూడని కేసు.. కాగా, ఈ ఏడాది జనవరిలో మీర్‌పేట్‌లో జరిగిన మాధవి హత్య కేసు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. భర్త గురుమూర్తి మాధవిని దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఆమె శరీరాన్ని ముక్కలు చేసి, ఉడికించి, కాల్చి, పొడర్‌గా మార్చి జిల్లెలగూడ చెరువులో కలిపేశాడు. అనంతరం ఏం తెలియనట్లు తన భార్య కనిపించటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మూడ్రోజుల తర్వాత భర్తే హత్య చేసినట్లు ఓ నిర్ధారణకు వచ్చారు. అయితే హత్య జరిగిన ప్రదేశంలో ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదు. ఇప్పటి వరకు ఆమె మృతదేహాన్ని కూడా పోలీసులు కనిపెట్టలేకపోయారు. ఈ హత్య పోలీసులను సైతం ఉలిక్కిపడేలా చేసింది. గురుమూర్తి ఈ హత్యను పక్కా ప్రణాళికతో చేశాడని రాచకొండ సీపీ తెలిపారు. ఇది తన సర్వీసులో చూసిన అత్యంత క్రూరమైన కేసు అని అన్నారు. గురుమూర్తి మాధవిని ఎంత క్రూరంగా హత్య చేశాడో, మృతదేహాన్ని ఎలా మాయం చేశాడో రాచకొండ సీపీ సుధీర్ బాబు వివరించారు. 'గురుమూర్తి గతంలో ఆర్మీలో పని చేసి రిటైర్ అయ్యాడు. ప్రస్తుతం ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. భార్యను హత్య చేయాలనే ఉద్దేశంతోనే గురుమూర్తి తన ఇద్దరు పిల్లలను బంధువుల ఇంట్లో ఉంచాడు. జనవరి 16న ఉదయం 8 గంటలకు నిద్రలేచిన వెంటనే మాధవితో గొడవ పెట్టుకున్నాడు. ఆ గొడవలో భాగంగానే మాధవిని చంపాలని నిర్ణయించుకున్నాడు. మాధవిని తలను గోడకేసి బాది చంపేశాడు. మాధవి చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత.. ఆమె శరీరంపై ఉన్న బట్టలను తొలగించాడు. మృతదేహాన్ని బాత్రూంలోకి లాక్కెళ్లాడు. కిచెన్‌లో ఉన్న పెద్ద కత్తి తీసుకొచ్చాడు. మొదట మొండెం నుంచి తలవేరు చేశాడు. ఆ తర్వాత మాధవి భుజాలను కట్ చేశాడు. ఆ తర్వాత బాడీ నుంచి కాళ్లను కూడా కట్ చేసి వేరు చేశాడు. కాళ్లు, చేతులను ఒక మొద్దుపై ముక్కలు ముక్కలుగా చేశాడు. ఆ ముక్కలను బకెట్లో వేసి.. వాటర్ హీటర్ సహాయంతో కొన్ని గంటలపాటు ఉడికించాడు. ఆ ముక్కలన్నీ బాగా ఉడికిన తర్వాత.. ఆ భాగాలను తీసి పెద్ద స్టవ్ మీద బాగా కాల్చాడు. బాగా కాలిన తర్వాత వాటిని ఎముకలను రోట్లో వేసి దంచి పౌడర్ చేశాడు. ఆ పౌడర్‌ను ఓ పెయింటింగ్ బకెట్‌లో నింపాడు. ఆ బకెట్‌ను తీసుకెళ్లి చెరువులో కలిపేశాడు. అని సీపీ వెల్లడించారు. మధవిని చంపి ముక్కలుగా చేసి వాటిని ఉడికించి పౌడర్‌గా మార్చేందుకు సుమారు 8 గంటల సమయం పట్టిందని పోలీసులు తెలిపారు. ఇంట్లో ఎలాంటి ఆధారం దొరకకుండా ఉండేందుకు డిటర్జెంట్‌తో పాటు ఫినాయిల్‌తో ఇంటిని బాగా కడిగాడని.. ఆ తర్వాత తన ఇద్దరు పిల్లలను ఇంటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇంత చేసినా గురుమూర్తికి కొంచెం కూడా పశ్చాత్తాపం లేదని సీపీ తెలిపారు. ఈ ఘటనలో మొత్తం 16 వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా, ప్రస్తుతం కేసు నడుస్తుండగా.. గురుమూర్తి రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్నాడు.

సిగ్గు లేకుండా ఇదేం పనిరా అబ్బాయిలూ

హైదరాబాద్-నవభూమి: హైదరాబాద్ కూకట్‌పల్లిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దాదాపు 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నడిరోడ్డుపై ఎలాంటి భయం లేకుండా అతడు గంజాయిని విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఏపీలోని విశాఖ నుంచి నగరానికి గంజాయిని తెప్పించి అసవరమైన వారికి ఆన్‌లైన్ వేదికగా అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటుంది. ప్రత్యేకంగా నార్కొటిక్ టీమ్‌లు ఏర్పాటు చేసి వరుసగా దాడులు చేస్తోంది. అయినా గంజాయి చాప కింద నీరులా రాష్ట్రంలో ప్రవహిస్తోంది. గుట్టు చప్పుకుండా కాకుండా కొందరు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. కాలేజీ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే లక్ష్యంగా గంజాయిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులోనూ యువతే ఎక్కువగా ఈ చీకటి బిజినెస్ వైపు మ్మెగ్గుచూపుతున్నారు. ఏపీ నుంచి ట్రైన్లు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో గంజాయిని తెప్పించి ఆన్‌లైన్ వేదికగా అవసరమైన వారికి గంజాయిని విక్రయిస్తున్నారు.

తాజాగా.. ఇద్దరు యువకులు నడిరోడ్డుపై గంజాయితో పట్టుపడ్డారు. పట్ట పగలే గంజాయి విక్రయిస్తూ ఎస్‌వోటీ పోలీసులకు చిక్కారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వన్ సిటీ వద్ద ఇద్దరు యువకులు గంజాయి అమ్ముతున్నట్లు ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. గంజాయితో ఉన్న ఇద్దరు యువకులను పట్టుకున్నారు. ఏపీలోని విశాఖ నుంచి గంజాయిని అక్రమంగా తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితులు జగన్మోహన్, అరుణ్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి వారి వద్ద నుంచి 1.3 కేజీల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు మొబైల్ ఫోన్లు, ఒక బైక్‌ను సైతం స్వాధీనం చేసుకున్నారు.: లైవ్‌లో గంజాయితో దొరికిపోయిన యువకులుతాము ఏపీ నుంచి అక్రమ మార్గంలో గంజాయిని తెప్పించి నగరంలోని యువతకు ఆన్‌లైన్, ఇన్‌స్టా వేదికలుగా అమ్ముతున్నట్లు వెల్లడించారు. చాలా కాలంగా ఈ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా కాలేజీ యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గంజాయిని విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, యువత గంజాయికి బానిసలుగా మారటం కలవరపాటుకు గురి చేస్తోంది. గంజాయి సంస్కృతి పట్టణాల్లోనే కాకుండా పల్లెలకు కూడా విస్తరించింది. చాలా గ్రామాల్లో స్కూలుకు వెళ్లే పిల్లలు కూడా గంజాయికి బానిసలుగా మారుతున్నారు. గంజాయి మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. తాజాగా.. ఎంఎంటీఎస్ ట్రైన్‌లో యువతిపై అత్యాచారానికి పాల్పడిన దండుగుడిని పోలీసులు గుర్తించగా.. అతడు గంజాయికి బానిసగా మారినట్లు తెలిసింది.

ముస్లింలకు మోదీ మార్క్ తోఫా

(1వపేజీ తరువాయి) కొనసాగిస్తారు. వేర్వేరు మోదీ సహా.. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు ఇదివరకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మంత్రి నారా లోకేశ్ తదితరులు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రార్థనలు ఫలించాలని.. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలతో చేసే ప్రార్థనలు ఫలించాలని, ఆ అల్లా దయతో అందరికీ మంచి జరగాలంటూ అభిలాషించారు. అటు హైదరాబాద్‌లో పండగ కోలాహలం కొనసాగుతోంది. రంజాన్ చాంద్ కనిపించిన వెంటనే హైదరాబాద్ పాతబస్తీకి ఒక్కసారిగా తాకిడి పెరిగింది. భారీగా విక్రయాలు నమోదయ్యాయి. ప్రత్యేకించి- పాతబస్తీలో కొనుగోలుదారుల సందడి ఈ నెల రోజుల పాటు కనిపించింది. మార్కెట్లకు పండగ తాకిడి.. మార్కెట్లన్నీ కళకళలాడాయి. షాపులు రద్దీగా మారాయి. కొనుగోలుదారులతో క్రిక్కిరిసిపోయాయి. చార్మినార్, పరిసర ప్రాంతాల్లో ఈద్ కోలాహలం కనిపించింది. జాతరను తలపించింది. జుమా మసీదును విద్యుద్దీపాలతో అలంకరించారు. రంజాన్ ప్రార్థనల కోసం ఛాదర్లను పరిచారు. షామియానాలను. ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించడానికి షామియానాలను వేశారు. అక్కడి ఏర్పాట్లన్నీ కూడా చురుగ్గా పూర్తయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఇక దేశం మొత్తం కూడా రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడానికి సన్నద్ధమౌతోంది. 32 లక్షల మంది పేద ముస్లింలకు.. రంజాన్ పండగను పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా 32 లక్షల మంది పేద ముస్లింలకు నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేయనుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేరుతో ఈ కిట్లకు సౌగత్-ఇ-మోదీ అని పేరు పెట్టారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన రంజాన్ తోఫాను పోలి ఉంటాయి ఈ కిట్స్. జేపీ మైనారిటీ వింగ్.. బీజేపీ మైనారిటీ మోర్చా ఆధ్వర్యంలో ఈ కిట్ల పంపిణీ కొనసాగుతుంది. ఈ నెల 31న ఈద్ జరుపుకునే అవకాశం ఉన్నందున.. ఆ రోజున దేశంలోని 32 లక్షల మంది పేద ముస్లిం కుటుంబాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేరుతో బహుమతులు అందజేస్తామని బీజేపీ మైనారిటీ వింగ్ జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖీ తెలిపారు. సౌగత్-ఎ-మోదీ.. జిల్లా స్థాయిలో సౌగత్-ఎ-మోదీ కిట్లను పంపిణీ చేయడంతో పాటు ఈద్ మిలన్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు బీజేపీ మైనారిటీ ఫ్రంట్ వెల్లడించింది. ఈ కిట్లను పంపిణీ చేయడానికి 32,000 మంది పార్టీ కార్యకర్తల సేవలను వినియోగించుకోనుంది బీజేపీ అధిష్ఠానం. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అనే సందేశాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా దీన్ని నిర్వహించనున్నట్లు జమాల్ సిద్ధిఖీ చెప్పారు.

ట్రంప్ కొత్త పాలసీ..

(1వపేజీ తరువాయి) సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రస్తుతం వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారు మాత్రమే తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. కొత్త ప్రతిపాదన ప్రకారం గ్రీన్ కార్డ్ ఉన్నవారు, ఆశ్రయం కోరుకునేవారు కూడా తమ సోషల్ మీడియా వివరాలను ప్రభుత్వానికి అందించాలి. వలసలపై కఠినంగా వ్యవహరిస్తోన్న ట్రంప్ ప్రభుత్వం.. గ్రీన్ కార్డ్, వీసా ఉన్న వారిపై కూడా నిఘా పెంచింది. వలసదారులను వెనక్కి

పంపే కార్యక్రమాన్ని అధ్యక్షుడు ట్రంప్ ముమ్మరం చేశారు. అయితే, ఇది అమెరికాలో రాజకీయ విమర్శలకు దారితీసింది.

ట్రంప్ ప్రభుత్వం మార్చి 5న విడుదల చేసిన నోటీసులో 'గుర్తింపు ధృవీకరణ, పరిశీలన, జాతీయ భద్రత, ప్రజల భద్రత కోసం దరఖాస్తుదారుల నుంచి సోషల్ మీడియా వివరాలు సేకరించాల్సిన అవసరం ఉంది.. దీని అర్థం ఏంటంటే.. ప్రభుత్వం మీ సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించి, మీరు దేశానికి సురక్షితమైన వ్యక్తి అవునో కాదో నిర్ణయిస్తుంది' అని పేర్కొంది.

హోం శాఖ అంటే ఇష్టం

(1వపేజీ తరువాయి) విస్తరణలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కనుందని జోరుగా ప్రచారం జరుగుతున్న తరుణంలో ఆయన చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. మరి రాజగోపాల్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రిగా ఛాన్స్ ఇస్తుందా..? ఇస్తే ఆయనకు ఇష్టమైన హోం శాఖ ఇస్తుందా ? లేక మరేదైనా శాఖను కట్టబెడతారా అని చర్చ నడుస్తోంది. మరోవైపు నిన్న ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో సమావేశమయ్యారు. పలు వివిధ సామాజిక వర్గాల నుంచి నలుగురు లేదా ఐదుగురికి మంత్రివర్గంలో స్థానం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. రెడ్డి సామాజిక వర్గంలో రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలో ఒకరికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉందని అంటున్నారు. అలానే ఎస్సీ వర్గంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, అద్దంకి దయాకర్ పేర్లు వినిపిస్తున్నాయి. బీసీ సామాజిక వర్గంలో ఆది శ్రీనివాస్, శ్రీహరి ముదిరాజ్‌లకు చోటు దక్కే అవకాశం ఉందంటున్నారు. మరో స్థానం భర్తీ చేయాలనుకుంటే మైనారిటీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు చోటు దక్కే అవకాశం ఉంది. ఇక విజయశాంతికి సైతం మంత్రిగా అవకాశం ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

33 రోజులకు ఓ మృతదేహం

(1వపేజీ తరువాయి) నిమిషాల్లోనే అందులో చిక్కుకున్న 8 మంది కార్మికులు మృతి చెంది ఉంటారని అధికారులు వెల్లడించారు. కనీసం వారి మృతదేహాలైనా కుటుంబ సభ్యులకు అందించాలన్న ఉద్దేశ్యంతో తవ్వకాలు జరుపుతున్నట్లు చెప్పారు.

ఇక ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం అధికారులు, మంత్రులతో సమీక్ష నిర్వహించారు. టన్నెల్ పైకప్పు బలహీనంగా ఉందని.., అది కూలిపోయే అవకాశం కూడా ఉందని అధికారులు సీఎంకు చెప్పినట్లు తెలిసింది. కాగా, అందులో చిక్కుకున్న వారి మృతదేహాలను బయటకు తీసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని సీఎం అధికారులను ఆదేశించిటన్లు సమాచారం.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

(1వపేజీ తరువాయి) దాగి ఉన్నట్లు పోలీసులు, భద్రతా బలగాలకు సమాచారం అందింది. దీంతో రెండు జిల్లాల నుంచి సంయుక్త బలగాలు మంగళ వారం రోజు ఉదయం నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఉదయం 8 గంటలకే ఆ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా.. ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. అయితే ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతం అయినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

అలాగే ఘటనా స్థలం వద్ద నుంచి మావోల మృతదేహాలతో పాటు తుపాకీలు, పేలుడు పదార్థాలు, మందుగుండ సమాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అయితే నక్సల్స్ కేడర్ల మృతదేహాలను ఇంకా గుర్తించాల్సి ఉండగా.. ఆ ప్రాంతానికి అదనపు బలగాలను పంపారు. ఇప్పటికీ ఈ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది.

ఇదిలా ఉండగా.. ఐదు రోజుల క్రితమే అంటే మార్చి 20వ తేదీన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఎదురు కాల్పులు జరిపారు. రెండు జిల్లాలకు చెందిన సంయుక్త బలగాలు అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేశారు. ఈక్రమంలోనే ఇరు వర్గాల మధ్య పెద్ద ఎత్తున ఎదురు కాల్పులు జరిగాయి. దీంతో ఓ జవాన్ కాల్పులకు గురై ప్రాణాలు కోల్పోయారు. అలాగే పోలీసులు చేసిన ఎదురు కాల్పుల్లో 24 మంది మావోయిస్టులు హతం అయ్యారు. అదేరోజు మరోసారి కాల్పులు జరపగా మరో ఆరుగురు నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది ఇప్పటి వరకు అనేక సార్లు ఈ ప్రాంతంలో ఎన్ కౌంటర్లు జరిగాయి. ఫలిత

భర్త నాలుక కొరికేసిన భార్య.. చివర్లో ట్విస్ట్ మామూలుగా ఉండదు..



న్యూఢిల్లీ-నవభూమి: ఆలు, మగలు.. జగడాలు.. ఈ మూడింటికి అవినాభావ సంబంధం ఉంది. అందుకే భార్యాభర్తలు తరచుగా గొడవలు పడుతూనే ఉంటారు. భార్యాభర్తల మధ్య గొడవలు లేవు అంటే.. వాళ్ల మధ్య రిలేషన్ సరిగా లేదని అర్థం. అయితే, మొగుడు పెళ్లాల గొడవలకు కూడా ఓ హద్దు ఉంటుంది. ఆ హద్దులు దాటితే అనార్థాలు తప్పవు. కొన్ని సార్లు చిన్న చిన్న గొడవలు కూడా దారుణాలకు దారి తీస్తూ ఉంటాయి. తాజాగా, రాజస్థాన్‌లో ఓ దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. భర్తతో గొడవపడ్డ భార్య అతడి నాలుక కొరికేసింది. దీంతో భర్త ఆస్పత్రి పాలయ్యాడు. ఇక్కడే ఓ ట్విస్ట్ చోటుచేసుకుంది. అదేంటో తెలుసుకోవాలంటే.. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్లాల్సిందే..రాజస్థాన్, జల్వార్ జిల్లాలోని బకానీ పట్టణానికి చెందిన కన్హయ్యాలాల్ సేన్, రవీనా సేన్ భార్యాభర్తలు. ఆరు నెలల క్రితమే వీరికి పెళ్లయింది. పెళ్లయిన కొంతకాలం వీరు బాగానే ఉన్నారు. తర్వాతి నుంచి గొడవలు మొదలయ్యాయి. తరచుగా ఏదో ఒక విషయం మీద గొడవలు పడుతూనే ఉన్నారు. మార్చి 20వ తేదీన కూడా వీరిద్దరి మధ్యా గొడవ జరిగింది. ఈ సారి గొడవ కాస్తా చినికి చినికి గాలి వానలా తయారైంది. ఇద్దరూ కలబడి కొట్టుకున్నారు. ఈ నేపథ్యంలోనే రవీనా భర్త నాలుకను కొరికేసింది. నాలుక రెండుగా తెగి కిందపడటంతో కన్హయ్యాలాల్ అల్లాడిపోయాడు. గట్టిగా అరుస్తూ ఏడవ సాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు అతడ్ని దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

విద్యార్థి వీసాలకు కోత

2023-24లో 41% దరఖాస్తులు తిరస్కరించిన అమెరికా

న్యూఢిల్లీ-నవభూమి: భారతీయ విద్యార్థులకు అమెరికా ఇచ్చే విద్యార్థి వీసాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత వలసదారులపై కక్ష గట్టినప్పటికీ విద్యార్థి వీసాలు తగ్గడానికి మాత్రం ఆయన కారణం కాదని తెలుస్తున్నది. అమెరికా ప్రభుత్వం మొత్తంగానే విద్యార్థి వీసాలను తగ్గించగా, ఈ క్రమంలోనే భారతీయ విద్యార్థుల అవకాశాలు కూడా తగ్గిపోయాయి. 2018లో 42 వేల మంది భారతీయ విద్యార్థులకు వీసాలు (ఎఫ్-1) లభించగా, ఆ సంఖ్య 2024 నాటికి 86 వేలకు పెరిగింది. కానీ అంతకుముందు సంవత్సరాలు 2023లో 1.31 లక్షల మందికి, 2022లో 1.15 లక్షల మందికి విద్యార్థి వీసాలు లభించాయి. గత పదేండ్లుగా విద్యార్థి వీసాల మంజూరులో ఆమోదం తక్కువ, తిరస్కరణ ఎక్కువ అన్న చందంగా సాగుతున్నది. 2014లో దాదాపు 6 లక్షల వీసాలు మంజూరు చేసిన అధికారులు 1.73 లక్షల దరఖాస్తులను తిరస్కరించారు. 2023లో 4.45 లక్షల దరఖాస్తులు ఆమోదం పొందగా, 2.53 లక్షలు తిరస్కరణకు గురయ్యాయి. ఎఫ్-1 వీసాల దరఖాస్తుల తిరస్కరణ 41 శాతం పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024లో చైనాను దాటి ప్రపంచంలోనే అత్యధిక విద్యార్థి వీసాలు పొందిన దేశంగా భారత్ నిలిచింది. కానీ 2018, 2023 మధ్య ఎఫ్-1 వీసాలు మంజూరు రేటు 65.03 శాతం నుంచి 63.74 శాతానికి పడిపోయింది. ఇక భారతీయుల దరఖాస్తుల తిరస్కరణ రేటు 34.97 శాతం నుంచి 36.26 శాతానికి పెరిగింది.

అంతర్జాతీయ పరిస్థితులు

ఉన్నత విద్య కోసం విద్యార్థులు ఎంపిక చేసుకునే అగ్రశ్రేణి దేశాలు కూడా తమ విధానాలను కఠినతరం చేశాయి. అటువంటి తరుణంలో అమెరికా స్టూడెంట్ వీసా తిరస్కరణలు పెరిగాయి. కెనడా 2023తో పోల్చినపుడు 2024లో స్టూడెంట్ పర్మిట్స్‌ను 35 శాతానికి పరిమితం చేసింది. అదేవిధంగా బ్రిటన్ నిరుడు నిబంధనలను కట్టుదిట్టం చేసి, భారతీయ విద్యార్థులు తమపై ఆధారపడినవారిని బ్రిటన్‌కు తీసుకురావడంపై ఆంక్షలు విధించింది. ఆస్ట్రేలియా కూడా స్టడీ వీసాలను 2023 అక్టోబరు నుంచి 2024 ఆగస్టు వరకు 38 శాతం తగ్గించింది.

అమెరికా పట్ల సన్నగిల్లుతున్న ఆసక్తి

కీస్టోన్ ఎడ్యుకేషన్ గ్రూప్ 2024 నవంబరులో నిర్వహించిన సర్వే ప్రకారం, ట్రంప్ విధానాలు, రాజకీయ సిద్ధాంతాల వల్ల విదేశీ విద్యార్థులకు అమెరికా తక్కువ ఆకర్షణీయ గమ్యస్థానంగా మారింది. వివిధ దేశాల విద్యార్థుల్లో 42 శాతం మంది అమెరికాలో చదవడం గురించి పరిశీలించడానికి ఇష్టపడలేదు.

మే నుంచి ఏటీఎం చార్జీల వాత..

ఇక విత్‌డ్రా చేసినా, బ్యాలెన్స్ ఎంక్వైరీ చేసినా బాదుడే

న్యూఢిల్లీ: ఏటీఎంలో నగదు ఉపసంహరణ, బ్యాలన్స్ చెక్ లావాదేవీలపై చార్జీలు మే 1 నుంచి పెరుగుతాయి. ఖాతా ఉన్న హోం బ్యాంక్ నెట్‌వర్క్ ఏటీఎం నుంచి కాకుండా ఇతర బ్యాంక్ నెట్‌వర్క్‌లోని ఏటీఎం నుంచి లావాదేవీలను జరిపే వారిపై ఈ భారం పడుతుంది. ఇతర బ్యాంకుల ఏటీఎంల ద్వారా మెట్రో నగరాల్లో నెలకు 5 లావాదేవీలు, నాన్ మెట్రో ప్రాంతాల్లో నెలకు మూడు లావాదేవీలు ఉచితంగా జరుపుకోవచ్చు.ఈ పరిమితి దాటిన తర్వాత జరిపే ప్రతి లావాదేవీపైనా అదనపు భారం పడుతుంది. నగదు ఉపసంహరణ రుసుము ప్రతి లావాదేవీకి రూ.17 నుంచి రూ.19కి పెరుగుతుంది. బ్యాలన్స్ ఎంక్వైరీ ఫీజు ప్రతి లావాదేవీకి రూ.6 నుంచి రూ.7కు పెరుగుతుంది. నిర్వహణ వ్యయాలు పెరుగుతున్నందు వల్ల ఈ రుసుములను పెంచాలని వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు చాలా కాలం నుంచి కోరుతున్నారు.

విద్యా సంస్థల్లో ర్యాగింగ్ భూతానికి 51 మంది బలి

విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌పై నివేదిక

న్యూఢిల్లీ-నవభూమి: దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ర్యాగింగ్ భూతానికి 2022-24 మధ్య కాలంలో 51 మంది బలైపోయారు. పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలతో ఈ సంఖ్య దాదాపు సమానం. సొసైటీ ఎగెనెస్ట్ వయలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ ప్రచురించిన 'భారత దేశంలో ర్యాగింగ్ పరిస్థితి, 2022-24' నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. ర్యాగింగ్ ఘటనలపై ఫిర్యాదులు అత్యధికంగా వైద్య కళాశాలల నుంచి వస్తున్నాయని తెలిపింది.జాతీయ యాంటీ ర్యాగింగ్ హెల్ప్‌లైన్‌కు 1,946 కళాశాలల నుంచి 3,156 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 38.6 శాతం వైద్య కళాశాలల నుంచి వచ్చాయి. ఈ ఫిర్యాదులు కేవలం హెల్ప్‌లైన్ ద్వారా నమోదైనవేనని, నేరుగా కళాశాలలు, పోలీసులకు బాధితులు చేసిన ఫిర్యాదులు ఇంకా ఎక్కువే ఉంటాయని ఈ నివేదిక రూపకర్తలు తెలిపారు. 2022-24 మధ్య రాజస్థాన్‌లోని కోటాలో 57 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. కళాశాలలు యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ నివేదిక సూచించింది. ఈ స్క్వాడ్‌ను సంప్రదించేందుకు ఫోన్ నంబరు తదితర వివరాలను కొత్త విద్యార్థులకు తెలియజేయాలని పేర్కొంది.

నిన్న బర్డ్‌ఫ్లూ.. ఇప్పుడు ఎఫ్‌పీవీ.. ఏంటి ఈ కొత్త వైరస్

న్యూఢిల్లీ-నవభూమి: తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ భయం ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. ఇప్పటికి కూడా చాలా ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ కారణంగా వందల్లో కోళ్లు చచ్చిపోతున్నాయి. మన దగ్గర బర్డ్ ఫ్లూ కలకలం పూర్తిగా సద్దుమణగకముందే.. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో మరో డెంజరస్ వైరస్ వ్యాప్తిలోకి వచ్చింది. పిల్లల్లో ఇది వెలుగు చూస్తుంది. ఎఫ్‌పీవీగా పిలిచే ఈ వైరస్ సోకి.. రాయచూర్ జిల్లాలో వందల్లో పిల్లులు చచ్చిపోయాయి. ఈ వైరస్ బారిన పడితే.. బతికేందుకు కేవలం ఒక్క శాతం అవకాశం మాత్రమే ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ వైరస్ వల్ల మనుషులు, కుక్కలకు ఎలాంటి ప్రమాదం లేదని.. కాకపోతే అప్రమత్తంగా ఉండటం అవసరం అంటున్నారు. పిల్లులను పెంచుకునేవారు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

దిశ మృతి కేసు.. మహారాష్ట్ర మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రేపై ఎఫ్ఐఆర్

ముంబై- నవభూమి: మహారాష్ట్రలో గతంలో సంచలం సృష్టించిన దిశా శాలియన్ మృతి వ్యవహారంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. దిశా శాలియన్ మృతి కేసులో మహారాష్ట్ర మాజీ మంత్రి, శివసేన ఉద్ధవ్ ఠాక్రే నేత ఆదిత్య ఠాక్రేపై ఎఫ్ఐఆర్ నమోదైంది. పలువురు నటులు, పోలీస్ ఉన్నతాధికారులపైనా ఫిర్యాదులు అందాయి. బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ అయిన దిశా శాలియన్.. అతని కంటే వారం రోజుల ముందు అనుమానాస్పద రీతిలో చనిపోవడం పెను సంచలనం రేపింది. ఈ కేసులో ఆదిత్య ఠాక్రేను రక్షించేందుకు అప్పటి పోలీస్ ఉన్నతాధికారి పరంబీర్ సింగ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి అబద్ధాలు చెప్పారని దిశా శాలియన్ తరఫున వాదనలు వినిపిస్తున్న లాయర్ తాజాగా మీడియాకు సంచలన విషయాలు వెల్లడించారు.దిశా శాలియన్ మృతి కేసులో ఆదిత్య ఠాక్రేపై మంగళవారం ముంబై పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఠాక్రేతోపాటు నటులు సూరజ్ పంచోలి, డినోమోరియా, నటి రియా చక్రవర్తి, ముంబై మాజీ పోలీస్ కమిషనర్ పరంబీర్ సింగ్.. ముంబై మాజీ పోలీస్ అధికారి సచిన్ వాజేలపైనా ఆ ఎఫ్ఐఆర్‌లో ఉన్నట్లు దిశా శాలియన్ తరఫు లాయర్ నీలేశ్ ఓఝా తాజాగా మీడియాకు తెలిపారు.ఇక దిశా శాలియన్ మృతి కేసులో పరంబీర్ సింగ్ ప్రధాన సూత్రధారి అని.. ఈ కేసులో ఆదిత్య ఠాక్రేను కాపాడేందుకు మీడియా సమావేశం నిర్వహించి అబద్ధాలు చెప్పారని లాయర్ పేర్కొన్నారు. డ్రగ్స్ బిజినెస్‌లో ఠాక్రే హస్తం ఉందని నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో చేసిన దర్యాప్తులో వెల్లడి అవుతోందని తెలిపారు. తన కుమార్తె మృతి కేసుపై దిశా శాలియన్ తండ్రి సతీష్ శాలియన్ ఇటీవల ముంబై హైకోర్టును ఆశ్రయించి.. ఆదిత్య ఠాక్రేపై కేసు నమోదు చేయాలంటూ పిటిషన్ దాఖలు చేయగా.. తాజాగా ఈ పరిణామం చోటుచేసుకుంది. 5 ఏళ్ల క్రితం బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య చేసుకోవడం ఇప్పటికీ దేశవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. అయితే సుశాంత్ చనిపోవడానికి వారం రోజుల ముందు అతని మాజీ మేనేజర్ దిశా శాలియన్.. 2020 జూన్ 8వ తేదీన ముంబైలోని ఓ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆమె ఆత్మహత్య చేసుకుంది. దిశా శాలియన్ చనిపోయిన తర్వాత కొన్ని రోజులకే సుశాంత్ కూడా తన ఫ్లాట్‌లో శవమై కనిపించారు. ఈ కేసు మహారాష్ట్ర రాజకీయాల్లో అప్పట్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అయితే అప్పుడు అధికారంలో ఉన్న ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం ఈ కేసును కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. హత్య, అత్యాచారంతో పాటు సుశాంత్ మృతితోనూ ముడిపెడుతూ అనేక వాదనలు తెరపైకి వచ్చాయి.గతంలో దిశ మృతిపై సతీష్ శాలియన్ మొదట్లో ఎవరిపైనా అనుమానం వ్యక్తం చేయలేదు. కానీ 2020 జూన్ 8వ తేదీన తన కుమార్తె ఇంట్లో పార్టీ ఏర్పాటు చేసిందని.. ఆ పార్టీకి ఆదిత్య ఠాక్రేతో పాటు అతని బాడీగార్డులు, నటులు సూరజ్ పంచోలి, డినో మోరియా సహా మరికొందరు హాజరయ్యారని ఇటీవల ముంబై హైకోర్టులో సతీష్ శాలియన్ వేసిన పిటిషన్‌లో తెలిపారు. అంతేకాకుండా వారు ఆమెపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడినట్టు తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని లాయర్ చేసిన వ్యాఖ్యలు మహారాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

భర్తతో విడాకుల గొడవ..

ముఖం పగులగొట్టిన ఇంటర్నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్..

న్యూఢిల్లీ-నవభూమి: మాజీ ప్రపంచ ఛాంపియన్ బాక్సర్ సావిటీ బూరా తన భర్త, ప్రముఖ కబడ్డీ ఆటగాడు దీపక్ నివాస్ హూడాపై దాడి చేశారు. విడాకులు తీసుకోబో తున్న ఈ జంట.. పోలీస్ స్టేషన్‌లో అనేక విషయాల గురించి మాట్లాడుకుం టున్నారు. అయితే భర్తపై విపరీతమైన కోపం రాగా వెంటనే వెళ్లి అతడి కాలర్ పట్టుకున్నారు. ఆపై అతడి ముఖంపైనే పిడి గుద్దులు గుద్దారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుండగా.. అంతా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పోలీసుల ముందే ఆమె అతడిపై తన బాక్సింగ్ ప్రతిభను ప్రదర్శించిందంటే.. రోజూ ఇంకెలా హింస పెట్టిందో అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.ప్రస్తుతం 32 ఏళ్ల వయసు కల్గిన మాజీ ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ సావిటీ బూరా.. ప్రముఖ కబడ్డీ ఆటగాడు దీపక్ నివాస్ హుడాను 2022 జులై 7వ తేదీన వివాహం చేసుకున్నారు. రెండేళ్ల పాటు బాగానే సాగిన వీరి కాపురంలో గొడవలు ప్రారంభం కాగా విడాకులు తీసుకోవాలనుకున్నారు. ఈ మేరకే కోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. కానీ వారి రెండు కుటుంబాల మధ్య చాలా విషయాలు సెటిల్ చేసుకోవాల్సి ఉండగా.. పోలీస్ స్టేషన్‌లోనే సమావేశం పెట్టుకున్నారు. మార్చి 15వ తేదీన సావిటీ బూరా, దీపక్ నివాస్ హుడా సహా ఇరు కుటుంబాల పెద్దలు హర్యానా హిసార్‌లోని పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.ఈక్రమంలోనే అంతా కూర్చుని తమ సమస్యల గురించి మాట్లాడుకుంటున్నారు. అయితే ఆ సమయంలో దేని గురించి వారు మాట్లాడుకున్నారో తెలియదు కానీ తీవ్ర ఆగ్రహానికి గురైన బాక్సర్ బూరా మాత్రం ఒక్కసారిగా లేచి భర్తపై దాడికి పాల్పడింది. ఒ చేత అతడి కాలర్ పట్టుకుని.. మరో చేత్తో ముఖంపై పంచులు వేస్తూనే ఉంది. దీంతో దీపక్ నివాస్ విపరీతంగా భయపడి వదిలిం చుకునే ప్రయత్నం చేశాడు. మరోవైపు విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆపే ప్రయత్నం చేశారు. అతడిని అంతా వెనక్కి నెట్టేసి.. ఆమెను సముదాయించే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది.ఇది చూసిన ప్రతీ ఒక్కరూ ఒక్కో విధంగా స్పందిస్తున్నారు. తన బాక్సింగ్ ప్రతిభను భర్తపై చూపించండ ఏంటని కొందరు.. పోలీస్ స్టేషన్‌లోనే ఇలా దాడి చేసిందంటే ఇంట్లో ఇంకెంత నరకం చూపించి ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదంటూ కామెంట్లు చేస్తున్నారు. ఒకవేళ భర్తే ఆమెపై దాడి చేసుంటే.. అక్కుడున్న వారంతా అతడిని కొట్టేవారంటూ వివరిస్తున్నారు. మగ వాళ్లకు ఏమాత్రం రక్షణ లేకుండా పోతుందంటూ చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. సావిటీ బూరాపై విడాకుల కోసం భర్త నుంచి కోటి రూపాయల భరణం డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆ పక్షి ఎంత పని చేసింది



న్యూఢిల్లీ-నవభూమి: ఆ ఒక్క పక్షి చేసిన ఓ పని వల్లు దాదాపు 180 మంది తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. ముఖ్యంగా గంటల తరబడి విమానాశ్రయంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. అందుకు ప్రధాన కారణం.. ఆ పక్షి ఓ విమానాన్ని ఢీకొట్టడమే. రన్‌వేపై వేగంగా వెళు న్న విమానాన్ని పక్షి ఢీకొట్టింది. నేరుగా వెళ్లి ఇంజిన్‌లో పడింది. దీంతో సిబ్బంది వెంటనే విమానాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. ముఖ్యంగా అందులో ఉన్న 179 మంది ప్రయాణికులకు ఏమీ జరగకుండా సురక్షితంగా బయటకు దింపారు. ఆపై విమానాన్ని అక్కడే నిలిపివేశారు. ఆ పూర్తి వివరాల మీకోసం.సోమవారం రోజు ఉదయం కేరళ నుంచి బెంగళూరుకు వెళ్లాల్సిన ఇండిగో విమానం (6ఈ 6629).. తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో వేచి ఉంది. ముఖ్యంగా అందులో ప్రయాణించాల్సిన 179 మంది ప్రయాణికులు సైతం వచ్చి కూర్చున్నారు. ఆపై సిబ్బంది కూడా అక్కడకు చేరుకుని విమానం తలుపులను మూసేశారు. పైలెట్లు కూడా విమానాన్ని టేకాఫ్ చేసేందుకు సిద్ధం అయ్యారు. ముఖ్యంగా రన్‌వేపై విమానాన్ని వేగంగా తీసుకెళ్తున్నారు. అప్పుడే ఓ గద్ద వచ్చి వారి విమానాన్ని ఢీకొట్టింది.నేరుగా వెళ్లి విమానం ఎడమ వైపు ఉన్న ఇంజిన్‌లో చిక్కుకుంది. విషయం గుర్తించి అధికారులు వెంటనే విమానాన్ని రద్దు చేశారు. ముఖ్యంగా క్షణాల్లోనే విమానాన్ని ఆపి అందులో ఉన్న 179 మంది ప్రయాణికులను క్షేమంగా బయటకు తీసుకు వచ్చారు. ఆపై ఇంజిన్‌ను పరీక్షించి దాన్ని తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు ప్రయాణికులు.. తాము వెళ్లాల్సిన విమానం రద్దు కావడంతో.. విమానాశ్రయంలోనే గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది.వారు వెళ్లే విమానం ఉదయమే వెళ్లాల్సి ఉండగా.. సాయంత్రం 6.30 గంటలకు ఇండిగో సంస్థ మరో విమానాన్ని ఏర్పాటు చేసింది. మొత్తంగా 179 మంది ప్రయాణికులను మరో విమానం ద్వారా వారి గమ్య స్థానానికి చేర్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్త నెట్టింట వైరల్ అవుతుండగా అంతా షాక్ అవుతున్నారు. ఓ పక్షి చేసిన పని వల్ల అంత మంది ఆగిపోవాల్సి వచ్చిందంటూనే.. ఆ పక్షి ఎంత పని చేసింది అంటూ కామెంట్లు చేస్తున్నారు. మరి దీన్ని చూస్తుంటే మీకేం అనిపిస్తుందో కామెంట్ల రూపంలో వెల్లడించేయండి.

ఆర్జీకార్ హత్యాచార బాధితురాలికి డిప్రెషన్..

కోల్‌కతా-నవభూమి: కోల్‌కతా ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ హత్యాచార ఘటన గురించి దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ తెలిసిందే. అయితే ఘటన జరిగి చాలా రోజులు కాగా.. ఓ నిందితుడిని నేరస్థుడిగా గుర్తించిన న్యాయస్థానం జీవితఖైదు కూడా విధించింది. అయితే తాజాగా ఈ కేసులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా బాధితురాలు హత్యాచారానికి గురి కావడానికి నెల రోజుల ముందే తీవ్ర మానసకి ఒత్తిడికి గురై.. ఓ సైకియాట్రిస్ట్ వద్దకు వెళ్లిందట. ఆసుపత్రిలో అవకతవకలు జరుగుతున్నాయని తాను బయట పెట్టగా.. తనను టార్గెట్ చేశారని వివరించిందట. ప్రస్తుతం సైకియాట్రిస్టే బయటకు వచ్చిన బాధితురాలు తనతో చెప్పిన మాటను మీడియాముఖంగా వెల్లడించారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.2024 ఆగస్టు 9వ తేదీన నార్త్ కోల్‌కతాలోని ఆర్జీ ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం జరిగింది. కేసు నమోదు చేసుకున్న మరుసటి రోజే పోలీసులు దోషిని అరెస్ట్ చేశారు. ముఖ్యంగా సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా సంజయ్ రాయ్‌ను అదుపులోకి తీసుకోగా కేసు సీబీఐ చేతికి వెళ్లింది. ఆమె ఒంటిపై అనేక మంది డీఎన్ఏ ఉన్నట్లు గుర్తించింది. కానీ ఒక్కరే హత్యాచారం చేశారంటూ నివేదిక ఇవ్వగా.. సంజయ్ రాయ్‌ను నేరస్థుడిగా తేలుస్తూ జీవితఖైదు విధించింది.

అయితే తాజాగా పశ్చిమ బెంగాల్ సర్కార్ నిందితుడికి మరణ శిక్ష వేయాలంటూ పిటిషన్ వేయగా.. విచారించిన ధర్మాసనం బాధితురాలిపై జరిగింది హత్యాచారామా, సామూహిక అత్యాచారామా అనేది తేల్చి చెప్పాలని సీబీఐని ఆదేశించింది. ఇదంతా ఇలా ఉండగా.. తాజాగా ఆర్జీకార్ బాధితురాలు హత్యాచారానికి గురయ్యే నెల రోజుల ముందే తీవ్ర మానసిక ఒత్తిడికి గురైందిని సైకియాట్రిస్ట్ మోహిత్ రణదీప్ చెప్పారు. ఈక్రమంలోనే ఆమె తనను కలిసిందని వివరించారు. ఆస్పత్రిలో జరుగుతున్న అవకతవకల గురించి తనకు చెప్పిందని పేర్కొన్నారు.సుదీర్ఘ డ్యూటీ గంటలు, వివక్షతో కూడిన షిఫ్ట్ కేయింపులు, ఆసుపత్రిలో జరిగిన అవకతవకల గురించి తనకు తెలిసినప్పటి నుంచి ఆమె తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు వివరించారు. అందరికీ ఇలాంటి ఫిష్టులే వేస్తారా అని ఆమెను అడగ్గా.. లేదని చెప్పిందని, తనను మాత్రమే ఇలా ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నట్లు ప్రముఖ బెంగాలీ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఆమె తల్లిదండ్రులు సైతం ఆసుపత్రి మందులు, పరికరాల కొనుగోళ్లలో అక్రమాలను బహిర్గతం చేసినందుకు ఆమెను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆరోపించారు. ఈ ఆర్థిక అవకతవకలు సంబంధించి ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ ను అరెస్ట్ చేశారు. ఆ తర్వాత బెయిల్‌పై ఆయన విడుదల అయ్యారు.

ఎంపీల కంటే ఎమ్మెల్యేల జీతాలే టాప్..

న్యూఢిల్లీ-నవభూమి: ఎంపీల జీతాలను కేంద్ర ప్రభుత్వం తాజాగా పెంచింది. 24 శాతం మేర వారి జీతాలను పెంచింది. దీంతో ప్రతి నెల ఒక్కో ఎంపీ ఇకపై రూ.1.24 లక్షలను జీతంగా అందుకోనున్నారు. ఇది 2023, ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ బకాయిలను త్వరలో విడుదల చేస్తామని కూడా ప్రకటించింది. ఇప్పటి వరకు ఒక్కో ఎంపీకి రూ.లక్ష మాత్రమే వేతనంగా ఉండేదన్న సంగతి అందరికి తెలిసిందే.అయితే ఎంపీలకు వారి జీతమే కాకుండా ఇతర అలవెన్సులు సైతం లభిస్తాయి. రోజువారీ భత్యం ఇకపై రూ.2 వేలు కాకుండా..వాటిని రూ.2,500కు పెంచారు. అలాగే మాజీ ఎంపీలకు ప్రతి నెలా రూ.31 వేలు పెన్షన్‌గా అందించనున్నారు. లోక్‌సభ లేదా రాజ్యసభ ఎంపీగా మరో మారు పదవీ కాలం ఐదు సంవత్సరాలను పూర్తి చేస్తే, వారి పెన్షన్ మొత్తానికి అదనంగా మరో రూ.2,500 ఇస్తారు. అయితే ఇప్పటి వరకు ఈ మొత్తం రూ.2 వేలుగా ఉండేదన్న విషయం తెలిసిందే.ఇక నియోజకవర్గం కార్యాలయం..ప్రతి ఎంపీకి రూ.87 వేలు నియోజకవర్గ భత్యంతోపాటు రూ.75 వేలు కార్యాలయ ఖర్చుల కోసం మంజూరు చేస్తారు. ఇక కార్యాలయంలో ఫర్నిచర్ కొనుగోలు కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. వీటితోపాటు ఉచిత విమాన, రైలు ప్రయాణ సౌకర్యాలను కల్పిస్తారు.మరోవైపు ఎంపీల కంటే ఎమ్మెల్యేలకే జీతం అధికమా? అంటే..దేశంలో ఎమ్మెల్యేల అత్యధిక జీతం గురించి మాట్లాడుకుంటే మాత్రం తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ ఎమ్మెల్యేల జీతం నెలకు రూ.20 వేలు. వీటితో అలవెన్సులు కలిపి నెలకు రూ.2.50 లక్షలు పొందుతారు. ఇక ఎమ్మెల్యేల జీతాల విషయంలో మధ్యప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. అక్కడి ఎమ్మెల్యేలు జీతభత్యాలు కలిపి నెలకు రూ. 2.10 లక్షలుగా ఉన్నాయి.అయితే ఎంపీల వలే.. ఎమ్మెల్యేలకు జీతాభత్యాలే కాకుండా.. రాష్ట్ర రాజధానిలో వసతి, ప్రయాణభత్యం, రోజు వారీ భత్యంతోపాటు ప్రయాణ సౌకర్యాలను సైతం కల్పిస్తారు. ఇక ఉత్తరప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు ప్రతి నెల రూ. 1.87 లక్షల జీతంగా అందుకుంటున్నారు.ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో ఎమ్మెల్యేలు ప్రతి నెల రూ. 34 వేలు జీతంగా తీసుకొంటున్నారు. దేశంలో అత్యల్ప జీతం తీసుకుంటున్న ఎమ్మెల్యేలగా త్రిపుర రాష్ట్రం చిట్ట చివరి స్థానంలో నిలిచింది.ఏడుగురు ఎమ్మెల్యేలకు ఒక ఎంపీ..ఒక్క లోక్ సభ నియోజకవర్గ పరిధిలో దాదాపు ఏడు అసెంబ్లీ స్థానాలుంటాయి. అంటే ఏడుగురు ఎమ్మెల్యేలకు ఒక్క ఎంపీ ఉంటారు. అయినా.. ఎంపీల కంటే ఎమ్మెల్యేల జీతమే అధికంగా ఉండడం గమనార్హం. అదీకాక.. ఎన్నికల వేళ.. ఎంపీ స్థానాని కంటే.. ఎమ్మెల్యే పదవికి పోటీ పడే వారి సంఖ్యే అధికంగా ఉంటుందన్న విషయం.. తెలుగు రాష్ట్రాల రాజకీయం చూస్తే ఇట్టే తెలుస్తోంది. ఎంపీ అయితే.. తన లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ స్థానాలను పట్టించుకోవాల్సి ఉంటుంది.అలాగే పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా పలుమార్లు ఢిల్లీకి వెళ్లవలసి ఉంటుంది. కానీ ఎమ్మెల్యే అయితే ఉంటే నియోజకవర్గంలో ఉంటారు. లేకు

తీరానికి కొట్టుకొచ్చిన వింత వస్తువు..

చెన్నై-నవభూమి: కడలూరు జిల్లా పుదుసత్తిరం సమీపం సామియార్‌పేట, వేలంగిరాయన్‌పేట మధ్యలో సముద్రతీరానికి సోమవారం సాయంత్రం కోడిగుడ్డు ఆకారంలో పసుపు రంగు వస్తువు కొట్టుకు వచ్చింది. ఆ వస్తువుపై మాల్దీవులు అని నల్లరంగుతో రాసి ఉంది. ఆ వస్తువును చూడగానే స్థానిక జాలర్లు భీతిల్లారు. వెంటనే మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సమాచారం తెలుసుకుని మత్స్యశాఖ అధికారులు, పుదుసత్తిరం పోలీసులు, కోస్ట్‌గార్డ్‌అధికారులు హుటాహుటిన

అక్కడికి చేరుకుని ఆ వస్తువును పరిశీలించారు. నీటిపై తేలియాడే ఆ వస్తువు సముద్రంలో సరిహద్దులను తెలియజేయడానికి ఉపయోగించేది అయి ఉంటుందని కోస్ట్‌గార్డ్ అధికారులు అనుమానిస్తున్నారు. అదే విధంగా నౌకలో తేలే బోయా అనే వస్తువు అయి ఉండవచ్చునని మత్స్యశాఖ అధికారులు భావిస్తున్నారు. అన్ని పరీక్షించిన తర్వాత అది పేలుడు వస్తువుకాదని నిర్ధారణ కావటంతో కోస్ట్‌గార్డ్ అధికారులు ఆ వస్తువును వ్యాన్‌లో తరలించారు.

మరిన్ని ప్రయోగాలకు మార్గదర్శనం!

తొమ్మిదినెలల సుదీర్ఘనిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు భారతీయ సంతతి వ్యోమగామి సునీతావిలియమ్స్, బుచ్ విల్మోర్లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి మళ్లీ భూమ్మీదకుచేరారు. చాలామంది సునీత, విల్మోర్లు ఐఎస్ఎస్లో ఇరుక్కుపోయారని అన్నారు. ఈ వర్ణన అంతసరైంది కాదు. ఐఎస్ఎస్లో దీర్ఘకాలం ఉండటం ఇదేమొదటిసారి కాదు. సుమారు పాతికేళ్లుగామనుగడలో ఉన్న ఐఎస్ఎస్లో నిత్యం యూఎస్, రష్యా, యూరప్, జపాన్ వ్యోమగాములు ఉంటూనేఉన్నారు. ఒక్కొక్కరి కాలావధి వేర్వేరుగా ఉండవచ్చు. కనీసం 4 నుంచి 8 మందివ్యో మగాములు జీవశాస్త్ర,స్త్రబయోమెడికల్, మొక్కలకు సంబంధించినప్రయోప్ర గాలు చేస్తూ వచ్చారు. గత వారం కొద్దికాలమైనా సరే... దాదాపు 11 మందివ్యోమగాములు ఐఎస్ఎస్లో గడిపా రు. పరిశోధనలు చేయడంతోపాటు ఉపగ్రహాలను ప్రయోప్ర గించడం, ఐఎస్ఎస్నిర్వహణ పనులు చేశారు వీరందరూ! స్పేస్ వాక్స్ ద్వారా ఐఎస్ఎస్ వెలుపల ఉండేరోబోచేతులమర మ్మతులు కూడా ఉన్నాయి ఈ పనుల్లో! వ్యోమగాములు నిత్యం ఐఎస్ఎస్లో ఉంటారు కాబట్టివారికిఆహారం, ఇతర సరుకుల రవాణా ఎప్పటికప్పుడు జరిగింది. రికార్డులతో పోలిస్తేఇవి తక్కువ. సోవియట్ యూనియన్ ప్రయోప్ర గించిన 'మిర్' అంతరిక్ష కేంద్రమే ద్ర ... కాలక్రమంలో ఇతర దేశాలభాగ స్వామ్యంతో ఐఎస్ఎస్గా రూపాంతరం చెందిన విషయం ఇక్కడ ప్రస్తా ప్రస్తావనార్హం . భౌతిక శాస్త్రవేస్త్ర త్త,కాస్మో నాట్... వలేరీపోల్యాకోవ్ 1994-95లో ఎకాయెకిన సుమారు 437 రోజులపాటు మిర్ స్టేషన్లోగడిపారు. ప్రస్తు ప్రస్తుతం చైనా సిద్ధం చేసిన అంతరిక్ష కేంద్రం టియాన్ గాంగ్లో ముగ్గురు వ్యోమగాములు139 రోజులుగా ఉంటు న్నారు. వీరిలో కాయ్ షూజీకిఅంతరిక్షంలో 320 రోజులు గడిపిన అనుభవంఉంది. లక్ష్యాల్లో ఒకటిఅదే...అంతరిక్ష కేంద్రం ఏర్పాటు లక్ష్యాల్లో ఒకటి- దీర్ఘకాలం అంతరిక్షంలో గడపడం. గురుత్వాకర్షణ శక్తితక్కువగా ఉన్న పరిస్థితుల్లో ఎక్కువ సమయం గడిపితేమనకేం అవుతుందన్న విషయాన్ని అర్థంచేసుకునేందుకు ఇదిఉపయో గపడుతుంది. ఇలా ఎక్కువ కాలం అక్కడ గడిపినప్పుడు ఎముకలు,కండరాలు బలహీనపడతాయన్న విషయం మాత్రం ఆందోళన కలిగించేవ్యవహారమే. 1970లలో శాల్యూట్, స్కైల్యాబ్లతో ప్రయోప్ర గాలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఈ అంశాలకుసంబంధించి బోలెడంత సమాచారం సేకరించారు. బయో మెడికల్ సమాచా రాన్ని సేకరించడమేలక్ష్యంగా పలు పరిశోధనలు జరిగాయి. ఉదాహరణకు ప్రస్తు ప్రస్తుత అంతరిక్ష యా త్రలో త్ర విల్మోర్ సైక్లిం గ్,రోయింగ్, రెసిస్టెన్స్ వ్యాయామాలను కలిపి చేయగల ఒక పరికరాన్ని ఐఎస్ఎస్లో ఏర్పాటుచేయ డానికిసాయ పడ్డారు. ఎక్కువ సమయం ఇక్కడ గడపాల్సిన వ్యోమ గాములు ఈ పరికరం ద్వారా వ్యా యామాలు చేస్తేకండరాలు, ఎము కలు మరీగుల్లబారకుండా ఉంటాయి. గుండెకూ మేలవుతుంది. గుండెకొట్టుకునేవేగం,శ్వాస, రక్త పోటు వంటి... గుండె-రక్తనాళాలకు సంబం ధించిన డేటాను సేకరించడానికీ, ఉష్ణోగ్రతలనువ్యోమ గాములు వేసుకునేదుస్తుల్లో ఉంచిన సెన్సార్ల ద్వారా రాబట్టేందుకూ ఉద్దేశించిన ప్రయోప్రగం కూడా జరిగింది. భవిష్యత్తులో మనిషి జాబిల్లిపై, అంగారకుడిపైనివసిం చాల్సి వస్తే... ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వారిపరమావధిగా ఉండనుంది. 1970, 1980లలో సోవియట్ యూనియన్ , అమెరికన్ల అంతరిక్ష కేంద్రాల అనుభవం తరువాత ఇదిచాలా ఖరీదైన వ్యవహారమని వారికి అర్థమైంది. ఈ కారణంగానేఐఎస్ఎస్ నిర్మాణం, నిర్వహణరెండింటినీ అంతర్జాతీయ స్థాయికిచేర్చి పలు దేశాలు పాల్గొనేలా చేశారు. నాసా , కెనడా స్పేస్ ఏజెన్సీ, యూరోపియన్ ఏజెన్సీ, జపాన్ ఏరోస్పేస్ ఎక్స్ ప్లోరేషన్ ఏజెన్సీ, రాస్కోమాస్లు ఐఎస్ఎస్నిర్వహణ బాధ్యతలు చేపట్టాయి. ఆయా ఏజెన్సీలు అందించిన పరిక రాల నిర్వహణ బాధ్యత వారిదే. 2000వ సంవత్సరం నుంచి ఇప్పటివరకూ అరవై ప్రయోగాల ద్వారా ఐఎస్ ఎస్ను 21 దేశాలకుచెందిన 260 మందివ్యోమగాములు సందర్శించారు. భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లా కూడాత్వరలోనేఐఎస్ఎస్కు వెళ్లనున్నారు. ఐఎస్ఎస్ 2030 వరకూ పని చేయనుంది. చైనా ఇప్పటికేఒకఅంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోగా... 2035 నాటికి ఒక కేంద్ర నిర్మాణానికి భారత్ప్రయప్ర త్నిస్తోంది. ప్రచ్ఛ ప్ర న్న యుద్ధ కాలంలో మొదలైన అంతరిక్ష కేంద్రం ఏర్పాటు ఆలోచన ఈఅంతర్జాతీయ ప్రాజెక్టు!అంతరిక్ష ప్రయోప్ర గాల విషయంలో అమెరికా ఒక కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. ట్ కంపెనీల ఆధ్వర్యంలోనేప్రయోప్ర గా లు జరగను న్నా యి. స్పేస్ ఎక్స్, బోయింగ్ వంటివి సరుకురవాణా కోసం ప్రత్యే ప్ర కమైన నౌకలను సిద్ధం చేయనున్నాయి. నాసాతో కలిసిపని చేస్తున్న ఈ రెండుసంస్థలూ ఐఎస్ఎస్ నిర్వహణ తోపాటు జాబిల్లి, అంగారకుడిపైకిచేరేప్రయప్ర త్నాలు చేస్తున్నాయి. స్పేస్ ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్ ప్రస్తు ప్రస్తుత ట్రం ప్ ప్రభు ప్ర త్వంలో కీలకమైన వ్యక్తిగా మారిన నేపథ్యంలోబిలియనీర్ జేర్డ్ ఐసాక్మాన్ నాసా అధ్యక్షుడు అయ్యే పరిస్థితుల్లో ప్రైవేప్రైజిట్ కంపెనీలు అంతరిక్ష ప్రయోప్ర గాల్లో మరింత ఎక్కు వగా పాల్గొనే అవకాశాలు న్నాయి. వీరందరూ సునీత, విల్మోర్ల అనుభవం నుంచి లబ్ధి పొందనున్నారు.

పిల్లలకు పాఠశాల కంటే వీడియో గేమ్స్ అంటేఎందుకు ఇష్టం?

"మా బాబుకు స్మార్ట్ఫోన్ ఇవ్వకపోతేఅరుపులు, కేకలు. ఇల్లం తా రచ్చరచ్చ చేసేస్తాడు. కానీపుస్తకాలు తీస్తేబోలెడంత బద్ధకం. చదువంటేఎప్పుడూ తప్పించుకునేప్రయత్నమే. కానీ అదేవీడియో గేమ్ ఆడేటప్పుడు ఏమీ తినకుండా, తల ఊపకుండా గంటల తరబడికూర్చుంటాడు!"ఇలాంటిమాటల్ని మీరు రోజూ వింటూనేఅంటారు. దానికిమీరేం సలహా ఇస్తారు?"ఈ తరం పిల్లలు స్క్రీన్కు బానిసలైపో యారు.""వీడియో గేమ్స్ బ్రెయిన్ను వదిలిపెట్టకుండా హైపర్ యాక్టివ్ చేస్తాయి.""ఇదిడిజిటల్ డెమెజ్."

"పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇవ్వకూడదు.

కానీ, అసలు మర్మం ఎక్కడ ఉందితెలుసా?

వీడియో గేమ్స్ అనేవి సైకాలజీని వాడిడిజైన్ చేసిన అద్భుత ఇంజినీరింగ్.

మొబైల్ గేమ్స్ ఆడేపిల్లవాడిని ఒకసారిగమనించండి "ఈ లెవెల్ను కంప్లీట్ చేయాలి", "ఈశత్రువును ఓడించాలి", "ఈ స్కోరు సాధించాలి" అని అతనికి స్పష్టమైన లక్ష్యం ఉంటుంది. అతను ప్రయప్ర త్నం చేస్తాడు. ఓడిపోతాడు. మళ్లీ ట్రైచేస్తాడు. మళ్లీ ఓడతాడు. చివరికిగెలుస్తాడు.

విజయం పొందిన వెంటనేస్క్రీన్ మీద అంటూ మెసేజ్ వస్తుంది. ఈ ఫీడ్బ్యాక్ అతని మెదడులో డోపమిన్ అనేహ్యాపీహార్మోన్ను విడుదల చేస్తుం ది. ఈ హార్మోన్ కోసమే, అదిఇచ్చే హ్యాపీనెస్ కోసమేఅతను మళ్లీ మళ్లీ మొబైల్ గేమ్స్ ఆడుతూనేఉంటాడు. ఇప్పుడు చదువును పరిశీలిద్దాం . ఓ ఏడోతరగతి పిల్లాడు, మొఘలుల వంశవృక్షం చదవాల్సి ఉంది. అతనికిపాఠం ఎంత పెద్దదోతెలియదు. ఎక్కడ మొదలుపెట్టాలో కూడా స్పష్టత లేదు. పుస్తకంలోనిప్రశ్నప్ర ల్లో ఏదిపరీక్షల్లో వస్తుం దో, ఏదిగుర్తుం చుకోవాలో తెలియక కంగారు. పరీక్షలో సరైన సమాధానం రాసినా -ఫలితం ఎప్పుడు వస్తుం దోతెలీదు. పరీక్షలు వస్తున్నాయంటే"నువ్వేమైనా చదువుతున్నావా?" అంటూ తల్లి, తండ్రి,డ్రిటీచర్లు ఒత్తిడిపెడతారు. ఆ ఒత్తిడిఅతనిమెదడులో కోర్టిసాల్ అనేహార్మోన్ను ఉత్పత్తి చేస్తుం ది. ఇదేఅసలు తేడా. వీడియో గేమ్ మోటివేట్ చేస్తుం ది. చదువు భయం, ఒత్తిడితో నడుస్తుంది.

8వ తరగతి విద్యార్థిని మిహిర ఏం చెప్పిందోతెలుసా? "సర్, నేను Minecraft ఆడేటప్పుడు ఎంత creative అవుతానో తెలుసా? నా మీద నాకేఆశ్చర్యం.

కానీ అదేస్కూల్లో డ్రాయింగ్ ఉంటే, ఒక్కసారిగా భయమేస్తుం ది. గెలవకపోతేనన్ను తక్కువగా చూస్తారని."ఇంకొక తండ్రితన కొడుకును గురించి ఇలా చెప్పాడు... "డాక్టర్ గారు, మా వాడిPUBG స్టాటిస్టిక్స్మామూలుగా ఉండవు. ప్లానింగ్, లీడర్షిప్, టీమ్ వర్క్ అన్నీ బాగా చూస్తాడు. కానీ అదేక్లాస్లో ప్రాజెక్ట్ వచ్చిందంటేమౌనంగా పడుకుంటాడు. ఎందుకంటేఅక్కడ creativityతో పని లేదు, కేవలం marks కోసం పని చేయాలి."వీడియో గేమ్లో చిన్న ప్రయప్ర త్నానికేపెద్ద గుర్తింపు వస్తుం ది. చదువులో మంచి ప్రయప్ర త్నం చేసినామార్కులు రాకపోతేఎవరూ పట్టిం చుకోరు. వీడియో గేమ్లో స్వాతంత్ర్యం ఉంటుంది. చదువులోనిబంధనలు, డెడ్లైన్లు, ఫలితాలపైభయం ఉంటుంది. ఒకసారినేను ఓ క్లాస్లో పిల్లల్ని అడిగాను: "మీరు ఎక్కువ టైం ఏమి చేస్తారు?"

ఒకటి: "గేమ్స్ ఆడతాను."

రెండు: "యూట్యూబ్ చూస్తాను."

మూడు: "కంప్యూటర్ మీద క్రియేక్రిట్ చేస్తాను."

చదువు ఎప్పుడూ నాల్గవ ఆప్షన్లా ఉంటుంది.

మనం ఏమి చేయాలి?

వీడియో గేమ్లు నిషేధించడం సమస్యకు పరిష్కారం కాదు. స్మార్ట్ఫోన్ తీసేయడం వల్ల కూడా సమస్య తీరిపోదు. "నీకు concentration లేదు" అని తిట్టడం వల్ల అస్సలు ఉపయోగం ఉండదు.

మరేం చేయాలంటారా?

పిల్లలు ఏదిconcentrationతో చేస్తారో గమనించాలి.

మన పాఠశాల, మన ఇంటివాతావరణం కూడా వీడియో గేమ్లా మారాలి.

చిన్న లక్ష్యాలు ఇవ్వండి- చిన్న విజయం పొందిన ఆనందాన్ని అనుభవించాలి.

ప్రయప్ర త్నాన్ని గుర్తించండి- "శబాష్, నువ్వు మంచి ట్రైచేశావు" అనేమాట ఎంతో విలువైనది.

విఫలమైనా మళ్లీ ప్రయప్ర త్నించేందుకు అవకాశం ఇవ్వండి- శిక్షలు కాదు, శక్తినివ్వండి.

విజయం చూపించండి- మార్కులు కాకపోయినా, మెరుగుదల కనబడాలి.

పిల్లల మనసును మెప్పించేచదువుఅలాగేవాళ్లే కోరుకునేఅభ్యాసం కావాలి.

మనం పిల్లల మీద ఒత్తిడిపెట్టడం తగ్గించాలి. వాళ్లలో ఉత్తేజాన్ని పెంచాలి. వీడియో గేమ్ల మాదిరిగానే విద్య కూడా ఒక అడ్వెంచర్ అనిపించాలి. చదువు ఒక బాధగా, భారంగా కాదు ఒక ప్రయా ప్ర ణంగా మారితే పిల్లలు కూడా చదువును"ఆటలా" ఆస్వాదిస్తారు. మొత్తానికిసమస్య స్క్రీన్ కాదు. చదువులో ఆనందాన్ని మేళవించడమే సమాధానం.

స్వాతంత్ర్య సమరంలో యువవీరులు



షహీద్ దివస్.. నేడు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల అమర త్యాగాలకు దేశం గర్విస్తోంది. భరతమాతను దాస్యశృంఖలాల నుంచి విడిపించడానికి అసమాన పోరాటం చేసిన ఆ ముగ్గురు వీరులను నాటి వలస పాలకులు అన్యాయంగా ఉరికంబం ఎక్కించారు. చిన్న వయసులోనే ఆ ముగ్గురు వీరులు దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. ఉరిని కూడా ఆనందంగా స్వీకరించి బలిదానం చేసిన రోజు మార్చి 23. ఆ వీరులు ప్రాణత్యాగం చేసిన నాటి రోజునే వారి జ్ఞాపకార్థం షహీద్ దివస్‌గా జరుపుకుంటున్నాం. ఆ ముగ్గురూ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ థాపర్, శివ్‌రామ్ రాజ్‌గురులు. బ్రిటిష్ పాలన అంతంకావాలని పరాయి పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టి 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన ఈ ముగ్గురు వీరులు నాటి తరానికే కాదు, నేటి యువతకు కూడా ఆదర్శం. ఉరికంబం ఎక్కడానికి ముందు కూడా తమ ముఖంలో చిరునవ్వు చెరగనివ్వని ఈ యోధులు, చావును కూడా ఎంతో ఆనందంగా స్వీకరించారు. 1931 మార్చి 23న ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న పంజాబ్ హుస్సైన్‌వాలా ప్రావిన్స్ జైల్లో ఈ వీరులను ఉరికంబానికి బలిచ్చారు. భరతమాతను బ్రిటిషర్ల చెర నుంచి విడిపించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారుల్లో భగత్‌సింగ్ ఒకరు. అందుకే ఆ విప్లవ వీరుడ్ని షహీద్ భగత్‌సింగ్‌గా పిలుస్తారు. 1907 సెప్టెంబరు 28న ప్రస్తుత పాకిస్థాన్‌లోని లాహోర్‌లో జన్మించిన భగత్‌సింగ్ చిన్న వయసులోనే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. తనకు వివాహం చేయాలన్న తల్లిదండ్రుల నిర్ణయం తెలుసుకున్న భగత్, ఆ ప్రయత్నాన్ని మానుకోమని ఉత్తరం రాసిపెట్టి ఢిల్లీకి చేరారు.

దైనిక్ అర్జున్, ప్రతాప్ లాంటి పత్రికల్లో కొంతకాలం పనిచేసిన భగత్‌సింగ్‌కు ఆ సమయంలోనే గణేశ్ విద్యార్థి, బటుకేశ్వరదత్ లాంటి విప్లవకారుల సహచర్యం లభించింది. విప్లవం ద్వారా మాత్రమే స్వాతంత్ర్యం సిద్ధించగలదని భావించిన భగత్‌సింగ్ 'నౌ జవాన్ భారత్ సభ'ను 1924లో స్థాపించారు. భగత్‌సింగ్, సుఖదేవ్, భగవతీచరణ్‌లు ఆ సమయంలో తమ రక్తంతో ప్రమాణపత్రంపై సంతకం చేశారు. అప్పుడే కాన్పూర్‌లో వరదలు రావడంతో, సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్న భగత్‌సింగ్‌కు చంద్రశేఖర్ ఆజాద్‌తో పరిచయం ఏర్పడింది. తరువాతి కాలంలో వారు ప్రాణస్నేహితులుగా మారారు. నౌ జవాన్ భారత సభ ద్వారా యువతను ఆకర్షించడమే కాకుండా వారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారు. చిన్నతనంలో ఐరోపా విప్లవ ఉద్యమాల గురించి చదివి అరాజకవాదం, సామ్యవాదాలకు ఆకర్షితుడయ్యాడు. ఈ స్ఫూర్తితో హిందూస్థాన్ గణతంత్ర సంఘంలో ముఖ్య నాయకుల్లో ఒకడుగా ఎదిగారు. ఆ తర్వాత ఈ సంస్థను హిందూస్థాన్ సామ్యవాద గణతంత్ర సంఘంగా మార్చారు. రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జైలులో 64 రోజుల నిరాహారదీక్షను చేపట్టడం ద్వారా భగత్‌సింగ్ అఖండ భారతావని మద్దతును కూడగట్టుకున్నాడు. పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ మరణానికి కారణమైన పోలీస్ అధికారి స్కాట్స్ హత్యకు భగత్‌సింగ్ వేసిన పథకం విఫలమైంది. స్కాట్స్ అనుకుని మరో ఎస్ఐ సాండర్స్‌ను హత్య చేశారు. 1929 ఏప్రిల్ 8న పార్లమెంట్ హాల్‌లో పొగ బాంబు విసరడంతో భగత్‌సింగ్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది. తమ స్వాతంత్ర్య కాంక్షను తెలియజేయడానికే బాంబు వేశాం తప్ప, ఎవరినీ హత్య చేయడానికి కాదంటూ ధైర్యంగా న్యాయస్థానంలోనే ఆయన ప్రకటించారు. భగత్‌సింగ్‌తో పాటు సుఖదేవ్, రాజ్‌గురులు కూడా ఈ దాడిలో పాల్గొన్నారు. పార్లమెంట్ హాల్లో మనుషులు లేని ప్రదేశంలో బాంబు విసిరి భారతీయుల మనోగతాన్ని తెలియజేయాలన్నదే ఈ వీరుల ప్రధానోద్దేశం. అయితే దీన్ని మాత్రం తీవ్రంగా పరిగణించిన బ్రిటిష్ ప్రభుత్వం విచారణ త్వరగా పూర్తిచేసి ఉరిశిక్షను అమలు చేసింది. తన కొడుకును కేసు నుంచి బయటపడేయడానికి భగత్‌సింగ్ తండ్రి చాలా ప్రయత్నించారు. అయితే తండ్రి ప్రయత్నాలను వారించిన భగత్‌సింగ్ దాని వల్ల ప్రయోజనం ఉండదని ఖండితంగా చెప్పాడు. మమ్మల్ని విడిచిపెట్టే ఉద్దేశం బ్రిటిష్ ప్రభుత్వానికి లేదు కాబట్టి దీనిపై దొంగ సాక్ష్యాలను సృష్టించి విచారణను వేగంగా పూర్తిచేయడానికి ఏర్పాటు చేస్తుందంటూ తెల్లదొరల అంతరంగాన్ని ముందే పసిగట్టి తండ్రికి తెలియజేశారు భగత్‌సింగ్. అనుకున్నట్టుగానే ఈ ముగ్గురు వీరుల్ని బ్రిటిష్ ప్రభుత్వం దోషులుగా నిర్ధారించి ఉరికంబం ఎక్కించింది. మార్చి 23న సెంట్రల్ జైలులో సాయంకాలం 7.33 గంటలకు విప్లవ వీరులను ఉరి తీశారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ఉరితాడును ముద్దాడి, ప్రాణత్యాగం చేశారు. నిబంధనల ప్రకారం ఆ సమయంలో ఉరి శిక్ష అమలు చేయకూడదు. అందుకే వారి మృతదేహాలను జైలు వెనుక గోడలు పగులగొట్టి రహస్యంగా తీసుకెళ్లి సట్లెజ్ నది తీరాన దహనం చేశారు. మృతదేహాలు ప్రజల కంటబడితే ఉపద్రవం ముంచుకొస్తుందనే ఇలా చేశారు. ఈ యువకిశోరాల త్యాగం ఎప్పటికీ వృథా కాదు. అమరవీరుల్లారా, ఎల్లవేళలా మీరు ప్రతి భారతీయ గుండెల్లో ఉంటారు.

విశ్వావసు ఉగాదికి అక్షర నీరాజనం

భక్తి

ఉగాది అంటే ఉరకలు వేసే ఉత్సాహం. ముంగిళ్లలో తోరణాల హరిత లాస్యం. వంటింట ఘుమఘుమల సయ్యాట. నాలుకపై షడ్రుచుల నాట్యం. ఉగాది అంటే ఉవ్వెత్తున ఉప్పొంగే కవిత్వం. కొత్త ఏడాదికి కొంగొత్తగా స్వాగతం పలికే వైతాళిక గీతం. కలాల కోలాటంలో కవితల ఉబలాటం. అక్షరాల ఆత్మీయ ఆలింగనం. పచ్చని కొమ్మల్లో మోగే కోయిల గానం.. మది మదిలో హర్ష ధ్వానం..

విశ్వ కాలం

అవును! నువ్వు 'శ్రీముఖం'లో పుట్టినా నేను 'స్వభాను'లో భూమి మీదికి అడుగు పెట్టినా ఆమెది తెలిసిందెవ్వరికి? పొడుగో, పొట్టో, లావో, సన్నమో చూసిందెవ్వరు? ప్రభవ నుండి పుట్టిన కాలరాశి అక్షయంగా విస్తరించి తరతరాలుగా ప్రవహిస్తూనే యుండొచ్చు గాక! అరవై గడుల రంగుల రాట్నంగా అలుపు లేకుండా తిరుగుతూనే వుండొచ్చు గాక! 'ఆగిపోవటం కాదు సాగిపోవటమే బ్రతుకు' అని మనిషికి తెలిసి ఉండాలిగా! గాయం తెలిసిన శరీరం జ్ఞాపకం ఎరిగిన మనసు వంచన అనుభవించిన జీవితం జ్ఞానం పొందిన ఆత్మ కాలమానాన్ని అర్థం ఎందుకు చేసుకోదు? ప్రతి కష్టానికి ఒక కారణాన్ని ప్రతి విజయానికి ఒక స్వోత్కర్షని అద్దుకోకుండా 'విజయ' నక్షత్రం ఐనా ఇతను'వికారి' జాతకుడైనా అందరం ఒకే ఆకాశం కింద బతుకుతున్న వాళ్ళమే! ఒకే కాలంతో పాటూ నడవాల్సిన వాళ్ళమే ఆది, సోమవారాలుగా రోజుల్ని పిలుస్తున్నా క్రోధి, ఆనంద లుగా యేళ్ళని విభజించుకున్నా కృష్ణ, శుక్ల పక్షాలుగా నెలని చూసుకున్నా వసంత, శిశిర ఋతువులుగా గుర్తుంచు కున్నా పేరేదైనా, పాత్రేదైనా, ప్రాంతమేదైనా అంచనాలు, అక్షాంశాలు తప్ప కాలపు రంగు, రుచి, వాసన కాగితానికి రంగులు వేసినంత మాత్రాన కరెన్సీ కాదన్న ఇంగితాన్ని కాలాన్ని చూసైనా నేర్చుకుందాం! మౌనాన్ని ఆశ్రయిస్తే సత్యం తెలుస్తుందని చిరునవ్వును ప్రయోగిస్తే పరిష్కారం దొరుకుతుందని గుర్తుచేసుకుందాం! మంచికాలం అంటే మనం పది మందితో కూర్చోటం కాదు పది మంది మనతో కూర్చోవాలనుకోవటం! ఇప్పటిదాకా మనకు తెలిసినవి త్రికాలాలే భూత భవిష్యత్ వర్తమాన కాలాలే కనిపించని నాలుగో కాలమే విశ్వ కాలం ఆ కాలంలోకి ఇంకిపోదాం ఆ కాల లోకం లోకి అదృశ్యమవుదాం ఓ విశ్వా వసూ! మేమూ వస్తున్నాం నీ పుష్పక విమానంలో మాకూ కాస్త చోటివ్వు! ప్రపంచాన్ని నీతో కలిసి చుట్టెయ్యనివ్వు!

ఐనా ముందుకే

ముందున్నది మరణమేనని తెలిసినా ఇవాళ ఒక యుగాన్ని నాటాలి గమ్యం అగమ్యమే అయినా చూపులనే పాదముద్రలు చేయాలి

ఈ క్షణపు నందివర్ధన పరిమళం తెలిమంచులా మనసును చుట్టుకొని కాలంలోకి వ్యాపించడం ఒక నమ్మిక కలత నీడను నవ్వు కమ్మినట్టు రాబోయే క్షణం స్వాగతించడం ఒక ముందడుగురాత్రి దారులు కూలే ముందు చేతి తడుములాటకు తగిలే చీకటి ఒక దారిదీపం సుడిగుండాల గిరికీలు దాటి తీరం తాకే శిథిల ఓడ గాలి తొడిగిన నవ్వు వెక్కిళ్లలో కొత్త చివుళ్ల నీటి గుటక జాడ చేరిన అనూహ్య మజిలీలో గమనం ఒక కొత్త బస నిన్న ఒక గుయ్యారమే ఐనా ఆ చివార్న ఓ వెలుగు ద్వారం

కలిసిరానట్టు గడిచిపోనట్టు కాలం నటిస్తుందే కానీ అది చీకట్లోనూ వెలిగే నీడ గుండె ఖాళీ అనిపిస్తుందే కానీ అది క్రిక్కిరిసిన అనుభవాల ఆక్రమణ కలల కబ్జా బతుకు ఎండావానాకాశంలో ఇంద్రధనువు మౌనం అనర్గళం దుఃఖపు జాతరలో విశ్వాసాల వేడుక కోలాహలం

రేపంటే నిన్నకు స్క్రీన్ప్లే మారిన సీక్వెల్?

అడవి గుండెపై తొలి పూవు

జీవితాన్ని నువ్వు స్థిరీకరిస్తావో లేక జీవితం నిన్ను స్థిరీకరిస్తుందో తెలియదు గానీ ఒక్కోసారి తొలి పూవేదో నీ అడవి గుండెల పైన అప్రయత్నంగా వికసిస్తుంటుంది అది చమురును బ్రతికించగలిగే దీపమవుతుంది అనేక అనుభూతులు కలగలిపిన కవిత్వం లాంటి పచ్చడి ఉగాదై పలకరిస్తుంది తీరాలు దాటుతూ వచ్చిన సముద్రం ఆవలి గట్టయితే ఇంకా కనుక్కోలేదు వేషాలు మారుస్తూ వచ్చిన దినదీపానికి అస్తమయ అనుభూతి అర్థం కావడం లేదు చీకటి మ్రాను శరీరం మీద చివురై మొలిచిన చందమామ నల్లటి శరీరంతో తెల్లగా పాడుతున్న కోకిలమ్మ అంతరించిపోయిన నిన్నటి నుంచి మళ్లీ మొలుస్తున్న నేటి చెట్టు ఇట్లా ఎంత సందేశం దాచుకుంది ఉగాది ఓటమి పునాదులే గెలుపు గోడకు హేతువులవుతాయి దూరంగా కనిపించిన అగాధం మహా ప్రస్థానంలో దగ్గరికి వచ్చేసరికి జీవకళలు పరుచుకున్న నేల అవుతుంది విశ్వావసు ఒక్కసారి వీర గంధమై పలకరిస్తుంది ఉగాది అంటే మృతి నుంచి మొలుస్తున్న ప్రాణధనం ఉగాది అంటే నిరాశ నుంచి తల ఎత్తిన విజయ సోపానం పంచాంగ శ్రవణం..!

మట్టి పాత్రలు మన్నికగా..!

వంట చేయడానికి మట్టి పాత్రలు ఉపయోగించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. మట్టితో తయారు చేసిన పాత్రలు, కుండల మీద సన్నని రంధ్రాలు ఉంటాయి. వీటివల్ల ఆహారం నెమ్మదిగా ఉడుకుతుంది. దీంతో ఆహారంలోని పోషకాలు ఆవిరి కాకుండా ఉంటాయి. అంతేకాదు మట్టి పాత్రల్లో వండేటప్పుడు నూనె ఎక్కువగా అవసరం ఉండదు. ఇలా ఎన్నో ప్రయోజనాలను అందించే మట్టి పాత్రలు చాలాకాలం మన్నికగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వాటి గురించి తెలుసుకుందాం. ముందుగా మట్టి పాత్రను రాత్రంతా నీళ్లలో నానబెట్టాలి. దీనివల్ల పాత్ర మీద ఉండే సన్నని రంధ్రాలు తేమను నింపుకుంటాయి. దీంతో మట్టి పాత్రను వేడి చేసినప్పుడు దానిమీద పగుళ్లు రావు. మట్టి పాత్రలో నీటిని నింపి స్టవ్ మీద పెట్టి చిన్న మంట మీద కొద్దిగా వేడి చేయాలి. తరవాత ఈ నీటిని పారబోసి పాత్రను వంటకు వాడుకుంటే చాలాకాలం మన్నికగా ఉంటుంది. మట్టి పాత్రలను పెద్ద మంట మీద పెట్టకూడదు. అలా పెడితే అవి ఎక్కువగా వేడెక్కి పగిలిపోతాయి. మంట ఎప్పుడూ మధ్య స్థాయి లేదా చిన్నగా ఉండాలి. మట్టి పాత్రల్లో వంట చేసేటప్పుడు వాటిలోని ఆహారాన్ని కలపడానికి స్టీల్ లేదా ఇనప గంటెలు వాడకూడదు. ఇవి వాడితే పాత్ర లోపలి భాగం దెబ్బతింటుంది. చెక్క లేదా సిలికాన్ గరిటెలు ఉపయోగించడం మంచిది. వంట పూర్తయిన తరవాత మట్టి పాత్రలను స్క్రబ్బర్‌తో మెల్లగా తోమాలి. ఎక్కువగా నీళ్లు పోస్తూ కడగాలి. ఏమాత్రం అశ్రద్ధ వహించినా పాత్రలు పగిలిపోతాయి. శుభ్రం చేసిన మట్టి పాత్రలను పలుచని గుడ్డతో తుడిచి గాలికి ఆరబెట్టాలి. తరవాత గుడ్డలో చుట్టి ఉంచితే వాటిపై దుమ్ము

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 హైదరాబాద్
బుధవారం
26 । మార్చి । 2025

మామిడి ఆకులతో అందం, ఎలా వాడితే ముఖం మీద మచ్చలు తొలగిపోతాయో తెలుసా?

ఎండాకాలం వచ్చేసింది. ఎండాకాలం వచ్చిందంటే అందరికి నోరూరిపోతుంది. కారణం మామిడి పండ్లు. ఈ సీజన్‌లో మామిడి పండ్లకు డిమాండ్ ఎక్కువ. మామిడి పండ్లు తినడానికి ఎంత రుచిగా ఉంటాయో మనకు తెలుసు. అయితే, మామిడి ఆకులతో చాలా ప్రయోజనాలున్నాయి. వీటిని తోరణాలుగా ఇంటి గుమ్మానికి వేలాడదీస్తారు. హిందూ సాంప్రదాయంలో వీటిలో ప్రాముఖ్యత అలాంటిది. అయితే, మామిడి ఆకులతో చర్మానికి మేలు జరుగుతుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. మామిడి ఆకులతో మొటిమలు, మచ్చలు తగ్గించుకోవడంతో పాటు ముఖాన్ని అందంగా మార్చుకోవచ్చు. మామిడి ఆకులతో ప్రయోజనాలేంటి, వాటిని ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం.

యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ

మామిడి ఆకులలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. మామిడి ఆకుల్ని ముఖం మీద ఉపయోగించినప్పుడు, సూర్య కిరణాలు, కాలుష్యం లేదా ఇతర ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం రక్షణ కలుగుతుంది. మామిడి ఆకులు చర్మాన్ని రక్షిస్తాయి. మామిడి ఆకులను క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల వృద్ధాప్య సంకేతాలను కూడా తగ్గించవచ్చంటున్నారు నిపుణులు.

మొటిమలు, మచ్చలకు చెక్

మామిడి ఆకులలో మాంగిఫెరిన్ సమ్మేళనాలు కనిపిస్తాయి. ఇవి మొటిమల వల్ల కలిగే మచ్చల్ని తగ్గించడంలో సాయపడతాయి. మొటిమల సమస్యతో బాధపడేవారికి మామిడి ఆకులు బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. మామిడి ఆకులను క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల చర్మాన్ని మృదువుగా ఉంచుకోవచ్చు.

చర్మం మెరుస్తుంది

గ్లోయింగ్ స్కిన్ కావాలనుకుంటే ముఖానికి తాజా మామిడి ఆకుల్ని వాడాలి. ఈ ఆకుల్లో టైరోసిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మం నల్లబడటం నుంచి కాపాడుతుంది. చర్మంపై ఉన్న నల్లటి మచ్చల్ని తగ్గించుకోవచ్చు. మామిడి ఆకుల్ని రెగ్యులర్‌గా వాడితే చర్మం మెరుస్తుంది. గ్లాసీ గ్లోయింగ్ స్కిన్ సొంతమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది

మామిడి ఆకులలో విటమిన్ సి కూడా పుష్కలంగా ఉంటుంది. అందుకే అవి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంలో సాయపడతాయి. అంతేకాదు, వీటిని క్రమం తప్పకుండా వాడటం వల్ల చర్మం మృదువుగా మారుతుంది. కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం ముడతలు పడటం ఆగుతుంది. చర్మంపై ఉన్న ముడతల్ని తగ్గించడంలో మామిడి ఆకులు ప్రభావవంతంగా పనిచేస్తాయని నిపుణులు అంటున్నారు.

మామిడి ఆకుల్ని ఎలా వాడాలి?

ముందుగా ఐదు మామిడి ఆకుల్ని తీసుకుని మంచి నీటితో శుభ్రపర్చండి. ఆ తర్వాత వాటిని పాన్‌లో వేయించండి. ఆ తర్వాత ఆ ఆకుల్ని తీసుకుని పొడిలా చేసుకోండి. ఈ పొడిని ఇప్పుడు ఒక గిన్నెలోకి తీసుకోండి. పొడి ఉన్న గిన్నెలో రెండు చెంచాల కొబ్బరి నూనె వేయండి. ఆ తర్వాత వీటిని బాగా మిక్స్ చేసి మందపాటి పేస్ట్ తయారు చేసుకోవాలి. ఇప్పుడు ఈ పేస్టుని ముఖం మొత్తానికి బాగా అప్లై చేయాలి. వారానికి రెండు నుంచి మూడు సార్లు ఇలా అప్లై చేయడం వల్ల ముఖంలో మార్పులు కనిపిస్తాయి.

మామిడి ఆకులతో ఫేస్ మాస్క్

ఇందుకోసం ముందుగా ఐదు మామిడి ఆకుల్ని తీసుకోండి. ఇప్పుడు వాటిని కొన్ని నీటి చుక్కలు కలిపి మెత్తగా రుబ్బుకోండి. ఇప్పుడు ఆ మిశ్రమంలో రెండు చెంచాల పెరుగు వేసి బాగా కలపండి. ఆ తర్వాత ఈ పేస్టుని ముఖం మొత్తానికి అప్లై చేయాలి. దీన్ని ముఖం మీద దాదాపు ఇరవై నిమిషాలు ఉంచండి. ఆ తర్వాత ముఖాన్ని గోరువెచ్చని నీటితో వాష్ చేసుకోండి. ఇలా చేయడం వల్ల ముఖం మీద మచ్చలు తగ్గి గ్లో పెరుగుతుందని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు.

ఎండ నుంచి అండ

వేసవిలో ఎండ వేడి నుంచి ఉపశమనాన్ని అందించే చల్లని పదార్థాల కోసం గాలిస్తూ ఉంటాం. కానీ ఐస్‌క్రీమ్ ఇష్టంగా తింటాం తప్ప అంతకంటే మెరుగ్గా శరీరాన్ని చల్లబరిచే కీరా జోలికి వెళ్లం. దాహార్తిని తీర్చడంతో పాటు లవణాలను భర్తీ చేసే కొబ్బరినీళ్లకు బదులుగా ఫ్రీజర్‌లో చల్లబరిచిన శీతల పానీయాలను ఆబగా తాగేస్తూ ఉంటాం. నిజానికి శరీరంలో నీటి శాతాన్ని భర్తీ చేసి, డీహైడ్రేషన్ నుంచి రక్షణనిచ్చే ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు కూడా మన చుట్టూరా ఎన్నో ఉన్నాయి. దాహార్తిని తీర్చే మజ్జిగ, రాగి జావ, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లతో పాటు చలువ చేసే పెరుగు, కూరగాయలు, ఆకుకూరలు కూడా మనకు అందుబాటులో ఉంటున్నాయి. అయితే వేసవి ఎండకూ, వేడికీ బహిర్గతమయ్యే తీవ్రతలు పరిస్థితులను బట్టి మారుతూ ఉంటాయి. ఇంటిపట్టున ఉండే వారు, బడికెళ్లే పిల్లలు, ఎక్కువగా ప్రయాణాలు చేసేవారు ఈ కాలంలో భిన్నమైన ఆహార నియమాలను పాటించాల్సి ఉంటుంది.

ఇంటిపట్టున ఉంటే...ఇంటిపట్టున ఉన్నంత మాత్రాన ఎండ ప్రభావం నుంచి తప్పించుకున్నాం అనుకోడానికి వీల్లేదు. ఇంట్లో ఉన్నప్పటికీ సాయంత్రానికి నీరసించిపోతుంటే, నీరు ఎక్కువగా ఉండే పుచ్చ, దోస, తర్బూజ లాంటి పండ్లు తింటూ ఉండాలి. తరచూ నీళ్లు తాగుతూ డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి. వంటల్లో కారం, ఉప్పు, మసాలాలు బాగా తగ్గించాలి. సలాడ్స్, కూరగాయలు, ఆకుకూరలు, పెరుగు, తేలికగా అరిగే వీలున్న పదార్థాలు తీసుకోవాలి. మాంసాహారం తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉండే బీరకాయలు, సొరకాయలు, పొట్లకాయలు లాంటివి ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. కీరా, క్యారట్, లెట్యూసలతో సలాడ్స్ చేసుకుని తింటూ ఉండాలి. అలాగే కొబ్బరినీళ్లు, పండ్లరసాలు, మజ్జిగ తరచూ తీసుకోవచ్చు. టీ, కాఫీలు తగ్గించి, హెర్బల్ టీ తీసుకోవాలి. ఉదయం అల్పాహారంలో కూడా నూనెలో వేయించిన పూరీలు, వడలకు బదులుగా ఇడ్లీలు, ఓట్స్ పోరిడ్జ్ లాంటివి తీసుకోవాలి. చికెన్, చేపలు తక్కువ మసాలాలతో వండుకుని తీసుకోవచ్చు.

బడికెళ్లే పిల్లల కోసం...ఈ కాలంలో పిల్లలు కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ తినడానికి ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. కానీ వీటి తయారీలో ఉపయోగించే కలుషిత నీళ్లు, పాలపదార్థాలు, కృత్రిమ రంగుల వల్ల పిల్లల్లో టాన్సిల్స్, గొంతు ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలుంటాయి. కాబట్టి ఇంట్లో తయారుచేసి ఫ్రూట్ సలాడ్స్, కస్టర్డ్, పాయసం లాంటివి ఇవ్వాలి. చక్కెర కలపని పండ్ల రసాలు ఇవ్వాలి. సాధారణంగా పిల్లలు దాహాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. డీహైడ్రేషన్‌కు గురైనా దాని గురించి పిల్లలకు అవగాహన లేక నీరసించిపోతూ ఉంటారు. కాబట్టి పెద్దలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, పిల్లలు సరిపడా నీళ్లు తాగేలా చూసుకోవాలి. అలాగే లంచ్ బాక్సుల్లో తప్పనిసరిగా సలాడ్స్, పండ్ల ముక్కలు, పెరుగు పెడుతూ ఉండాలి. ఇంట్లో రస్నా, కృత్రిమ పండ్లరసాలకు బదులుగా నిమ్మరసం, కొబ్బరినీళ్లు, మజ్జిగ, సబ్జా లాంటివి పిల్లలకు అలవాటు చేయాలి. పిల్లలు తరచూ స్నాక్స్‌లో భాగంగా ఉప్పని చిప్స్ తింటూ ఉంటారు. ఇలాంటి వాటి వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. కాబట్టి పిల్లలకు వీటిని అందుబాటులో ఉంచకూడదు. ఈ కాలంలో పిల్లలకు జీర్ణసమస్యలు రాకుండా, ఎలక్ట్రొలైట్స్ సంతులనం కోసం మామిడి, పుచ్చ, తర్బూజా లాంటి తాజా పండ్లు, సలాడ్స్ తినిపించాలి.

ఎండకు ఎక్కువగా బహిర్గతమయ్యేవారు...

మార్కెటింగ్ వృత్తిలో ఉన్నవారు, ఎక్కువగా ప్రయాణాలు చేసే వారు తప్పనిసరిగా నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వెంట తీసుకువెళ్లాలి. ఇంటిపట్టున ఉండేవారు రోజుకు 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తీసుకుంటే సరిపోతుంది. కానీ ఎక్కువగా బయట తిరిగేవాళ్లు అంతకంటే ఎక్కువ నీళ్లు తాగాలి. బయటి ఆహారం బాగా తగ్గించి, ఇంటి ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి. బయట తిరిగేవాళ్లు ఎప్పుడు డీహైడ్రేషన్‌కు గురవుతారో, ఎప్పుడు ఎండదెబ్బ బారిన పడతారో చెప్పలేం. కాబట్టి బయటకు వెళ్లే ముందు, బయటకు వెళ్లిన ప్రతి గంటకూ నీళ్లు తాగుతూనే ఉండాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

కూల్ డ్రింక్స్ మానేయాలి

కారం, మసాలాలతో తయారైన పదార్థాలు మానేయాలి

చక్కెర డీహైడ్రేషన్‌కు గురి చేస్తుంది కాబట్టి తీయగా ఉండే పానీయాలు మానేయాలి

ఉప్పు ఎక్కువగా ఉండే చిప్స్, ఊరగాయలు, వడియాలు లాంటివి మానేయాలి

మాంసాహారం తగ్గించి, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి

తక్షణ శక్తి కోసం బత్తాయి రసం, నిమ్మరసం తాగాలి

ఎండదెబ్బ నుంచి రక్షణ కోసం ఆమ్ పన్నా తాగుతూ ఉండాలి.

తయారీ కోసం...

పచ్చి మామిడి కాయ: 1

పుదీనా ఆకులు: 3 టేబుల్‌స్పూన్లు

యాలకుల పొడి: అర టీస్పూను

మిరియాల పొడి: అర టీస్పూను

చక్కెర: పావు టీస్పూను

జీలకర్ర పొడి: అర టీస్పూను

ఉప్పు: రుచికి సరిపడా

తయారీ ఇలా: మామిడి కాయకు నీళ్లు జోడించి కాయ మెత్తబడేవరకూ ఉడికించాలి. తర్వాత నీళ్లను తొలగించి, తొక్కు, విత్తనం వేరు చేసి, గుజ్జును మెత్తగా రుబ్బుకోవాలి. ఈ గుజ్జుకు పైన చెప్పిన దినుసులన్నీ కలిపి ఆమ్ పన్నాను సిద్ధం చేసుకోవాలి. ఈ మిశ్రమానికి నీళ్లు కలిపి, ఫ్రిజ్‌లో ఒక గంట పాటు చల్లబరుచుకుని తాగితే, వేసవి నుంచి ఉపశమనం, ఎండ వేడి నుంచి రక్షణ దక్కుతుంది. ఫ్రిజ్‌లో చల్లబరిచిన గడ్డ కట్టేంత చల్లని నీళ్లు తాగడం సరి కాదు. బయటి వాతావరణం వేడిగా ఉన్నప్పుడు అత్యంత చల్లని నీళ్లు తాగడం శరీరానికి హానికరం. కాబట్టి ఫ్రిజ్ నీళ్లు సాధారణ గది ఉష్ణోగ్రతకు చేరుకున్న తర్వాత తాగాలి. చల్లదనం కోసం కుండలో నీళ్లు తాగొచ్చు.

జింక్ లోపం.. ఆరోగ్యానికి శాపం

రోగ నిరోధక శక్తి, ఆరోగ్యకరమైన జీవక్రియలు, గాయాలు మానడం, శరీర ఆరోగ్యానికి దోహదపడే మినరల్స్‌లో జింక్ ప్రధానమైంది. చాలామందికి తమలో జింక్ లోపం ఉన్నదనే సంగతి తెలియదు. దీన్ని పసిగట్టడానికి కొన్ని లక్షణాలను గమనించాలి.

తరచుగా జలుబు, ఇన్ఫెక్షన్లు బాధిస్తున్నాయంటే జింక్ లోపం కావచ్చు. తెల్ల రక్తకణాల పనితీరును మెరుగుపరచడం ద్వారా శరీర రోగ నిరోధక శక్తిని జింక్ బలోపేతం చేస్తుంది. ఇది లోపిస్తే జబ్బుపడే అవకాశాలు ఎక్కువ.

శరీరంలో కండరాలు, కణాల పెరుగుదలకు జింక్ అత్యవసరం. ఒకవేళ మీకు గాయాలు నెమ్మదిగా మానుతుంటే జింక్ లోపం వల్లేమో అని అనుమానించాలి. జింక్ స్థాయులు తక్కువగా ఉంటే శరీరంలో కొలాజెన్ అంతగా ఏర్పడదు. దీంతో చర్మం పూడుకుపోవడం ఆలస్యం అవుతుంది. గాయాలు మానడం మందగిస్తుంది.

వాసన గ్రాహకాలు సక్రమంగా పనిచేయడానికి జింక్ కీలకం. ఇది లోపిస్తే రుచి, వాసన గ్రాహకాలు స్పందించడం తగ్గుతుంది. తిండి రుచించడం లేదంటే జింక్ తక్కువగా ఉందనడానికి సంకేతం కావచ్చు. మాడుపై జుట్టు కుదుళ్ల ఆరోగ్యానికి జింక్ అండగా నిలుస్తుంది. దీని లోపం వల్ల వెంట్రుకల నిర్మాణం బలహీనపడుతుంది. జుట్టు రాలడం, పల్చబడటానికి దారితీస్తుంది. మామూలు కంటే ఎక్కువగా జుట్టు రాలిపోతుంటే భోజనంలో జింక్ అధికంగా లభించే పదార్థాలను చేర్చుకోవాలి.

జింక్ లోపం వల్ల మొటిమలు, దద్దుర్లు లాంటి చర్మ సమస్యలు తలెత్తుతాయి. చర్మంలో ఇన్‌ఫ్లమేషన్, తైలం ఉత్పత్తిని జింక్ నియంత్రిస్తుంది. తగినంతగా అందకపోతే చర్మం మంటగా అనిపిస్తుంది. ఇన్ఫెక్షన్లు బాధిస్తాయి. గోళ్లపై తెల్లమచ్చలు జింక్ లోపానికి సంకేతాలు. కణాల ఉత్పత్తిలో జింక్ ప్రధానపాత్ర పోషిస్తుంది. తగినంతగా అందకపోతే గోళ్లు బలహీనపడతాయి. పాలిపోతాయి. పెరుగుదల నెమ్మదిస్తుంది. గోళ్లు తేలిగ్గా విరిగిపోతుంటే జింక్ తీసుకోవడం పెరగాలని అర్థం.

మన రుచి, జీర్ణక్రియ, జీవక్రియల సామర్థ్యాలను జింక్ ప్రభావితం చేస్తుంది. ఇది లోపించినప్పుడు ఆకలి తగ్గుతుంది. కాలక్రమంలో అవాంఛనీయ బరువు తగ్గుదల, అలసట, పోషక లోపాలకు దారితీస్తుంది. ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది.

శరీరంలో తగినన్ని జింక్ నిల్వలు ఉంటేనే మెదడు సరిగ్గా పనిచేస్తుంది. లోపిస్తే బైర్లు కమ్మినట్టు ఉంటుంది. ఏకాగ్రత కుదరదు. జ్ఞాపకశక్తి సమస్యలు వస్తాయి. న్యూరోట్రాన్స్‌మిటర్ పనితీరులో జింక్ పాత్ర కూడా ఉంటుంది. తగ్గితే మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతుంది. మెదడులో రసాయనాలైన సెరటోనిన్, డోపమైన్‌లను సమతూకంలో ఉంచటానికి జింక్ అవశ్యకం. తగ్గితే ఆందోళన, అసహనం, కుంగుబాటు తలెత్తవచ్చు. మూడ్‌లో తేడాలు అనిపించడం, విచారంగా ఉండటం, ఒత్తిడి ఎదుర్కోవడం తెలియకుండా ఉంటే జింక్ అవసరమని తెలుసుకోవాలి.

పొట్టలో లైనింగ్ సరిగ్గా ఉండటానికి, ఎంజైములు విడుదల కావడానికి జింక్ దోహదపడుతుంది. ఇది లోపిస్తే కడుపుబ్బరం, విరేచనాలు, ఇరిటేబుల్ బోవెల్ లక్షణాలు తలెత్తుతాయి. పోషకాలు శరీరానికి అందాలంటే జింక్ అత్యవసరం. తగ్గితే జీర్ణక్రియ సాఫీగా జరగదు. పొట్టలో బ్యాక్టీరియా సమతూకం కూడా దెబ్బతింటుంది.

ఇవీ జింక్ వనరులు

గుమ్మడి గింజలు, నువ్వులు, శనగలు, పప్పుధాన్యాలు (లెంటిల్స్), బాదం, కాజు లాంటి గింజల్లో జింక్ పుష్కలంగా దొరుకుతుంది. మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులు, గుడ్లు, ఆయ్‌స్టర్స్ లాంటి సముద్ర ఆహారం కూడా జింక్ గనులు. చీజ్, యోగర్ట్ లాంటి పాల పదార్థాల్లోనూ జింక్ ఉంటుంది. ముతక ధాన్యాలు, పాలకూర నుంచి మొక్కల ఆధారిత జింక్ లభిస్తుంది. ఆహారంతో కలిపి విటమిన్ సి కూడా తీసుకుంటే జింక్ బాగా వంటబడుతుంది.

అపోలో స్పెక్ట్రా సీనియర్ డైటీషియన్, ఫౌజియా అన్సారి.

మేని మెరుపులకు బ్రోకలీ

బ్రోకలీ తింటే ఆరోగ్యానికి మంచిదని తెలుసు. కానీ ఇది చర్మ సంరక్షణకు కూడా ఎంతో తోడ్పడుతుం దని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్...చర్మం మీద ముసలితనం గుర్తులను పోగొట్టి సహజ కాంతితో మెరిసేలా చేస్తాయని అంటున్నారు.

చర్మ ఆరోగ్యానికి...

వయసు పెరుగుతున్నప్పుడు సహజంగానే చర్మం సాగే గుణాన్ని కోల్పోతుంది. దీంతో చర్మం కుంచించుకుపోయి ముడతలు ఏర్పడుతుంటాయి. వీటిని నివారించి చర్మం బిగుతుగా మారాలంటే కొల్లాజెన్ కావాలి. దీన్ని బ్రోకలీలోని సి విటమిన్ ఉత్పత్తి చేస్తుంది. అందుకే రెండు రోజులకు ఒకసారి బ్రోకలీని ఆహారంలో చేర్చుకోవడం మంచిది.

బ్రోకొలీని తినడం వల్ల శరీరానికి సల్ఫోరాఫేన్ అనే యాంటీ ఆక్సిడెంట్ లభిస్తుంది. ఇది చర్మాన్ని ఆక్సీకరణ ఒత్తిడి, వాపుల నుంచి కాపాడుతుంది. చర్మ కణాలను నాశనం చేసే ఫ్రీ రాడికల్స్‌పై పోరాడుతుంది. బయటికి వెళ్లినప్పుడు ఎండలోని అతినీలలోహిత కిరణాల వల్ల చర్మానికి హాని కలగకుండా రక్షణ పొరలను ఏర్పరుస్తుంది. బ్రోకలీని తరచూ తింటూ ఉంటే శరీరానికి కావాల్సినంత ఎ విటమిన్ లభిస్తుంది. ఇది చర్మం మీద మృతకణాలను తొలగించి కొత్తవాటిని ఉత్పత్తి చేస్తుంది. చర్మం పొడిబారడాన్ని నివారిస్తుంది. దీంతో చర్మం తేమగా, మృదువుగా ప్రకాశిస్తుంది.

ముఖ సౌందర్యానికి...

స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక కప్పు బ్రోకలీ ముక్కలు వేసి తగినన్ని నీళ్లు పోసి మెత్తగా ఉడికించాలి. తరవాత ఈ మిశ్రమాన్ని చల్లార్చి చెంచాతో గుజ్జులా మెదపాలి. ఇందులో ఒక చెంచా తేనె వేసి కలపాలి. ఈ పేస్టుని ముఖమంతా పట్టించాలి. పావుగంటసేపు ఆరిన తరవాత ముఖాన్ని మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే ముఖం మీద చర్మం తేమతో నిండి ఛాయగా మెరుస్తుంది. ఈ మిశ్రమంలో తేనెకు బదులు ఒక చెంచా ఓట్‌మీల్ వేసి కలిపి ముఖానికి రాస్తే దురద, మంట లాంటివి తగ్గుతాయి.

ఒక గిన్నెలో రెండు చెంచాల బ్రోకలీ గింజల నూనె తీసుకోవాలి. దీన్ని వేళ్లతో అద్ది ముఖమంతా రాయాలి. నుదుటి మీద అలాగే కళ్లు, ముక్కు, పెదవుల చుట్టూ ఈ నూనెతో మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తే ముఖం మీద ముడతలు తగ్గుతాయి.

మిక్సీ గిన్నెలో అరకప్పు బ్రోకలీ మొలకలు వేసి ఒక కప్పు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి వడబోసి రసాన్ని సిద్ధం చేసుకోవాలి. ఇందులో దూది వుండను ముంచి దానితో ముఖమంతా అద్దాలి. పది నిమిషాలు ఆరాక చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే ముఖంమీద చర్మ రంధ్రాలు శుభ్రమవుతాయి. మొటిమలు, గుల్లలు రావు. మచ్చలు ఏవైనా ఉన్నాకూడా వెంటనే తగ్గిపోతాయి.

బ్రోకలీని సాధ్యమైనంత చిన్న ముక్కలుగా తరగాలి. ఒక గిన్నెలో అరకప్పు బ్రోకలీ ముక్కలు, రెండు చెంచాల యోగర్ట్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని ముఖం మీద సున్నితంగా రుద్దాలి. ఇది స్క్రబ్బర్‌లా పనిచేసి ముఖం మీద పేరుకున్న మురికిని తొలగి స్తుంది. ముఖం మృదువుగా ప్రకాశ వంతంగా తయారవుతుంది.

ఎండాకాలంలో బయటికి వెళ్లి ఇంటికి రాగానే ముఖం ఎర్రగా కమలడం లేదా నల్లగా మారడం చూస్తూ ఉంటాం. ఇలాంటప్పుడు బ్లెండర్‌లో కొన్ని బ్రోకలీ ముక్కలు, కొన్ని నీళ్లు పోసి బాగా బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఐస్ ట్రేలో పోసి ఫ్రీజర్‌లో ఉంచి క్యూబ్స్ తయారు చేసుకోవాలి. ఈ క్యూబ్స్‌తో ముఖాన్ని రుద్దితే ఎర్రదనం లేదా నల్లదనం తగ్గి చల్లని అనుభూతి కలుగుతుంది.

పచ్చిమిరప రెండంచుల కత్తి

పచ్చిమిరప లేనిదే తెలుగు భోజనం పూర్తి కాదు. కొందరికి నాలుకకు కారం చురుకు తగలనిదే భోజనం ఏమాత్రం రుచించదు. అలాగని ప్రతి కూరలో పచ్చిమిరపకాయలను దట్టిస్తే మాత్రం ఆరోగ్యానికి చేటే! ఎందుకో తెలుసుకుందాం!

సమతులాహారంలో ప్రతి కూరగాయకూ ప్రత్యేక పాత్ర ఉంటుంది. అయితే పచ్చిమిరపకు ఈ సూత్రం వర్తించదు. ఒక భోజనంలో ఒక పచ్చిమిరపకాయకు పరిమితమైతే, చర్మం నునుపుగా మారుతుంది. శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరుగుతుంది. ఒక భోజనంలో ఒక పచ్చిమిరప, బరువు తగ్గడానికి కూడా కొంతమేరకు సహాయపడుతుంది. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉండే పచ్చిమిరపకాయలను తినడం ఆరోగ్యకరమే అయినప్పటికీ వాటిలోని క్యాప్సేసిన్ పరిమాణం ప్రభావం జీర్ణాశయం లోపలి పొరను దెబ్బతీయకుండా ఉండాలంటే, వాటిని పరిమితంగానే తీసుకోవాలంటున్నారు ముంబయిలోని

పచ్చిమిరపకాయలను అతిగా తినడం వల్ల ఛాతీలో మంట, అసిడిటీలు వేధిస్తాయని హెచ్చరిస్తున్నారామె. మరీ ముఖ్యంగా పొట్టలో అల్సర్లు ఉన్నవాళ్లు, పచ్చిమిరపకాయలను వీలైనంత తగ్గించాలనీ, లేదంటే పరిస్థితి మరింత దిగజారుతుందనీ అంటున్నారామె. ఒకవేళ పచ్చిమిరపకాయలను తినడాన్ని ఇష్టపడేవాళ్లైతే, ముదురు ఆకుపచ్చ, లేదా పండు మిరపకాయలకు బదులుగా లేత ఆకుపచ్చ రంగు మిరపకాయలు తినడం మేలని కూడా సూచిస్తున్నారామె.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 | హైదరాబాద్ బుధవారం 26 | మార్చి | 2025

ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..

న్యూఢిల్లీ-నవభూమి: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. టారిఫ్ నుంచి పలు దేశాలకు ఊరట కల్పిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంకేతాలతో స్టాక్ మార్కెట్లు ఉదయం లాభాల్లో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 78వేల పాయింట్లు దాటింది. ఈ క్రమంలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. దాంతో ఆరంభంలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. చివరలో స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే 78,296.28 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 78,741.69 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. కనిష్ఠంగా 77,745.63 పాయింట్లను తాకింది. చివరకు 32.8 పెరిగి 78,017.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.30 పాయింట్లు పెరిగి.. 23,668.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దాదాపు 1,019 షేర్లు పెరగ్గా.. 2,868 షేర్లు పతనమయ్యాయి. ఐటీ మినహా, మిగతా అన్ని రంగాల సూచీలు ఆటో, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, ఆయిల్, గ్యాస్, పవర్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ, టెలికాం షేర్లు ఒకటి నుంచి 1.5శాతం పతనమయ్యాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా, అదానీ పోర్ట్స్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.6 శాతం పతనమయ్యాయి.

ఆపిల్ నుంచి అదరిపోయేలా మడతపెట్టే ఫోన్..! ఫుల్ డీటెయిల్స్ ఇవే..!

న్యూఢిల్లీ-నవభూమి: ఆపిల్ కంపెనీ చాలాకాలంగా 4-మోడల్ ఐఫోన్ సిరీస్‌ను కొనసాగిస్తున్నది. ఈ ఏడాది నుంచి మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆపిల్ ఈ ఏడాది ఐఫోన్ 17 ఎయిర్‌ను విడుదల చేయాలని యోచిస్తున్నది. ఇది ప్లస్ వేరియంట్‌ని భర్తీ చేయనున్నది. ఈ ట్రెండ్‌ను కొనసాగిస్తూ.. కంపెనీ 2026 కంపెనీ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ని విడుదల చేసే అవకాశం ఉన్నది. కొత్త బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. ఆపిల్ ఈ డివైజ్ కోసం క్లామ్‌షెల్ (ఫ్లిప్) డిజైన్ కాకుండా శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ తరహాలో బుక్ స్టయిల్ డిజైన్‌ను తీసుకురానున్నది.

నివేదిక ప్రకారం.. ఐఫోన్ ఫోల్డబుల్ శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్‌ని పోలి ఉండనున్నట్లు తెలుస్తున్నది. డిజైన్ ఐఫోన్ 17 ఎయిర్ నుంచి ప్రేరణగా తీసుకోనున్నది. ఆపిల్ త్వరలో తీసుకురానున్న ఐఫోన్ 17 ఎయిర్ ఆల్ట్రా సిమ్‌గా తెలుస్తున్నది. కేవలం 5.5 ఎంఎం మందం మాత్రమే ఉండనున్నట్లు తెలుస్తున్నది. దాంతో కెమెరా, స్పీకర్ క్వాలిటీలో రాజీ పడక తప్పదని నివేదిక పేర్కొంది. కానీ, బ్యాటరీ లైఫ్ ఐఫోన్ 16ఈ తరహాలోనే ఉంటుంది. ఇక ఐఫోన్ 17 ఎయిర్ వినూత్న డిజైన్‌ను ఆపిల్ భవిష్యత్ ఫోల్డబుల్ ఐఫోన్‌కు పునాదిగా భావిస్తున్నది. లీకుల ప్రకారం.. ఐఫోన్ ఫోల్డబుల్ పూర్తిగా తెరిచిన సమయంలో 7.8 ఇంచెస్ మెయిన్ డిస్‌ప్లే, 5.5 ఇంచెస్ ఎక్స్‌టర్నల్ స్క్రీన్‌తో వస్తుంది. స్ట్రాంగ్, డ్యూరబుల్‌తో ఫోన్‌ని తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందు కోసం లిక్విడ్ మెటల్‌ని ఉపయోగించనున్నట్లు సమాచారం. ఫోల్డబుల్ ఫోన్ ఓపెన్ చేసిన సమయంలో 4.5 ఎంఎం.. మతపెట్టిన సమయంలో 9 ఎంఎం నుంచి 9.5 ఎంఎం మందం ఉండనున్నది. ఇదే నిజమైతే ఇప్పటి వరకు ఉన్న ఫోల్డబుల్ ఫోన్‌లలో ఇదే స్లిమ్ ఫోన్‌గా మారనున్నది. ఇక ఆపిల్ ఫేస్ టచ్ ఐడీకి బదులుగా టచ్ ఐడీ సెన్సార్‌ను తీసుకురానున్నట్లు తెలుస్తున్నది. ఫోన్ క్వాలిటీని మెరుగుపరిచేందుకు టైటానియం ఛాసిస్‌ను ఉపయోగించవచ్చని తెలుస్తున్నది. దాంతో మొబైల్ తక్కువ బరువుతో ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ అందించనుంది. ఇప్పటి వరకు మొబైల్ స్పెసిఫికేషన్స్‌ను ఆపిల్ వెల్లడించలేదు. కేవలం ఇవన్నీ లీకులు మాత్రమే. ఇక ఈ మొబైల్ ధర అమెరికాలో 2,300 డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.1.91లక్షలుగా ఉండనున్నట్లు తెలుస్తున్నది.

అప్పుడు గ్రాముకు రూ. 2943.. ఇప్పుడు రూ. 8624.. లక్షపై ఇంత లాభమొచ్చిందా?

న్యూఢిల్లీ-నవభూమి: బంగారంపైన పెట్టుబడులు పెట్టేందుకు మనకు చాలానే ఆప్షన్లు ఉన్నాయి. ఇందులో గోల్డ్ ఈటీఎఫ్, డిజిటల్ గోల్డ్, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఇలా చాలానే ఉన్నాయి. ఇంకా.. భౌతిక బంగారం కూడా ఉన్నప్పటికీ.. ఈ కొనుగోళ్లను తగ్గించే ఉద్దేశంతో.. 2015లో కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుల కోసం సావరిన్ గోల్డ్ బాండ్ పథకం లాంఛ్ చేసింది. దీనికి అప్పట్లో మంచి ఆదరణ ఉండేది. బంగారం ధర పెరిగిన దానిని బట్టి రిటర్న్స్ వస్తుంటాయి. ఇక్కడ కనీసం గ్రాము నుంచి గోల్డ్ కొనేందుకు ఛాన్స్ ఉంటుంది. గ్రామును యూనిట్‌గా పరిగణిస్తారు. ఇండివిడ్యువల్స్ గరిష్టంగా 4 కిలోల వరకు కొనుగోలు చేయొచ్చు. ట్రస్టులు, యూనివర్సిటీలు వంటివి 20 కిలోల వరకు కొనేందుకు అవకాశం ఉంటుంది. ఇక గోల్డ్ బాండ్లను కేంద్ర ప్రభుత్వం తరపున రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేస్తుంటుంది. గోల్డ్ బాండ్లను ఇష్యూ చేసే ముందు.. అలాగే రిడెంప్షన్ తేదీలకు ముందు మూడు రోజుల సగటు ధర ఆధారంగా గోల్డ్ బాండ్ ఇష్యూ ప్రైస్, రిడెంప్షన్ ప్రైస్ ప్రకటిస్తుంది ఆర్బీఐ. ఈ ధరల్ని మాత్రం ఇండియన్ బులియన్ జువెల్లర్స్ అసోసియేషన్ నిర్ణయిస్తుంది.

గతంలో ఒక నెలలోనే చాలా సార్లు గోల్డ్ బాండ్లు జారీ చేసేది.. తర్వాత దీనిని తగ్గించి నెలకోసారి.. ఆ తర్వాత మళ్లీ త్రైమాసికానికి ఒక సారి ఇలా బాండ్లను జారీ చేయగా.. ఇటీవల మాత్రం దీనిని నిలిపివేసింది. గతేడాది ఫిబ్రవరిలో చివరిసారి రాగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు జారీ చేయలేదు. వీటిని దాదాపు ముగించినట్లే కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఇటీవల బడ్జెట్ సమయంలో వెల్లడించాయి.

గోల్డ్ బాండ్ల కాలపరిమితి 8 సంవత్సరాలు కాగా.. 5 సంవత్సరాల తర్వాత ముందుగానే ఉపసంహరించుకునేదుకు ఛాన్స్ ఉంటుంది. బంగారం ధరలు ఇటీవల భారీగా పెరిగిన క్రమంలో.. అప్పట్లో గోల్డ్ బాండ్లను కొనుగోలు చేసిన వారికి మంచి రిటర్న్స్ వచ్చాయని చెప్పొచ్చు. ఇటీవల ఆర్బీఐ గతంలో ఇష్యూ చేసిన గోల్డ్ బాండ్లకు సంబంధించి.. రిడెంప్షన్ తేదీల్ని, రిడెంప్షన్ ధరల్ని.. ప్రీమెచ్యూర్ రిడెంప్షన్, ప్రైస్ ప్రకటిస్తూ వస్తోంది.

2016-17 సిరీస్ %×ఎ% కు సంబంధించి మెచ్యూరిటీ ఇటీవల 2025 మార్చి 17కు ముగిసింది. అప్పట్లో గ్రాముకు రూ. 2,943 చొప్పున ఇష్యూ చేయగా.. రిడెంప్షన్ ప్రైస్ రూ. 8,624 ప్రకటించింది. దీంతో బంపర్ ప్రాఫిట్స్ వచ్చాయి. ఇంకా దీనికి వడ్డీ కూడా అందిస్తుంది. అప్పట్లో 2.50 శాతం వడ్డీ రేటు ఉంది. ఆన్‌లైన్‌లో గ్రాముపై రూ. 50 డిస్కౌంట్ కూడా ఉంటుంది. ఇక పెట్టుబడి పరంగా చూస్తే అప్పుడు రూ. లక్ష ఇన్వెస్ట్ చేస్తే.. రూ. 2.93 లక్షలు వచ్చాయి. వడ్డీతో కలిపి రూ. 3 లక్షలకుపైనే వచ్చిందని చెప్పొచ్చు. దీంతో మూడింతల లాభం వచ్చింది. మరోవైపు.. 2019-20 సిరీస్ కు సంబంధించి ఇష్యూ ధర గ్రాముకు రూ. 3800 కాగా.. ఇప్పుడు ఐదేళు దాటగా ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ ప్రైస్ రూ. 8,634 గా ప్రకటించింది. ముందుగా తీసుకోవాలనుకుంటే.. ఇక్కడ చూస్తే రూ. లక్ష పెట్టుబడిపై రూ. 2.27 లక్షలు వచ్చాయి. వడ్డీతో కలిపి ఇంకా ఎక్కువే వచ్చిందని చెప్పొచ్చు.

జియో యూజర్లకు శుభవార్త.. ఈ రీఛార్జ్ ప్లాన్లపై ఉచితంగా 50 జిబి క్లౌడ్ స్టోరేజీ!

న్యూఢిల్లీ-నవభూమి: ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో తన వినియోగదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఉచితంగా AI క్లౌడ్ స్టోరేజీని అందిస్తోంది. ఎంపిక చేసిన ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ ప్లాన్లపై 50 జిబి క్లౌడ్ స్టోరేజీని ఉచితంగా ఇస్తోంది. గతేడాది రిలయన్స్ వార్షిక సర్వసభ్య సమావేశంలో సంస్థ అధినేత, భారత్‌లోనే అత్యంత ధనవంతుడైన ముకేశ్ అంబానీ 100 జిబిక్లౌడ్ స్టోరేజీని ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా కొన్ని ప్లాన్లకు ఈ స్టోరేజీని ఇప్పుడు అందిస్తున్నారు. దీనికి సంబంధించి.. రీఛార్జ్ ప్లాన్లను ప్రకటించింది. "మేము 100 జిబి క్లౌడ్ స్టోరేజీని ఉచితంగా అందిస్తాము" అని ఏజీఎంలో చెప్పారు అంబానీ. ఆ ప్రకటనకు అనుగుణంగానే ఇప్పుడు జియో ఈ ఉచిత క్లౌడ్ స్టోరేజీని అందిస్తోంది. ఇది వినియోగదారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా గూగుల్ స్టోరేజీ నిండిపోయిన వారికి ఇది ఒక మంచి అవకాశం. జియోలో రూ. 299 లేదా అంతకంటే ఎక్కువ మొత్తంతో రీఛార్జ్ చేసుకున్న వారికి ఈ క్లౌడ్ స్టోరేజీని ఇస్తోంది. తక్కువ మొత్తం రీఛార్జ్ చేసిన వారికి 5 జిబి డేటా మాత్రమే ఫ్రీ ట్రయల్ రూపంలో లభిస్తుంది. పోస్ట్‌పెయిడ్ ప్లాన్స్ అయినటువంటి.. రూ. 349, రూ. 449, రూ. 649, రూ. 749, రూ. 1549 లలో కూడా క్లౌడ్ స్టోరేజీ కలిపి ఉంది. ఇతర టెలికాం నెట్‌వర్క్ యూజర్లకు కూడా ప్రమోషనల్ స్టోరేజీలో భాగంగా కొంతకాలం పాటు 50 జిబి క్లౌడ్ స్టోరేజీని అందిస్తున్నట్లు జియో క్లౌడ్ తన వెబ్‌సైట్‌లో తెలిపింది.

మొదట గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్‌కి వెళ్ళండి. అక్కడ జియో క్లౌడ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి. మీ జియో నంబర్‌తో లాగిన్ అవ్వండి. అప్‌లోడ్ బటన్‌పై క్లిక్ చేసి మీకు కావాలసిన ఫైళ్లను ఎంచుకోండి. డెస్క్‌టాప్‌లో అయితే జియో క్లౌడ్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫైల్స్ అప్‌లోడ్ చేసుకోవచ్చు. గూగుల్ స్టోరేజీ నిండిపోయిన వారు.. జియో అందిస్తున్న క్లౌడ్ స్టోరేజీలోకి లార్జ్ ఫైల్స్‌ను ట్రాన్స్‌ఫర్ చేయడం ద్వారా స్పేస్ పొందొచ్చు.

స్టోరేజ్ ఆఫర్ వివరాలు:

50జిబి ఉచిత స్టోరేజ్: జియో వినియోగదారులు 50జిబి ఫ్రీ క్లౌడ్ స్టోరేజ్ పొందే అవకాశం ఉంది.

సురక్షిత డేటా బ్యాకప్: ఫోన్‌లో ఉన్న ఫైళ్లను ఆటోమేటిక్‌గా బ్యాకప్ చేసుకోవచ్చు.

ఎక్కడైనా యాక్సెస్: JioCloudలో ఉన్న డేటాను స్మార్ట్‌ఫోన్, ట్యాబ్లెట్, ల్యాప్‌టాప్ వంటి ఎటువంటి డివైస్ నుంచి అయినా యాక్సెస్ చేసుకోవచ్చు.

ఫైల్ షేరింగ్: జియోక్లౌడ్‌లో ఉన్న ఫైళ్లను ఆన్‌లైన్‌లో ఫ్రెండ్స్, ఫ్యామిలీతో ఈజీగా షేర్ చేసుకోవచ్చు.

అదనపు స్టోరేజ్: 50జిబి కంటే ఎక్కువ స్టోరేజ్ అవసరమైన వారికి అదనపు క్లౌడ్ ప్లాన్లు కూడా అందుబాటులోకి రానున్నాయి.

ఏడాదిలోనే లక్షకు రూ. 2 లక్షలు.. టాప్ స్కీమ్

న్యూఢిల్లీ-నవభూమి: 2025 ఆర్థిక సంవత్సరం మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లకు చాలా ప్రత్యేకంగా నిలిచింది. మార్కెట్ ఒడుదొడుకులు ఉన్నప్పటికీ కొన్ని పథకాలు మంచి రాబడిని అందించాయి. వాటిల్లో మిరే అసెట్ హ్యాంగ్ సెంగ్ టెక్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఫండ్.. ఏడాదిలోనే ఏకంగా 102.63 శాతం రాబడితో 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ టాప్ మ్యూచువల్ ఫండ్ పథకంగా నిలిచింది. మూడంకెల రాబడిని అందించిన ఏకైక పథకం ఇదే కావడం విశేషం. మిరే అసెట్ హ్యాంగ్ సెంగ్ టెక్ ఈటీఎఫ్ ఎఫ్ఓఎఫ్ అనేది ఒక ఓపెన్ ఎండెడ్ ఫండ్-ఆఫ్-ఫండ్ స్కీమ్. ఇది ప్రధానంగా మిరే అసెట్ హ్యాంగ్ సెంగ్ టెక్ ఈటీఎఫ్ యూనిట్లలో పెట్టుబడి పెడుతుంది. పెట్టుబడి పరంగా చూసినట్లయితే ఈ ఆర్థిక సంవత్సరం అంటే 2024 ఏప్రిల్ 1న నెలకు రూ. 10 వేల చొప్పున సిప్ ప్రారంభించిన వారికి.. రూ. 1.84 లక్షల రాబడి వచ్చింది. ఈ క్రమంలోనే ఏడాదిలోనే పెట్టుబడి రూ. 1.20 లక్షలు పోను.. రూ. 64 వేల ప్రాఫిట్ వచ్చిందని చెప్పొచ్చు. ఇక్కడ ఎక్స్‌టెండెడ్ ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ పైన చెప్పుకున్నది సిప్ పరంగా అయితే.. ఇప్పుడు లంప్‌సమ్ పరంగా రిటర్న్స్ చూద్దాం. 2024, ఏప్రిల్ 1న ఒకేసారి రూ. లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు రూ. 2.02 లక్షలు వచ్చాయి. ఇక్కడ వార్షిక ప్రాతిపదికన 102.62 శాతం వృద్ధి (%జూ+=%) నమోదు చేసిందని చెప్పొచ్చు. ఇక్కడ రూ. 1.02 లక్షల ప్రాఫిట్ వచ్చిందన్నమాట. సిప్ కంటే లంప్ సమ్‌తోనే ఏడాది వ్యవధిలో మంచి లాభాలు వచ్చాయన్నమాట. ఇక ఈ ఫండ్ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ 2024 ఏప్రిలలో రూ. 72.50 కోట్లుగా ఉండగా.. ఈ ఫిబ్రవరిలో రూ. 102.93 కోట్లకు పెరిగింది. ఏకంగా 42 శాతం వృద్ధి నమోదు చేయడం విశేషం. ఈ స్కీమ్ 2021, డిసెంబర్‌లో ప్రారంభమైంది. హ్యాంక్ సెంగ్ టెక్ టీఆర్ఐ.. ఈ పథకానికి కొలమానంగా ఉంది. ఈ ఫండ్ మేనేజర్లుగా ఏక్తా గాలా, విశాల్ సింగ్ ఉన్నారు. చైనా టెక్నాలజీ రంగం పుంజుకోవడం వల్ల ఈ పథకం మంచి పనితీరు కనబరిచిందని నిపుణులు అంటున్నారు. చైనా ప్రభుత్వం నుంచి పాలసీ మద్దతు లభించడం, డిజిటల్ ఎకానమీపై నియంత్రణ సడలింపు, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కొత్త టెక్నాలజీలపై ఇన్వెస్టర్ల నమ్మకం పెరగడం వంటివి దీనికి దోహదపడ్డాయి అని ఫిస్‌డమ్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ సాగర్ షిండే అన్నారు. ఇంకా దీర్ఘకాలం పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ఈ స్కీమ్ అనుకూలంగా ఉంటుందని అంటున్నారు. కనీసం రూ. 5 వేలతో ఇందులో చేరొచ్చు. ఇక సిప్ అయితే కనీసం రూ. 99 నుంచే ఇన్వెస్ట్ చేయొచ్చని చెబుతున్నారు.

టాటా ఆటోకాంప్ గూటికి స్వీడన్ కంపెనీ

న్యూఢిల్లీ-నవభూమి: ఇంటర్నేషనల్ ఆటోమోటివ్ కాంపొనెంట్స్ గ్రూప్ స్వీడన్ ఏబీని (ఐఏసీ స్వీడన్) కొనుగోలు చేస్తున్నట్లు టాటా ఆటోకాంప్ సిస్టమ్స్ లిమిటెడ్ సోమవారం ప్రకటించింది. ఎంతకు కొనుగోలు చేయనున్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. టాటా ఆటోకాంప్ ఐరోపా ఆటోమోటివ్ రంగంలో బలపడేందుకు ఈ డీల్ దోహదపడనుంది. 80 కోట్ల డాలర్ల టర్నోవర్ కలిగిన ఐఏసీ స్వీడన్.. వాహన రంగానికి అవసరమైన ఇంటీరియర్ సిస్టమ్స్, విడిభాగాలను తయారు చేస్తుంది.

స్వల్ప లాభాల్లో గట్టెక్కిన నిఫ్టీ, సెన్సెక్స్ రెడ్ లో బ్యాంక్ నిఫ్టీ

న్యూఢిల్లీ-నవభూమి: భారత స్టాక్ మార్కెట్లు మిశ్రమ ఫలితాలతో ముగిశాయి. నిఫ్టీ, సెన్సెక్స్ స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ మాత్రం 97 పాయింట్ల స్వల్ప నష్టాలతో ముగించింది. ఈ ఉదయం మార్కెట్ ఓపెనింగ్ గ్యాప్ అప్ తో ప్రారంభమై వరుసగా ఏడవ రోజు గ్రీన్ లో నిలిచింది. ఆ తర్వాత తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 32 పాయింట్లు పుంజుకొని 78,017 వద్ద నిలిచింది. నిఫ్టీ 10 పాయింట్లు పెరిగి 23,668 దగ్గర నిలిచింది. అటు, డాలరుతో పోలిస్తే రూపాయి విలువ రూ. 85.68 వద్ద ఉంది. బ్యాంక్ నిఫ్టీ ఇవాళ రెడ్ లో క్లోజైంది. 97 పాయింట్లు కోల్పోయి 51,607 దగ్గర నిలిచింది. ఫిన్ నిఫ్టీ 28 పాయింట్లు పెరిగి 25,086 దగ్గర ముగియగా, బ్యాంకెక్స్ 64 పాయింట్లు కోల్పోయి 59,580 దగ్గర ముగిసింది. అటు, మిడ్ క్యాప్ ఇండెక్స్‌లు కూడా నష్టాల్లో ముగిశాయి. వరుసగా 7వ రోజు లాభాల పరంపరని కొనసాగిస్తూ దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ కూడా ప్రారంభంలో భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. అయితే, ఉదయం 9.45 గంటల తర్వాత నుంచి క్రమంగా మార్కెట్లు తగ్గుతూ వచ్చాయి.

ఉదయం 9.25 సమయంలో నిఫ్టీ 23,870 వద్దకు చేరింది. సెన్సెక్స్ ప్రారంభంలో 78,750 వరకూ చేరింది. ఇవాళ సెన్సెక్స్ ఎక్స్‌పయిరీ కూడా ఉండటంతో మార్కెట్లు ఒడిదుడుకుల్లో కొనసాగాయి. ఒక దశలో నిఫ్టీ 23, 800 మార్క్ ను చేరుకోవడం ఇవాళ్టి మార్కెట్లో విశేషం. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1 శాతానికి పైగా నష్టాలు ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభాలివ్వగా, జొమాటో, ఇండస్ ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.46 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3027 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

పదేళ్లలో ఇండియా జీడీపీ డబుల్..

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ!

న్యూఢిల్లీ-నవభూమి: గత కొంతకాలంగా అంతర్జాతీయంగా ఎన్ని అనిశ్చితి పరిస్థితులు ఎదురైనా.. రాజకీయ భౌగోళిక ఉద్రిక్తతలు తలెత్తినా భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం చెక్కుచెదరలేదు. స్థిరంగా రాణిస్తుందని పలు గణాంకాలు స్పష్టం చేశాయి. ఏటా జీడీపీ, ద్రవ్యోల్బణం దీనికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు భారత్ మరో ఘనత సాధించింది. గత పదేళ్లలో భారత జీడీపీ (స్థూల జాతీయోత్పత్తి) రెట్టింపు అయింది. ఈ మేరకు అంతర్జాతీయ ద్రవ్య నిధి గణాంకాల్లో వెల్లడైంది. దీనికి సంబంధించిన గణాంకాల్ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సహా బీజేపీ నాయకుడు అమిత్ మాలవీయ తమ సోషల్ మీడియాల్లో షేర్ చేశారు. 2015లో భారత ఆర్థిక వ్యవస్థ 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా.. ఇప్పుడు 4.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. ఈ క్రమంలోనే ఏకంగా 105 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న అమెరికా, రెండో స్థానంలోని చైనాకు కూడా సాధ్యం కాలేదు. దీంతో.. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్నట్లువంటి ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని చెప్పొచ్చు.

ఇక ఐఎంఎఫ్ ప్రకారం.. ఇదే విధంగా భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు కొనసాగితే.. 2025 నాటికి జపాన్, 2027 నాటికి జర్మనీని అధిగమించే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేసింది. '2015 నుంచి 2025 మధ్య భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఎంతో వృద్ధి చెందింది. దీని ఫలితంగా ప్రపంచంలోనే టాప్-5 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచింది. డేటా ప్రకారం, ఈ వృద్ధి కొనసాగితే, అతి త్వరలోనే జపాన్, జర్మనీలను కూడా దాటేస్తుంది.' అని ఐఎంఎఫ్ వెల్లడించింది.

పసిడి ప్రియులకు గుడ్ న్యూస్.. భారీగా తగ్గిన బంగారం ధర..

న్యూఢిల్లీ-నవభూమి: పసిడి ప్రియులకు గుడ్ న్యూస్. బంగారం ధర భారీగా పడిపోయింది. కొన్ని రోజులుగా వరసగా పెరుగుతూ వస్తున్న రేటు నేడు (25-03-2025) భారీగా తగ్గుముఖం పట్టింది. మంగళవారం ఉదయం 06:30 గంటల సమయానికి https://bullions.co.in ప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.80,566 ఉండగా.. ఇవాళ రూ.80,117కు తగ్గింది. 24 క్యారెట్ల తులం పసిడి రేటు నిన్న రూ.87,890 కాగా.. ఈరోజు రూ.87,400కు పడిపోయింది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర సోమవారం రూ.80,713 ఉండగా.. నేడు రూ.80,254కు తగ్గుముఖం పట్టింది. అలాగే 24 క్యారెట్ల తులం గోల్డ్ రేటు నిన్న రూ.88,050 కాగా.. ఇవాళ రూ.87,550కు పడిపోయింది. ఇక హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సోమవారం రూ.80,841 కాగా.. నేడు రూ.80,383కు తగ్గింది. 24 క్యారెట్ల తులం పసిడి రేటు నిన్న రూ.88,190 ఉండగా.. ఈరోజు రూ.87,690కు పడిపోయింది.

దేశవ్యాప్తంగా బంగారం (22, 24 క్యారెట్ల) ధర పరిస్థితి ఎలా ఉందంటే..

కోల్‌కతా- రూ.80,144, రూ.87,430
చెన్నై- రూ.80,483, రూ.87,800
బెంగళూరు- రూ.80,318, రూ.87,620
పుణె- రూ.80,254, రూ.87,550
అహ్మదాబాద్- రూ.80,355, రూ.87,660
భువనేశ్వర్- రూ.80,273, రూ.87,570
భోపాల్- రూ.80,337, రూ.87,640
కోయంబత్తూర్- రూ.80,483, రూ.87,800
పట్నా- రూ.80,208, రూ.87,500
సూరత్- రూ.80,355, రూ.87,660

వెండి ధరల పరిస్థితి ఇది..

దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం కిలో వెండి రూ.97,740 ఉండగా.. మంగళవారం రూ.97,470కు తగ్గింది. ముంబైలో నిన్న కేజీ వెండి రూ.97,910 కాగా.. ఇవాళ రూ.97,640కు చేరింది. ఇక హైదరాబాద్, విజయవాడ, విశాఖలో కిలో వెండి సోమవారం రూ.98,060 ఉండగా.. నేడు రూ.97,790కు పడిపోయింది.

రూ. 50 లక్షల హోం లోన్‌పై 12 లక్షలు ఆదా.. ఎంత లాభమో కదా!

న్యూఢిల్లీ-నవభూమి: ఈ రోజుల్లో ఆర్థిక నిర్వహణ అంత సులభమేమీ కాదు. ఆర్థిక నిర్వహణ అంటే చాలా మంది పొదుపు చేయడం లేకపోతే పెట్టుబడులు పెట్టడం అనే అనుకుంటుంటారు. అయితే ఇక్కడ పొదుపు, మదుపుతో పాటు చాలానే ఉంటాయి. భవిష్యత్తులో వచ్చే ఖర్చులకు కూడా సిద్ధంగా ఉండగలగాలి. ఇదంతా అప్పులను వదిలించుకుంటేనే సాధ్యమవుతుంది. పొదుపు చేయడం లేదా పెట్టుబడులు పెట్టడం అనేదే ఆర్థిక నిర్వహణ అని చాలామంది అనుకుంటారు. కానీ, నిజంగా ఆర్థిక నిర్వహణ అంటే 'పొదుపు, మదుపుతో పాటు భవిష్యత్తులో వచ్చే ఖర్చులకు సిద్ధంగా ఉండటం, అప్పులు లేకుండా సుస్థిరంగా జీవించడం' అని చెప్పాలి. ప్రతి రూపాయి మన ఖాతాలోనే ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం చాలా ముఖ్యం. ముఖ్యంగా అప్పుల భారాన్ని తగ్గించుకోవడం చాలా అవసరం. ఇప్పుడు ఈ అప్పులు ఎలా తగ్గించుకోవాలనేది మనం చూద్దాం. అప్పులు ఎలా తగ్గించుకోవాలి?

అప్పుల జాబితా తయారు చేసుకోవాలి. ఇక్కడ మీరు తీసుకున్న రుణాలను పూర్తిగా అర్థం చేసుకోవడం మొదటి స్థాయి. వాటి వడ్డీ రేట్లు, కనీస చెల్లింపులు, గడువు తేదీలను లెక్కించండి. అధిక వడ్డీ ఉన

మండుటెండల్లో విధులు.. ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లు

చెన్నై-నవభూమి: వేసవి కాలంలో శిరస్త్రాణాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు వర్ణనాతీతం. మండుటెండల్లో విధులను నిర్వహించే ట్రాఫిక్ పోలీసుల కష్టాలను ఉన్నతాధికారులు గుర్తించారు. చెన్నైలోని అవడి సిటీ పోలీసులు ఎయిర్-కండిషన్డ్ హెల్మెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇవి మైనస్ 15 డిగ్రీల సెల్సియస్ చల్లదనాన్ని, 10 డిగ్రీల సెల్సియస్ వెచ్చదనాన్ని ఇవ్వగలవు. వీటిని ధరించినవారి మెడ క్రింది భాగం కన్నా తల భాగంలో మూడు రెట్ల చల్లదనాన్ని ఇస్తాయి. అందువల్ల తలనొప్పి, అలసట వంటివి తగ్గుతాయి. ఎయిర్ కండిషనింగ్‌ను ఆన్ చేసినపుడు కాస్త వైబ్రేషన్ వస్తుందని అవడి సిటీ పోలీస్ కమిషనర్ కే శంకర్ చెప్పారు. తమ పరిధిలో పని చేస్తున్న 334 మంది ట్రాఫిక్ కానిస్టేబుళ్లలో 50 మందికి ఈ ఏసీ హెల్మెట్లను ఇచ్చామని తెలిపారు. వీటి పనితీరును విశ్లేషించిన తర్వాత మిగిలిన వారికి కూడా వీటిని ఇవ్వాలని అనుకుంటున్నామని చెప్పారు.

ఒకే దేశం-ఒకే ఎన్నిక.. జేపీసీ గడువు పొడిగింపు..!

న్యూఢిల్లీ-నవభూమి: ఒకే దేశం-ఒకే ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించేందుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. కమిటీ పదవీకాలం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారం తొలి రోజు వరకు ఉండనున్నది. ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పీపీ చౌదరి లోక్‌సభలో కమిటీ పదవీకాలాన్ని పొడిగించే తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా.. వాయిస్ ఓటు ద్వారా ఆమోదించారు. రాజ్యసభ నుంచి కొత్త సభ్యుడికి కూడా పార్లమెంటరీ కమిటీలో స్థానం కల్పించినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభకు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

దాంతో 39 మంది సభ్యుల కమిటీలో ఓ పోస్టు ఖాళీ కావడంతో కొత్తగా సభ్యుడికి చోటు కల్పించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం విధితమే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉందని.. జేపీసీకి బిల్లును పంపాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోక్‌సభ 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. కమిటీకి బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నేతృత్వం వహిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పురుషోత్తం రూపాలా, మనీశ్ తివారీ, ప్రియాంక గాంధీ, బన్సూరి స్వరాజ్, సంబిత్ పాత్రాతో పాటు పలువురు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ కాల పరిమితి ఏప్రిల్ 4తో ముగియనున్నది. బిల్లుపై ఇంకా చర్చించాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో ఇప్పటికే న్యాయ నిపుణులతో కమిటీ చర్చలు జరిపింది. సుప్రీంకోర్టు మాజీ సీజేఐలు జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీ షా కమిటీ ఎదుట హాజరైన అభిప్రాయాలను తెలిపారు.

మీరు ప్రజాధనంతో శీష్ మహల్ కట్టుకున్నారు.. మేము మాత్రం : సీఎం రేఖా గుప్తా

న్యూఢిల్లీ-నవభూమి: ఢిల్లీలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం ఇవాళ తన తొలి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. సీఎం రేఖా గుప్తా రూ.లక్ష కోట్లతో బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గత ఆప్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకుందని, ఆ డబ్బును విలాసాల కోసం ఖర్చు చేసిందని ఆరోపించారు. సీఎం అధికారిక నివాసమైన 'శీష్ మహల్' మరమ్మతుల పేరిట కేజ్రీవాల్ రూ.45 కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చు చేశారని సీఎం ఆరోపించారు. ఢిల్లీని లండన్‌గా మారుస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకు బదులుగా ట్రాఫిక్ జామ్‌లకు నిలయంగా మార్చారని మండిపడ్డారు. అంతేకాకుండా ఎన్నో ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేశారని ధ్వజమెత్తారు. 'మీకు (ఆప్‌ను ఉద్దేశిస్తూ), మాకు (బీజేపీ) చాలా తేడా ఉంది. మీరు హామీలు ఇస్తారు. మేము వాటిని నెరవేరుస్తాము. మీరు పొరుగు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి అవినీతికి పాల్పడ్డారు. మేము కలిసికట్టుగా దేశాభివృద్ధి కోసం పని చేస్తున్నాము. మీరు శీష్ మహల్, లక్షల విలువైన బంగారు టాయిలెట్లను నిర్మించుకున్నారు. మేము పేదలకు ఇళ్లు, మరుగుదొడ్లను నిర్మిస్తాము' అని సీఎం రేఖా గుప్తా వ్యాఖ్యానించారు. ఢిల్లీని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు బీజేపీ ప్రభుత్వం యోచిస్తున్నట్లు సీఎం ఈ సందర్భంగా ప్రకటించారు. ఇందుకోసం రూ.177 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో శీష్ మహల్ సందర్శన కూడా ఉంటుందన్నారు.

ఆ వేదికను కూల్చడం చట్టబద్ధమే..

కానీ నా విషయంలో మాత్రం చట్టవిరుద్ధంగా జరిగింది.. కమ్రా వివాదంపై కంగన

ముంబై-నవభూమి: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే)ని లక్ష్యంగా చేసుకుని స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా వేసిన జోకులపై బీజేపీ ఎంపీ, బాలీవుడ్ స్టార్ నటి కంగనా రనౌత్ తీవ్రంగా స్పందించారు. కేవలం 2 నిమిషాల ఫేమ్ కోసం ఒకరిని అగౌరవపరచడం సరికాదన్నారు. అంతేకాదు, ఈ వివాదానికి కారణమైన వేదికను కూల్చడం చట్టబద్ధమైన చర్య అని పేర్కొన్నారు. అయితే, గతంలో తనపై తీసుకున్న చర్యమాత్రం చట్టవిరుద్ధం అని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వెలుపల మీడియాతో ఆమె మాట్లాడుతూ.. '2 నిమిషాల ఫేమ్ కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు. మన సమాజం ఎక్కడికి వెళుతోంది..? మాట్లాడింది ఎవరైనా కావొచ్చు. కానీ, ఒకరిని అవమానించడం, వారి పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేయడం సరైందికాదు. గౌరవమే సర్వస్వం అని భావించే వ్యక్తిని మీరు కామెడీ పేరుతో అవమానిస్తున్నారు. కామెడీ పేరుతో మన సంస్కృతిని, ప్రజలను దూషిస్తున్నారు. ఈ వివాదానికి సంబంధించి ఆ వేదికను కూల్చడం చట్టబద్ధంగానే జరిగింది. కానీ, నా విషయంలో మాత్రం చట్టవిరుద్ధంగానే జరిగింది' అని కంగన వ్యాఖ్యానించారు. కాగా, షిండేను లక్ష్యంగా చేసుకొని కమ్రా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శివసేన కార్యకర్తలు ముంబై స్టూడియోను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ విధ్వంసం తర్వాత బీఎంసీ ఉద్యోగులు భారీ పరికరాలతో అక్కడికి చేరుకొని స్టూడియోలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. స్టూడియో కూల్చడంపై పెద్ద ఎత్తున వివాదం చెలరేగిన నేపథ్యంలో కంగన ఈ వ్యాఖ్యలు చేశారు. 2020లో కంగన రనౌత్, అప్పటి ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. మూవీ మాఫియా కంటే ముంబై పోలీసులంటేనే భయంగా ఉందంటూ కంగన వ్యాఖ్యానించారు. ఇవి కాస్తా రాజకీయ దుమారానికి దారితీశాయి.

డిప్యూటీ సీఎంకి సారీ చెప్పను గాక చెప్పను.. తగ్గేదేలే అంటోన్న కమేడియన్

ముంబై-నవభూమి: మహారాష్ట్ర ఉప-ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ను ఉద్దేశించి స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆయన కామెడీ షోలో షిండేను ద్రోహిగా అభివర్ణించడంతో శివసేన కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోయారు. దీంతో షో జరిగిన యూనికాంటినెంటల్ హోటల్ వదకు వెళ్లి దాడికి దిగారు. అంతేకాదు, యూనికాంటినెంటల్ హోటల్‌లోని హాబిటాట్ కామెడీ స్టూడియోను బృహన్ ముంబయి పురపాలక సంస్థ కూల్చేవేయడంతో వివాదం మరింత ముదిరింది. ఈ చర్యలపై కునాల్ కమ్రా స్పందించారు. తాను షో నిర్వహించిన వేదికను కూల్చేయడం అర్థంలేని చర్య అని వ్యాఖ్యానించారు. ఒక రాజకీయ నాయకుడిని విమర్శించినందుకు ఒక వేదికను ధ్వంసం చేయడం సరికాదని ఆయన అన్నారు. తన జోక్‌లకు వేదిక బాధ్యత వహించదని, భావప్రకటనా స్వేచ్ఛను కాపాడాలని ఆయన కోరారు. చట్ట ప్రకారం చర్యలకు సహకరిస్తానని, కానీ విధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించారు. అలాగే, తాను షిండేకు క్షమాపణ చెప్పనుగాక చెప్పనని తేల్చిచెప్పారు. గతంలో అజిత్ పవార్ అన్న మాటలనే నేను ఇప్పుడు అన్నానని తెలిపారు. 'వినోద వేదిక అనేది అన్ని రకాల ప్రదర్శనలకు ఒక స్థలం... షోలో నా జోకులకు ఇది బాధ్యత వహించదు. నేను ఏమి చెప్పినా, ఏమి చేసినా దానిపై వారికి నియంత్రణ లేదు. ఏ రాజకీయ పార్టీకి కూడా లేదు. ఒక కమెడియన్ మాటలకు వేదికపై దాడి చేయడం అనేది మీరు ఆర్డర్ చేసిన బటర్ చికెన్ నచ్చలేదని టమోటాలు తీసుకెళ్తున్న లారీని పడగొట్టడం లాంటిదే' అని దుయ్యబట్టారు. తనకు గుణపాఠం చెబుతామని షిండే మద్దతుదారుల బెదిరింపుల గురించి కూడా ఆయన మాట్లాడారు. భావప్రకటనా స్వేచ్ఛ అంటే 'అధికారంలో ఉన్నవారిని, ధనవంతులను పొగడడానికి మాత్రమే కాదు. ఈ రోజుల్లో మీడియా మనల్ని అలా నమ్మేలా చేస్తుంది.. .ఒక శక్తివంతమైన వ్యక్తి గురించి జోక్ వేస్తే మీకు నచ్చకపోవచ్చు. కానీ అది నా హక్కును మార్చదు... మన నాయకులను, మన రాజకీయ వ్యవస్థను విమర్శించడం చట్టవిరుద్ధం కాదు' అని కమ్రా పేర్కొన్నారు. అయితే, చట్టపరంగా తనపై తీసుకునే చర్యలకు సహకరిస్తానని ఆయన చెప్పారు. అయితే, తన తదుపరి షో కోసం ఎల్ఫిన్‌స్టోన్ బ్రిడ్జ్‌ను ఎంచుకుంటానని, అక్కడ కూల్చివేయాల్సిన నిర్మాణాలు చాలా ఉన్నాయని ఆయన అన్నారు. 2017 సెప్టెంబర్‌లో ఎల్ఫిన్‌స్టోన్ వంతెనపై తొక్కిసలాట చోటుచేసుకుని 23 మంది మరణించారు. ఆ దుర్ఘటనకు ముందు, వంతెన పరిస్థితిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పాత వంతెనను కూల్చివేసి కొత్తది నిర్మించాలని అధికారులను కోరారు. ప్రమాదం జరగడానికి ఏడాది ముందు ఒక వ్యక్తి ఎక్స్ (ట్విట్టర్)లో ప్రధానమంత్రికి, రైల్వే మంత్రికి ట్యాగ్ చేస్తూ ఒక పోస్ట్ పెట్టాడు. అది నిజమైంది.

భారత్-పాక్ సరిహద్దుల్లో 6 ఏళ్ల తర్వాత తెరుచుకున్న బ్రిడ్జి

న్యూఢిల్లీ-నవభూమి: భారత్, పాక్ దేశాల మధ్య ఉన్న కమాన్ వంతెనను 6 ఏళ్ల తర్వాత తొలిసారి తెరవడం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. 2019లో పుల్వామా ఉగ్రదాడి అనంతరం మూసివేసిన ఈ కమాన్ వంతెనను.. తాజాగా శనివారం అధికారులు తెరిచారు. భారత్-పాక్ సరిహద్దుల్లో.. రెండు దేశాల మధ్య సంబంధాలకు కేంద్రంగా జీలం నదిపై ఉన్న కమాన్ వంతెన తెరవడం ఇప్పుడు గమనార్హం. జీలం నదిలో దూకి ఓ యువతి, యువకుడు ఆత్మహత్య చేసుకోగా.. వారి మృతదేహాలను తిరిగి బయటికి తీసుకువచ్చేందుకు ఈ కమాన్ వంతెనను తాజాగా తెరిచారు. ఇక ఈ కమాన్ వంతెనను తెరవడం రాజకీయంగానే కాకుండా మానవతా చర్యగా అధికారులు పేర్కొంటున్నారు. ఈనెల 5వ తేదీన జమ్మూ కాశ్మీర్ బారాముల్లా జిల్లాలోని బాస్ట్రాన్, కమల్ కోట్ గ్రామాలకు చెందిన ఓ యువకుడు, యువతి జీలం నదిలో మునిగిపోయినట్లు భారత సైన్యం తెలిపింది. 22 ఏళ్ల యువకుడు, 19 ఏళ్ల యువతి మృతదేహాలు జీలం నదిలో నీటి ప్రవాహం ధాటికి భారత సరిహద్దులు దాటి పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లినట్లు వెల్లడిం చారు. అయితే జీలం నదిలో మునిగిపోయిన ఆ యువతీ, యువకుల మృతదేహాలను వెలికి తీసేందుకు ఇండియన్ ఆర్మీ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించింది. అయితే మొదటగా యువకుడి మృతదేహం భారత భూభాగం వైపు కనిపిం చింది. అయితే ఆ యువకుడి మృతదేహాన్ని వెలికితీసే లోపే నీటి ప్రవాహంలో నియంత్రణ రేఖను దాటి అది అవతలి వైపునకు కొట్టుకుపోయింది. చివరికి పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్-పీఓకేలోని చినారి సమీపంలో పాక్ భూభాగం వైపు కనిపించింది. అనంతరం ఆ ప్రాంతం నుంచి యువకుడి శవాన్ని ఆర్మీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక యువతి మృతదేహం కూడా పీఓకేలోనే స్వాధీనం చేసుకున్నారు. ఆ యువతీ యువకుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న తర్వాత.. వాటిని తిరిగి భారత భూభాగంలోకి తీసుకువచ్చేందుకు ఈ కమాన్ వంతెనను శనివారం తెరిచారు. శాంతి వంతెనగా పిలిచే ఈ కమాన్ వంతెనను మానవతా దృక్పథంతో శనివారం అధికారులు ఓపెన్ చేశారు. ఇద్దరి మృతదేహాలను సజావుగా తీసుకువచ్చేందుకు భారత్-పాక్ సైనిక అధికారులు ఒకరికొకరు సహకరించుకోవడం గమనార్హం. ఈ కమాన్ వంతెనను 2005లో ప్రారంభించగా.. 2019 ఫిబ్రవరిలో పుల్వామా ఉగ్రదాడుల తర్వాత మూసివేయడంతో రెండు దేశాల మధ్య ఈ వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. గతంలో ఈ కమాన్ వంతెన జమ్మూ కాశ్మీర్, పీఓకే మధ్య ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఉపయోగపడేది. ఇరువైపుల ఉన్న బంధువులు ఒకరినొకరు కలుసుకునేందుకు ఈ కమాన్ వంతెన ద్వారానే ప్రయాణించేవారు.

అమ్మాయి ఇష్టంతో శారీరక సంబంధం నెరిపినా

అత్యాచారం కిందకే వస్తుంది.. ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ-నవభూమి: పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి మహిళతో శారీరక సంబంధం నెరిపి.. ఆపై ఆమెను వదిలేస్తే.. అత్యాచారం కిందకే వస్తుందని ఢిల్లీ హైకోర్టు తేల్చి చెప్పింది. వివాహ బంధం వాస్తవ రూపం దాల్చడంలోని కష్టాలను ముందే అంచనా వేయాల్సిన అదనపు బాధ్యత వయసు రీత్యా తనకన్నా పెద్దది అయిన మహిళదేనని వాదించడం పురుషాధిపత్యం కిందకే వస్తుందని వివరించింది. అలాగే దీన్ని స్త్రీ ద్వేష దృక్పథంగానే పరిగణించాల్సి వస్తుందని చెప్పింది. పెళ్లి పేరుతో నమ్మించి శారీరక సంబంధం కొనసాగించి ఆపై వదిలేసిన ఓ వ్యక్తిపై.. మహిళ పెట్టిన అత్యాచార కేసును కొట్టివేసేందుకు నిరాకరించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. వారిద్దరూ ఒకే కంపెనీలో పని చేశారు. ఈక్రమంలోనే వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడగా స్నేహితులు అయ్యారు. ఆ తర్వాత వీరి బంధం బలపడగా.. ప్రాణంగా ప్రేమిస్తున్నాను, పెళ్లంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటానంటూ సదరు అబ్బాయి.. అమ్మాయిని నమ్మించాడు. ఎలాగూ పెళ్లి చేసుకుంటాం కదా అనుకుని ఇద్దరూ పరస్పర అంగీకారంతో శారీరకంగా కలిశారు. 2018వ సంవత్సరం నుంచి 2021 వరకు మూడేళ్ల పాటు ఇలా శారీరక సంబంధం కొనసాగించారు. అలాగే తన డబ్బు అవసరం ఉన్న ప్రతీ సారి అమ్మాయి నుంచి తీసుకున్నాడు. ఇదంతా ఇలా ఉండగా సదరు అమ్మాయి పెళ్లి చేసుకుందామని అతడిని కోరింది. కానీ అతడు మాత్రం వద్దు.. నేను నిన్ను పెళ్లి చేసుకోలేనంటూ చెప్పాడు. అలాగే తానిచ్చిన డబ్బు తిరిగి ఇవ్వమన్నా అతడు ఒప్పుకోలేదు. దీంతో మోసపోయిన అమ్మాయి తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి మోసం చేశాడని.. లైంగిక దోపిడీకి పాల్పడ్డాడంటూ అత్యాచారం కేసు పెట్టింది. ఈ కేసును కొట్టి వేయాలంటూ సదరు యువకుడు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశాడు. ఈక్రమంలోనే సోమవారం రోజు ఢిల్లీ హైకోర్టులో విచారణ జరగ్గా.. పరస్పర అంగీకారంతోనే వారిద్దరూ శారీరక సంబంధం కొనసాగించారని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు.

కానీ జస్టిస్ స్వరణ కాంత శర్మ.. ఇరువైపులా వాదనలు విన్న తర్వాత షాకింగ్ కామెంట్లు చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళను మోసం చేసిన వాళ్లు చట్టం పరిశీలన నుంచి తప్పించుకోజాలరని అన్నారు. పెళ్లి నిజ రూపం దాల్చడంలో గల సమస్యలను ముందుగానే అంచనా వేయాల్సిన బాధ్యత వయసురీత్యా పెద్దది అయిన మహిళదేనని వాదించడం పురుషాధిపత్యం కిందకు వస్తుందని చెప్పారు. దీన్ని స్త్రీ ద్వేష దృక్పథంగానే పరిగణించాల్సి వస్తుందన్నారు. ఆరోపణల తీవ్రత దృష్ట్యా నిందితుడిపై దాఖలైన కేసును పూర్తిస్థాయి విచారణ జరక్కుండా కొట్టివేయడం సరికాదంటూ.. కేసును కొట్టి వేసేందుకు నిరాకరించారు.

దేవుళ్లు సరిగానే ఉన్నారు.. మనుషులు మాత్రమే తేడా

న్యూఢిల్లీ-నవభూమి: దేవుళ్లంతా సరిగ్గానే ఉన్నారని, కొందరు మనుషుల మనస్తత్వాలే తేడాగా ఉన్నాయంటూ మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం కటువైన వ్యాఖ్యలు చేసింది. మదురై జిల్లా తిరుప్పరంకుంద్రం పర్వతానికి సంబంధించిన దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఇలా స్పందించింది. తిరుప్పరం గుంద్రాన్ని 'జైన కొండ'గా ప్రకటించాలని కోరుతూ విల్లుపురం స్వస్తిశ్రీ లక్ష్మీసేన స్వామి పిటిషన్ దాఖలు చేసింది. ఇది జాతీయ ప్రాముఖ్యత కలిగిన పర్వతమని, జైనులతో దీనికి సంబంధం ఉందని, కాబట్టి జైన కొండగా ప్రకటించాలని అభ్యర్థించారు. అంతేకాదు, జైనమత విశ్వాసాలకు విరుద్ధంగా కొండపై జరిగే కార్యకలాపాలు నిషేధించాలని కోరారు. తిరుప్పరంగుండ్రం కొండను పునరుద్ధరించి.. రక్షించేలా ఉత్తర్వులు వెలువరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటుగా తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న సికిందర్ బాషా దర్గాలో నిర్వాహకులు జంతు బలులు, మాంసాహారం వండి, వడ్డించడంపై నిషేధం విధించాలని చోళై అళగుపురానికి చెందిన చోలైకన్నన్.. కొండపై నెల్లితోపు ప్రాంతంలో ముస్లింల ప్రార్థనలు, ఇతర కార్యక్రమాలను నిషేధించాలని కోరుతూ రామలింగం అనే వ్యక్తులు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై మదురై ధర్మాసనంలోని న్యాయమూర్తులు జస్టిస్ జె.నిషాభాను, జస్టిస్ ఎస్.శ్రీమతి సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మదురై జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌లు కౌంటర్ అఫిడవిట్లు వేశారు. తిరుప్పరంగుండ్రం కొండ చుట్టూ ఉన్న ఆలయాల్లో జంతు బలులివ్వడం ఆచారంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. కొండ ఉత్తరం వైపున మురుగన్ ఆలయం, దక్షిణం వైపున జైన చిహ్నాలు, మధ్యలో దర్గా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతాన్ని హిందువులు 'స్కందమలై' అంటే, ముస్లింలు 'సికిందర్ హిల్' అని, జైనులు 'జైన హిల్' అని, స్థానికులు 'తిరుప్పరంకుండ్రం కొండ' అని పిలుస్తుంటారని వివరించారు. అన్ని మతాల మధ్య ఐక్యత, సామరస్యం నెలకొనాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని, ఇందులో బాగంగా జనవరి 30వ ఇరు మతాల మధ్య శాంతి సమావేశం నిర్వహించామని తెలిపారు. దర్గాకు వచ్చిన వారి కోర్కెలు నెరవేరితే మేకలు, కోళ్లు బలిచ్చి మొక్కులు చెల్లించుకుంటారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పూజా విధానాలనే కొనసాగించాలని, బయటవాళ్లు జోక్యం చేసుకోరాదని, ఈ విషయంలో గందరగోళం సృష్టించరాదని ఆ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వివరించారు. కవలం ముస్లింలు మాత్రమే కాకుండా ఇతర మతాలకు చెందినవారు తమ కోర్కెలు ఫలిస్తే మేకలు, కోళ్లను బలిచ్చి.. అక్కడే వండుకుని కలసి భోజనం చేసే ఆనవాయితీ కూడా ఉందన్నారు. అలాగే, ప్రార్థనా స్థలాల చట్టం 1991 ప్రకారం 1947 ఆగస్టు 15 నాటికి ముందున్న యథాతథస్థితిని కొనసాగించాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పిందని ఇందులో గుర్తు చేశారు. తిరుప్పరంకుండ్రం సమస్యకు పరిష్కారం లభించిందని ప్రభుత్వం తరఫున హాజరైన లాయర్ వివరించారు. ఈ కొండ నిర్వహణ పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉందని, ఏదైనా చేయాలంటే వారి నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలకు కొంత సమయం ఇవ్వాలని ఆర్కియాలజీ విభాగం తరఫు లాయర్ విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ వివాదంపై 1923లో మదురై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను బ్రిటిష్ కౌన్సిల్ ధ్రువీకరించిందని పిటిషనర్లు తరఫున లాయర్ తెలియజేశారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ. తిరుప్పరంకుండ్రం అందరికీ సొంతమైందని పేర్కొంది.

జస్టిస్ వర్మ ఇంట్లో భారీగా నగదు రికవరీ.. అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చిన రాజ్యసభ చైర్మన్

న్యూఢిల్లీ-నవభూమి: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీ స్థాయిలో నగదు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టి స్తోంది. దీనిపై ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారంపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలని కొందరు డిమాండు చేయగా జస్టిస్ వర్మను అభిశంసించాలని మరికొందరు సూచించారు. ఇది చాలా పెద్ద విషయమని, న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతిన్నదని ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ సోమవారం అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో వర్మ ఇంట్లో నగదు రికవరీ అంశంపై చర్చించేందుకు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఈ వ్యవహారం తీవ్రమైనదిగా చైర్మన్ అభివర్ణించారు. ఈ అంశంపై సభలో అధికార, ప్రతిపక్ష నాయకులతో చర్చలు జరిపినట్లు చెప్పారు. వారి సూచనల మేరకు అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. 'జస్టిస్ వర్మ విషయంపై చర్చించేందుకు ఈరోజు సాయంత్రం 4:30 గంటలకు అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశాను' అని మంగళవారం రాజ్యసభలో చైర్మన్ అన్నారు. ఈ సమస్య చాలా తీవ్రమైనదని, ఈ అంశంపై ఫ్లోర్ లీడర్లతో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

మా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకునే అవకాశం..

న్యూఢిల్లీపై మరోసారి నోరుపారేసుకున్న కెనడా

న్యూఢిల్లీ-నవభూమి: భారత్‌పై కెనడా మరోసారి నోరు పారేసుకుంది. ఆ దేశంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకునే అవకాశం ఉందని ఆ దేశ స్పై ఏజెన్సీ ఆరోపించింది. భారత్‌తోపాటు చైనా, రష్యా, పాకిస్థాన్ దేశాలు కూడా ఆ ప్రయత్నం చేయొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేసింది. కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ వానెస్సా లాయిడ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'త్వరలో మా దేశంలో జరగబోయే ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు పీఆర్‌సీ (పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా) ఏఐ ఆధారిత సాధనాలను ఉపయోగించే అవకాశం ఉందని మాకు సమాచారం ఉంది. ఈ ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే ఉద్దేశం, సామర్థ్యం భారత ప్రభుత్వానికి కూడా ఉందని మేం భావిస్తున్నాం. రష్యా, పాకిస్థాన్ దేశాల కూడా ఆ ప్రయత్నాలు చేయొచ్చు' అని లాయిడ్ ఆరోపించారు. కాగా.. గతంలో కెనడా ఇలాంటి ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. 2019, 2021లో జరిగిన ఎన్నికల్లో భారత్, పాకిస్థాన్ దేశాలు జోక్యం చేసుకున్నట్లు కెనడా సెక్యూటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఆరోపణ చేసింది. ఈ ఆరోపణలపై ఆ దేశం దర్యాప్తునకు ఆదేశించింది. ఈ దర్యాప్తులో భారత్ జోక్యం చేసుకోలేదని తేలింది. కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకోలేదని, ప్రధాని జస్టిస్ ట్రూడో విజయంలో ఆ దేశ పాత్ర ఏమీ లేదని కెనడా విచారణాధికారులు వెల్లడించారు. 2021లో జరిగిన జాతీయ ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకోలేదని గుర్తించామని కెనడా సీనియర్ అధికారుల బృందం పేర్కొన్నది. అయితే గత రెండు ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకున్నట్లు గుర్తించామని కెనడా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ తెలిపింది. మరోవైపు కెనడా ఎన్నికల్లో జోక్

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ బుధవారం 26 | మార్చి | 2025

నందమూరి ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. 'ఆదిత్య 369' రీ రిలీజ్ డేట్ వచ్చేసింది

టాలీవుడ్ సీనియర్ నటుడు నందమూరి బాలకృష్ణ నటించిన క్లాసిక్ చిత్రాలలో ఆదిత్య 369 ఒకటి. సైన్స్ ఫిక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ సినిమాకు దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాస రావు దర్శకత్వం వహించగా.. 1991 ఆగస్టు 18న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా పలు అవార్డులను గెలుచుకుంది. ఈ చిత్రం భారతీయ సినిమాలో మొట్టమొదటి టైమ్ ట్రావెల్ చిత్రంగా పరిగణించబడుతుంది. ఇక ఈ సినిమాలో బాలకృష్ణ విజయనగర సామ్రాజ్య రాజు శ్రీ కృష్ణదేవరాయలుగా నటించి అలరించారు. అయితే ఈ సినిమా వచ్చిన 34 ఏండ్ల తర్వాత మూవీని మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. మొదట సమ్మర్ కానుకగా మే నెలలో విడుదల చేద్దామనుకున్నారు మేకర్స్. అయితే అభిమానులకు గుడ్ న్యూస్ చెబుతూ ఒక నెల ముందుగానే విడుదల చేయబోతున్నారు.

తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను ఏప్రిల్ 04 రీ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఇళయరాజా సంగీతం అందించిన ఈ చిత్రంలో మోహిని హీరోయిన్‌గా నటించగా, అమ్రిష్ పూరి, టినూ ఆనంద్, నటుడు తరుణ్ సుత్తివేలు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని ఎస్. అనిత కృష్ణ నిర్మించారు, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శ్రీదేవి మూవీస్ బ్యానర్‌పై తెరకెక్కింది.

శ్రీలీల ఊర మాస్..వొంగోబెట్టి వేస్తుంది!

టాలీవుడ్ డాల్ శ్రీలీల ఆన్ స్క్రీన్ అప్పిరియన్సే కాదు ఆఫ్ స్క్రీన్ అప్పిరియన్స్ అంతే అట్రాక్టివ్‌గా ఉం టుంది. అమ్మడి చలాకీతనానికే బోలెడంత ఫాలోయింగ్ ఉంది. రష్మికా మందన్నా తర్వాత శ్రీలీల ఎనర్జీ, యాక్టివ్ నెస్ గురించే యువతలో అనునిత్యం చర్చ. శ్రీలీల తెలుగు అమ్మాయి కావడం అమ్మడికి మరింత కలిసొస్తుంది. తెలుగు ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యేలా అప్పుడప్పుడు ఊర మాస్ పంచ్ లు కూడా వదలుతుంటుంది. తాజాగా అమ్మడు మరోసారి అలాంటి పంచ్ తో కుర్రాళ్లను ఆకట్టుకుంటుంది. ఓ ఈవెంట్ లో చదువుకునే సమయంలో ఎప్పుడైనా చిట్టీలు పెట్టారా? అంటే అలాంటివి చేస్తే అమ్మ వొంగో బెట్టి వాయించేస్తుందని కిలా కిలా నవ్వేసింది. దీంతో స్టేజ్ కిందనున్న కుర్రకారు కూడా ఒక్కసారిగా కిర్రెక్కి బోయారు. ఒక్కసారిగా ఈలలు ...కేకలు వేస్తూ మరింత జోష్ నింపారు. ఇలాంటి చలోక్తులు శ్రీలీలకు బాగా అలవాటైన పనే. ఎంతైనా తెలుగు పిల్ల కదా. మోనోక్రోమ్ ఫోటోల్లో మరింత అందంగా హైబ్రిడ్ పిల్ల శ్రీలీల మామ్ తో ఉండే విధానం గురించి చెప్పాల్సిన పనిలేదు. కూతురంటే అమితమైన గారం ఆ తల్లికి. శ్రీలీల హీరోయిన్ అయిన తర్వాత మామ్ కూడా ఎక్కువగా కనిపిస్తుంది. కుమార్తెతో పాటు తల్లి కూడా అప్పుడప్పుడు సినిమా ఈవెంట్లకు హాజరవుతున్నారు. శ్రీలీలను హీరోయిన్ గా చూడాలన్నది మామ్ కల. అందుకే చిన్ననాటి నుంచి డాన్సింగ్ లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. చదువును కూడా ఏ మాత్రం అశ్రద్ధ చేయలేదు. తల్లి పెద్ద డాక్టర్ కావడంతో కుమార్తెను కూడా డాక్టర్ చదవించింది. బెంగుళూరులో సొంత ఆసుపత్రులున్నాయి. కన్నడ సెలబ్రిటీలు ఎక్కువగా అదే ఆసుపత్రికి వెళ్తుంటారు. ఆ రకంగా కన్నడ నాట బాగా ఫేమస్ అయ్యారు.

నితిన్ దీక్ష అందుకోసమేనా!

టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ గత కొన్ని సినిమాలుగా వరుస ఫ్లాపుల్లో ఉన్నాడు. ప్రతీ సినిమాపై ఆశలు పెట్టుకోవడం, ఆ సినిమా నితిన్ ఆశల్ని చల్లార్చడం మామూలైపోయింది. దీంతో ఈసారి ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో నితిన్, తనకు గతంలో భీష్మ లాంటి బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన వెంకీ కుడుముల దర్శకత్వంలో సినిమాను చేశాడు. వెంకీ కుడముల నితిన్ కోసం మరోసారి కామెడీ ఎంటర్టైనర్ ను రూపొందించాడు. శ్రీలీల హీరోయిన్‌గా తెరకెక్కిన ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. మార్చి 27న రాబిన్‌హుడ్ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆల్రెడీ నితిన్-వెంకీ కాంబోలో వచ్చిన భీష్మ మంచి హిట్ అవడంతో రాబిన్‌హుడ్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి. మోనోక్రోమ్ ఫోటోల్లో మరింత అందంగా హైబ్రిడ్ పిల్ల ఆ అంచనాలకు తగ్గట్టే సినిమా నుంచి రిలీజైన ప్రతీ కంటెంట్ ఆడియన్స్ కు రాబిన్‌హుడ్ పై అంచనాలను పెంచేసింది. నితిన్ తన కెరీర్లో ఎప్పుడూ ఏ సినిమాకీ చేయనంత పబ్లిసిటీ ఈ సినిమాకు చేస్తున్నాడు. దానికి కారణం నితిన్ కు రాబిన్‌హుడ్ కంటెంట్ పైన, డైరెక్టర్ వెంకీ కుడుములపై ఉన్న నమ్మకమే. రాబిన్‌హుడ్ ప్రమోషన్స్ లో భాగంగా నితిన్ ఓ ఇంటర్వ్యూలో తాను రాబిన్‌హుడ్ మూవీ సక్సెస్ అవాలని హనుమాన్ దీక్ష తీసుకున్నట్టు తెలిపాడు. గతంలో కూడా నితిన్ పలుసార్లు హనుమాన్ మాల ధరించిన విషయం తెలిసిందే. కానీ ఈసారి నితిన్ హనుమాన్ దీక్ష మాత్రమే తీసుకున్నాడు. దానికి కారణం సినిమా ప్రమోషన్సే అని చెప్పాడు నితిన్. మాల ధరిస్తే ఎప్పుడూ సేమ్ కాస్ట్యూమ్ లో ఉండాలని, ఇంటర్వ్యూ టైమ్ లో ఒకే కాస్ట్యూమ్ లో కనిపిస్తే పాత ఇంటర్వ్యూ అనుకుంటారని అందుకే ఈసారి కేవలం దీక్ష మాత్రమే తీసుకున్నానని నితిన్ తెలిపాడు. కేవలం బట్టలు మాత్రమే నార్మల్ గా వేసుకుంటున్నానని, దీక్షకు, మాలకు నియమాలన్నీ సేమ్ అని, మూడు వారాల పాటూ తాను ఈ దీక్ష తీసుకుంటున్నానని నితిన్ తెలిపాడు. తన తాతయ్య ఆంజనేయ స్వామికి చాలా పెద్ద భక్తుడని, చిన్నప్పుడు ఆయన ప్రతీ శనివారం తనను కూడా గుడికి తీసుకెళ్లేవారని, తన జయం సినిమాలో కూడా ఆంజనేయ స్వామి జెండా ఉంటుందని, ఆ సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో అప్పట్నుంచి తాను ఆంజనేయ స్వామికి పెద్ద భక్తుడిగా మారానని నితిన్ చెప్పాడు. ఆ తర్వాత నితిన్ శ్రీ ఆంజనేయం అనే సినిమాను కూడా చేసిన సంగతి తెలిసిందే.

నాకు కరాటేలో బ్లాక్ బెల్ట్ వచ్చింది ఆయన వల్లే : పవన్‌కల్యాణ్

ప్రముఖ కోలీవుడ్ నటుడు, పవన్ కళ్యాణ్ గురువు షిహాన్ హుస్సేనీ(60) కన్నుమూశారు. కొన్నిరోజులుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. అతని మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవన్‌కల్యాణ్ కూడా ఆయన మృతి పట్ల సంతాపం తెలిపాడు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. ప్రముఖ మార్షల్ ఆర్ట్స్, ఆర్చరీ శిక్షకులు షిహాన్ హుస్సైనీ తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాను. నేను ఆయన వద్ద కరాటే శిక్షణ పొందాను. మార్షల్ ఆర్ట్స్ గురు హుస్సైనీ అనారోగ్యంతో బాధపడుతున్నారని నాలుగు రోజుల కిందటే తెలిసింది. వారి ఆరోగ్యం గురించి చెన్నైలోని నా మిత్రుల ద్వారా వాకబు చేసి, విదేశాలకు పంపించి మెరుగైన వైద్యం చేయించాల్సి ఉంటే అందుకు తగిన ఏర్పాట్లు చేస్తానని తెలిపాను. అలాగే ఈ నెల 29వ తేదీన చెన్నై వెళ్ళి హుస్సైనీని పరామర్శించాలని నిర్ణయించుకొన్నాను. ఇంతలో దుర్వార్త వినాల్సి రావడం అత్యంత బాధాకరం. హుస్సైనీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.చెన్నైలో హుస్సైనీ కరాటేను చాలా కఠినమైన నియమ నిబంధనలతో నేర్పేవారు. ఆయన చెప్పినవి కచ్చితంగా పాటించేవాడిని, తొలుత ఆయన కరాటే నేర్పేందుకు ఒప్పుకోలేదు. ప్రస్తుతం శిక్షణ ఇవ్వడం లేదు, కుదరదు అన్నారు. ఎంతో బతిమాలితే ఒప్పుకొన్నారు. తెల్లవారుజామునే వెళ్ళి సాయంత్రం వరకూ ఆయన దగ్గర ఉంటూ కరాటేలో బ్లాక్ బెల్ట్ శిక్షణ పొందాను. తమ్ముడు చిత్రంలో కథానాయక పాత్ర కిక్ బాక్సింగ్ నేర్చుకొనేందుకు కఠోర సాధన చేసే సన్నివేశాలకు నాటి నా శిక్షణ అనుభవాలు దోహదం చేశాయి. హుస్సైనీ శిక్షణలో సుమారు మూడు వేల మంది బ్లాక్ బెల్ట్ స్థాయికి చేరారు. హుస్సైనీ తమిళనాడులో ఆర్చరీ క్రీడకు ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేశారు. ఆ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ లో ముఖ్య బాధ్యతలు నిర్వర్తించారు.

మహాత్మా జ్యోతి రావు ఫూలేపై బయోపిక్.. ట్రైలర్ చూశారా.!

దేశంలో మనుషులంతా సమానత్వంతో జీవించాలని ఆకాంక్షించి, ఆధిపత్యవాదానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాటం చేసిన ప్రముఖ సామాజిక తత్వవేత్త, మహిళల హక్కుల కోసం పోరాడిన ప్రముఖ వ్యక్తి మహాత్మా జ్యోతి రావు ఫూలే (1827-1890) జీవిత చరిత్ర ఆధారంగా బాలీవుడ్‌లో ఒక సినిమా రాబోతుంది. ఫూలే అనే టైటిల్‌తో ఈ సినిమా రాబోతుండగా.. ఫూలే పాత్రలో గుజరాతీ నటుడు ప్రతీక్ గాంధీ నటిస్తున్నాడు. అతడి భార్య సావిత్రి బాయి ఫూలే పాత్రలో బాలీవుడ్ నటుడు రాజ్ కుమార్ రావు భార్య పత్రలేఖ నటిస్తుంది. అనంత్ నారాయణ్ మహాదేవన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. జీ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రణయ్ చోక్షి, జగదీష్ పటేల్, రితేష్ కుదేచా, అనుయా చౌహాన్ కుదేచా, సునీల్ జైన్ తదితరులు ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్.ఈ ట్రైలర్ చూస్తుంటే.. దేశంలో మనుషులంతా సమానత్వంతో జీవించాలని ఆకాంక్షించి వర్ణ, లింగ వివక్షకు వ్యతిరేకంగా.. దళిత, గిరిజన, బహుజన వర్గాల అభ్యున్నతి, మహిళల హక్కుల కోసం జ్యోతిబా ఫూలే చేసిన పోరాటం ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్రబృందం తెలిపింది.

పూజా హెగ్డే ఎక్కువగా ఊహించుకుంటుందా..!

టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే మూడు సంవత్సరాలుగా ఒక్క తెలుగు సినిమాలోనూ నటించలేదు. ఈమె చివరిగా 'ఆచార్య'లో గెస్ట్ రోల్‌లో కనిపించగా, ఎఫ్ 3 లో ఐటెం సాంగ్‌లో కనిపించింది. హీరోయిన్‌గా నటించి దాదాపు ఐదేళ్లు అవుతుంది. టాలీవుడ్‌కి పూజా హెగ్డే దాదాపుగా దూరం అయినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా దక్కిన స్టార్‌డంతో కోలీవుడ్, బాలీవుడ్‌లోనూ పూజా హెగ్డే ఆఫర్లు దక్కించుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు కోలీవుడ్‌లో మూడు సినిమాలు, హిందీలో రెండు సినిమాలను చేస్తుంది. నటిగా ప్రస్తుతం ఫుల్ బిజీగా ఉన్నా టాలీవుడ్‌లో నటించడం లేదనే అసంతృప్తి ఫ్యాన్స్‌లో ఉంది. మోనోక్రోమ్ ఫోటోల్లో మరింత అందంగా హైబ్రిడ్ పిల్ల హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో ఉన్న సమయంలో పూజా హెగ్డే గురించి కొందరు కావాలని, డబ్బులు ఖర్చు చేసి మరీ తప్పుడు ప్రచారం చేశారట. ఈ విషయాన్ని స్వయంగా పూజా హెగ్డే ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ఆ ఇంటర్వ్యూలో పూజా హెగ్డే మాట్లాడుతూ.. నా ఎదుగుదలను తట్టుకోలేక కొందరు నాపై తప్పుడు ప్రచారం చేయించారు. సోషల్ మీడియాలో నాపై ట్రోల్స్ చేయించారు. అందుకోసం కోట్ల రూపాయలు ఖర్చు అయినట్టు నాకు తెలిసింది. నాపై వారు చేసిన ట్రోలింగ్‌కు చాలా బాదేసింది. ముఖ్యంగా నా కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక క్షోభను అనుభవించారు. నా తల్లిదండ్రుల బాధ చూడలేక ట్రోలింగ్ ఆపమని విజ్ఞప్తి చేస్తే డబ్బులు డిమాండ్ చేశారని పూజా షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. %ూశ్రీంశీ =ఖుఽ% - గాడ్ ఫాదర్ సీక్వెల్ కు ఛాన్స్ లేదు! నేను ఎవరికీ చెడు చేయలేదు, ఎవరిని ఇబ్బంది పెట్టలేదు. అయినా ఎందుకు కోట్లు ఖర్చు చేసి మరీ నాపై ట్రోలింగ్ చేయించారు అనేది అర్థం కాలేదని పూజా హెగ్డే ఆవేదన వ్యక్తం చేసింది. తనపై వస్తున్న ట్రోల్స్‌ను పట్టించుకోకుండా కెరీర్‌పై దృష్టి పెట్టి ముందుకు సాగుతున్నాను. తన గురించి జరిగిన తప్పుడు ప్రచారం గురించిన నిజానిజాలు తప్పకుండా బయటకు వస్తాయనే నమ్మకంను పూజా హెగ్డే వ్యక్తం చేసింది. తనను కోట్ల రూపాయలు ఖర్చు చేసి ట్రోల్ చేయిస్తున్నారు అంటూ పూజా హెగ్డే చేసిన వ్యాఖ్యలు షాకింగ్‌గా ఉన్నాయని, అయినా ఆమెను ట్రోల్ చేయించాల్సిన అవసరం ఎవరికి ఉందంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో పూజా హెగ్డే ఎక్కువ ఊహించుకుంటుందా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. సినిమా ఇండస్ట్రీలో ఉన్న వారికి ఏదో ఒక సమయంలో ట్రోల్స్ తప్పవు. అందరు హీరోయిన్స్ ఏదో ఒక సమయంలో విమర్శలు ఎదుర్కొన్నారు. కనుక పూజా హెగ్డే ను కావాలని ఖర్చు చేసి ట్రోల్ చేసి ఉండక పోవచ్చు అనేది కొందరి అభిప్రాయం. ఎవరు ఎంత ట్రోల్ చేసినా, కెరీర్ ఖతం అయిందని భావించినా బుట్ట బొమ్మ పూజా హెగ్డే తిరిగి పుంజుకుంది. ప్రస్తుతం కోలీవుడ్‌లో సూర్యకు జోడీగా నటిస్తున్న రెట్రో సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. రజనీకాంత్ కూలీ సినిమాలో ప్రత్యేక పాటలో కనిపించబోతుంది. ఇక విజయ్ చివరి సినిమా జన నాయగన్ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుంది. ఇటీవలే కాంచన 4 సినిమాలోనూ రాఘవ లారెన్స్‌కు జోడీగా నటించే అవకాశం ను సొంతం చేసుకుంది. కోలీవుడ్‌లోనే ఈ నాలుగు సినిమాలతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతుంది. మరో వైపు హిందీలో ఈమె ఇటీవల దేవ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఫ్లాప్ అయినా చేతిలో మరో రెండు హిందీ సినిమాలు ఉన్నాయి. కోలీవుడ్‌లో చేస్తున్న సినిమాలు హిట్ అయితే కచ్చితంగా టాలీవుడ్‌లో మళ్లీ ఆఫర్లు దక్కించుకోవడం ఖాయం అని కొందరు అంటున్నారు. మరి పూజా హెగ్డే టాలీవుడ్‌లో తిరిగి

ఢిల్లీతో మ్యాచ్‌లో లక్నో ఓటమి.. సోషల్ మీడియాలో రిషబ్ పంత్, సంజయ్ గోయెంకా

న్యూదిల్లీ-నవభూమి: అశుతోష్ శర్మ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ వికెట్ తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. ఢిల్లీ జట్టు 210 పరుగుల లక్ష్యాన్ని మరో మూడు బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. అశుతోష్ 31 బంతుల్లో 66 పరుగుల చేసి లక్నో ఢిల్లీని విజేతగా నిలిపాడు. లక్నో ఓటమి తర్వాత ఫ్రాంచైజీ ఓనర్ సంజయ్ గోయెంకా, హెడ్‌కోచ్ జస్టిన్ లాంగర్‌తో కెప్టెన్ రిషబ్ పంత్ మాట్లాడాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైర్ అయ్యింది. ఓటమి తర్వాత పంత్‌కు సంజీవ్ గోయెంకా వార్నింగ్ ఇచ్చినట్లు పలువురు కామెంట్ చేశారు. గతంలో లక్నో కెప్టెన్‌గా వ్యవహరించిన కేఎల్ రాహుల్ పరిస్థితితే.. పంత్‌కు సైతం ఎదురవుతుందంటూ పలువురు పేర్కొంటున్నారు. గోయెంకా కారణంగా ఏ కెప్టెన్ అయినా అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోను పరిశీలిస్తే.. రిషబ్ పంత్.. సంజీవ్ గోయెంకాకు ఏదో వివరిస్తున్నట్లు కనిపిస్తున్నది. వీడియో లో రిషబ్ పంత్ సీరియస్ నెస్ చూస్తుంటే సంజీవ్ గోయెంకా జట్టు ప్రదర్శనపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా అనిపిస్తున్నది. ఢిల్లీతో జరిగిన మ్యాచ్ తర్వాత గోయెంకా మైదానంలోకి వచ్చి కెప్టెన్‌తో మాట్లాడడం కనిపించింది. ఆయన గతంలోనూ ఇదే తరహాలో వ్యవహరించారు. 2024 సీజన్‌లో అప్పటి లక్నో కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో ప్రవర్తించిన తీరు విధితమే. ఆ తర్వాత లక్నో జట్టును వీడిన కేఎల్ రాహుల్ ఢిల్లీ జట్టులోకి చేరాడు. కెప్టెన్సీ అవకాశం వచ్చిన ఒప్పుకోలేదని.. సంజయ్ గోయెంకా వ్యవహారం భారీగానే ప్రభావం చూపిందని పేర్కొంటున్నారు. 2024లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు లక్నో సూపర్ జెయింట్స్‌ను పది వికెట్ల తేడాతో ఓడించింది.

మాయావి విఘ్నేశ్

హైదరాబాద్-నవ భూమి:అంతర్జాతీయ స్థాయిలో అనుభవం లేదు. దేశవాళీలోనూ ఒక్క మ్యాచ్ ఆడలేదు. ప్రొఫెషనల్ క్రికెట్ ఆడిన అనుభవమూ తక్కువే. అవతలి వైపు చూస్తే ఎంతటి బౌలర్‌నైనా చిత్తుచేసే బ్యాటింగ్ దళం. స్పిన్నర్లను మిక్సీలో వేసి తాఫీగా జ్యూస్ చేసుకుని తాగే బ్యాటర్లు. క్రీజులో రుతురాజ్ దంచుతుంటే ఇక మ్యాచ్ ముగిసినట్టే! అనుకుంటున్న చెన్నై ఇన్నింగ్స్‌లో భారీ కుదుపు. ముంబై సారథి సూర్య చేతి నుంచి బంతినందుకున్న 24 ఏండ్ల కుర్రాడు.. సీఎస్‌కేను ముప్పు తిప్పలు పెట్టాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత దిగ్గజ సారథి ధోనీ ప్రశంసలు అందుకున్న కేరళ కుర్రాడు విఘ్నేశ్ పుతుర్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్.ఐపీఎల్ అంటే ధోనీ, రోహిత్, కోహ్లీ, స్టార్క్, మిల్లర్, బట్లర్ వంటి అంతర్జాతీయ స్టార్లే కాదు. ఎంతోమంది ఔత్సాహిక క్రికెటర్లు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు ఈ లీగ్‌ను మించిన వేదిక మరొకటి ఉండదు. ఐపీఎల్ ద్వారానే వెలుగులోకి వచ్చి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న క్రికెటర్లు ఎంతోమంది.. తాజాగా ఆ జాబితాలో చేరేందుకు నేనున్నానని దూసుకొచ్చాడు విఘ్నేశ్ పుతుర్. 24 ఏండ్ల ఈ మళప్పురం (కేరళ) కుర్రాడు.. ఆదివారం చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసి 32 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి ఆరంభ మ్యాచ్‌లోనే అదరహో అనిపించాడు. స్పిన్‌ను బాగా ఆడగలరన్న పేరున్న రుతురాజ్, దూబె, దీపక్ హుడా వంటి బ్యాటర్లను ఔట్ చేసి ముంబైని రేసులోకి తీసుకొచ్చాడు. మ్యాచ్ ఫలితం ఎలా ఉన్నా విఘ్నేశ్ స్పిన్‌కు మహేంద్రసింగ్ ధోనీ కూడా ఫిదా అయ్యాడంటే ఈ కుర్రాడి అమ్ములపొదిలో ఇంకా ఎన్ని అస్త్రాలు దాగున్నాయో!

చిక్కుల్లో భజ్జీ

హైదరాబాద్-నవ భూమి: టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ చిక్కుల్లో పడ్డాడు. ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌పై అతడు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పద మయ్యాయి. ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్చర్ భారీగా పరుగులు సమర్పిం చుకున్న నేపథ్యంలో హిందీ కామెంట్రీ చెబుతున్న భజ్జీ.. లండన్‌లో నలుపు రంగు క్యాబ్స్ మీటర్ల మాదిరిగానే ఇక్కడ (మ్యాచ్‌లో) ఆర్చర్ మీటర్ సైతం పెరుగుతూనే ఉంది' అని వ్యాఖ్యానించాడు. దీంతో సోషల్ మీడియాలో భజ్జీపై విమర్శలు వెల్లు వెత్తాయి. అతడి వ్యాఖ్యలు జాత్యాహంకారం కిందకే వస్తాయని ఆరోపిస్తూ. .కామెంట్రీ నుంచి తప్పించాలని నెటిజన్లు డిమాండ్ చేశారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**